సంపుటి : 78 సంచిక : 29 పుటలు : 52

# జాగృతి

కలి 5128 - శ్రీ పరాభవ వైశాఖ బహుళ తదియ
04-10 మే 2026
వెల : ₹20/-







# నిజమా.. నాటకమా?

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

# మోదీ పడవ ప్రయాణం

ప్రధాని నరేంద్ర మోదీ ఏప్రిల్ 24 ఉదయం పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా లో హుగ్లీ నదిలో పడవ ప్రయాణం చేశారు. నదీమతల్లిని బెంగాల్ ఆత్మగా అభివర్ణించారు. బెంగాల్ నాగరికత, చరిత్ర, వారసత్వ సంపదలకు చిహ్నంగా పేర్కొన్నారు.

ప్రిన్సేప్ ఘాట్ నుంచి నాంది పలికిన నదీ ప్రయాణంలో విద్యాసాగర్ సేతువు, హౌరా వంతెన వంటి కోల్‌కతా నగరానికి కీలకమైన నిర్మాణాలను తన దగ్గర ఉన్న కెమెరాతో ఫొటోలు తీశారు. పడవ నుంచి దిగి వచ్చిన తర్వాత స్థానికంగా పడవ నడిపే వారితో ముచ్చటించారు. ఉదయంపూట వ్యాహాళికి వచ్చిన వారితో మాట్లాడారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.









# త్రిశూర్ పూరమ్‌లో ఏనుగుల వరుస



**230** సంవత్సరాలుగా కేరళ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే ఆరు రోజుల త్రిశూర్ పూరమ్ ఉత్సవం ఏప్రిల్ **27**న త్రిశూర్‌లో ముగిసింది. ఎక్కడా లేని విధంగా ఈ ఉత్సవం కనిమంగళం శాస్త దేవస్థానం, చెంబుక్కవు కార్త్యాయని దేవస్థానం, పనముక్కుంపిల్లి శాస్త దేవస్థానం, పూక్కత్తిక్కర కరముక్కు భగవతి దేవస్థానం, చూరకొట్టుకవు భగవతి దేవస్థానం, లాలూర్ కార్త్యాయని దేవస్థానం, అయ్యన్‌థోలె కార్త్యాయని దేవస్థానం, కొట్టూర్ నేథలక్కవు భగవతి దేవస్థానం ఇలా ఎనిమిది దేవస్థానాల్లో ఏకకాలంలో జరిగింది. ధ్వజారోహణంతో మొదలైన త్రిశూర్ పూరమ్ ఉత్సవం శ్రీ వడక్కుమ్‌నాథన్ దేవస్థానం వద్ద పకల్‌పూరమ్, ఉపచారమ్ చొల్లి పిరియర్ పూజలతో ముగిసింది. దేశ,విదేశాల నుంచి వేలాదిగా వచ్చిన ప్రజలు తొమ్మిది దేవస్థానాల్లో జరిగిన పూజాదిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా భక్తిపారవశ్యంలో పరమానందభరితులయ్యారు. చివరి రోజున సంప్రదాయ పద్ధతిలో అలంకరించిన గజరాజులు వరుసకట్టి నిలుచున్న వైనం వీక్షకులను అమితంగా ఆకట్టుకుంది.



Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Managing Editor : kurra Durga Reddy.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

ఎం. శ్రీనివాస్ : సర్క్యులేషన్ ఇన్‌చార్జ్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం**
**9959991304**
**(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

డిజైనర్ : చిగుళ్ల కుమార్

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ **"To Bank / UPID"** ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 సంవత్సర చందా రూ.850

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

– సర్క్యులేషన్ ఇన్‌చార్జ్, జాగృతి

ప్రాచీన భారత చరిత్రలో కౌటిల్యుడి విదేశాంగ నీతి అత్యంత పరిణతి చెందిందిగా ప్రసిద్ధి. విదేశాంగ విధాన రూపకల్పనలో కౌటిల్యుడు చెప్పిన ఆరు సూత్రాల్లో మండల సిద్ధాంతం, షాడ్గుణ్య విధానం చాలా ముఖ్యమైనవి. తటస్థ వైఖరి ప్రయోజనకరమని భావించిన కేంద్ర ప్రభుత్వం ప్రపంచ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోంది. ఒకరి పక్షం వహించడమో, ఒక వైఖరి తీసుకోవడం వల్ల కలిగే మంచి చెడులను బేరీజు వేసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం గంభీరమైన రాజనీతిని ప్రదర్శిస్తోంది.

భారతీయ జనతా పార్టీ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత భారత విదేశాంగ విధానం లోపభూయిష్టంగా తయారయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల విషయంలో స్పష్టమైన వైఖరి ప్రదర్శించకపోవడం చేతగానితనంగా లెక్కగడుతున్నాయి మన విపక్ష పార్టీలు. మూడు మిత్ర దేశాల మధ్య యుద్ధ వాతావరణం తలెత్తినప్పుడు ఏదో ఒక పక్షం తీసుకోవడం వల్ల కలిగే విపరిణామాలు, పర్యవసానాలను పరిణతితో అంచనా వేయకుండా దుందుడుకుగా వైఖరి ప్రకటించడం అపరిపక్వతకు నిదర్శనమనేది కేంద్రం ప్రామాణిక వైఖరి.

భారత విదేశాంగ శాఖ మంత్రి, మాజీ దౌత్యవేత్త ఎస్.జైశంకర్ 2020లో రాసిన ‘The India Way’-Strategies for an uncertain world పుస్తకంలో భారత విదేశాంగ నీతికి ఇరుసు లాంటి పరిశీలన వెల్లడించారు. “This is a time for us to engage America, manage China, cultivate Europe, reassure Russia, bring Japan into play, draw neighbors in, extend the neighborhood and expand traditional constituencies of support” అన్నారు. భౌగోళిక రాజకీయ అనిశ్చితిలో తటస్థ వ్యూహాలే ఫలితాలిస్తాయంటారు జైశంకర్.

‘అమెరికాతో సంధి చేసుకోవాలి, చైనాను నియంత్రించాలి, యూరప్‌తో దౌత్య సంబంధాలు పెంచుకోవాలి, రష్యాకు నమ్మిక కలిగించాలి, జపాన్‌ను రంగంలోకి దింపాలి.. పొరుగు దేశాలను చేరదీయాలి, పక్క దేశాలతో చెలిమి చేస్తూ.. మద్దతు సంపాదించాలి’ అన్నారు జైశంకర్. ఈ తటస్థ వైఖరిని చేతగానితనంగా, విదేశాంగ

**శాలివాహన 1948 శ్రీ పరాభవ వైశాఖ బహుళ తదియ**

## లోపలి పేజీలలో...




ముఖపత్ర కథనం
**నిజమా.. నాటకమా?** 6లో

ధారావాహిక నవల
34 **గణపతిదేవుడు**
– మత్తి భానుమూర్తి 20లో



హెచ్చరిక
**వ్యక్తిత్వ హననంలో హిందూ సమాజం** 26లో



# జాగృతి

## సంపాదకీయం

విధాన వైఫల్యంగా భావిస్తే.. అది మన దేశంలోని ప్రతిపక్షాల అజ్ఞానమని అర్థం చేసుకోవాలి.

పశ్చిమాసియా సంక్షోభంలో పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించగానే 'విశ్వగురు' భారత్ ఏమైందంటూ వ్యంగ్యబాణాలు విసరడం మొదలుపెట్టాయి మన ప్రతిపక్షాలు. మన దేశంలోని కుహనా వామపక్ష మేధావులు అందుకు వంతపాడారు. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంపై తాజాగా ఇరాన్ చేసిన వ్యాఖ్యలు చూస్తే.. పాకిస్థాన్ తాహతు అర్థమవుతుంది. ఇరాన్ జాతీయ భద్రత విదేశాంగ

# తటస్థ వైఖరే తక్షణ అవసరం

విధాన కమిషన్ అధికార ప్రతినిధి ఇబ్రహీం రెజాయి అంతర్జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. పాకిస్థాన్ మధ్యవర్తిత్వానికి అవసరమైన విశ్వసనీయత లేదంటూ తేల్చి చెప్పారు. అటు అమెరికా పాకిస్థాన్‌ను విశ్వసించడం లేదు. అసీం మునీర్‌కు సుదీర్ఘ కాలంగా ఐఆర్జీసీ అంతర్జాతీయ విభాగం ఖుద్స్ ఫోర్స్‌తో ఉన్న సంబంధాల రీత్యా అగ్రరాజ్యానికి పాక్‌పై నమ్మకం లేదు. అమెరికా-పాకిస్థాన్ మధ్య ఉన్న సంబంధాల కారణంగా ఇరాన్‌కు ఇస్లామాబాద్‌పై విశ్వాసం లేదు.

సంక్లిష్ట భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల మధ్య భారత్ స్వతంత్ర వైఖరి అవలంబించేందుకు అనేక ఇక్కట్లను ఎదుర్కొంటోంది. రష్యాతో చమురు కొనుగోలు విషయంలో అమెరికాను ధిక్కరించింది. 'ఆపరేషన్ సిందూర్' వల్ల అగ్రరాజ్యం ఆగ్రహం వ్యక్తం చేస్తుందని తెలిసి కూడా.. తెగువను ప్రదర్శించింది. దశాబ్దాలుగా చైనాతో ఉన్న సరిహద్దు వివాదాలను పట్టువిడుపుల దౌత్యంతో క్రమానుగతంగా పరిష్కరించుకుంటోంది. బంగ్లాదేశ్ పరిణామాలపై భారత్ వైఖరి అమెరికాకు ఏ మాత్రం గిట్టదని తెలిసి కూడా బంగ్లాదేశ్ పదవీచ్యుత ప్రధాని షేక్ హసీనాకు ఆశ్రయం ఇచ్చింది.

పశ్చిమాసియా యుద్ధంలో ఉన్న అమెరికా-ఇజ్రాయిల్-ఇరాన్.. మూడు దేశాలతో భారత్‌కు సత్సంబంధాలున్నాయి. ఎవరి పక్షం తీసుకున్నా.. దేశ ప్రయోజనాలకు భంగం కలుగుతుంది. నిర్దిష్టంగా ఒకరి తరపున వకాల్తా పుచ్చుకోవడం వల్ల వాణిజ్య సంక్షోభం, ఇంధన వనరుల కొరత, రక్షణ పరికరాల దిగుమతులు అనిశ్చితిలో పడతాయి. అందుకే భారత్ మధ్యే మార్గాన్ని అనుసరించింది.

అంతర్జాతీయంగా భారత్ పరపతి బలపడుతున్న దశలో అమెరికాతో ద్వైపాక్షిక బంధం విషయంలో పరిణత వైఖరి ప్రదర్శించాలి. ప్రపంచ భారీ ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్ వేగంగా ఎదుగుతోంది. ఇండో పసిఫిక్ ప్రాంతంలో భారత్‌కు బాధ్యతాయుతమైన నాయకత్వం, అమెరికాతో భాగస్వామ్యం ద్వైపాక్షిక బంధానికి అత్యవసరం.

విదేశాంగ విధాన రూపకల్పనలో భౌగోళిక, చారిత్రక, ఆర్థిక, రాజకీయ, సామాజిక, సైనిక, సాంకేతిక అంశాలు కీలక పాత్ర పోషిస్తాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఏ దేశమైనా విదేశాంగ విధానాన్ని ఖరారు చేస్తుంది. అంతే తప్ప.. ఉద్వేగాలు, ఉద్రిక్తతల మధ్య వైఖరులు ప్రకటించడం విదేశాంగ నీతి అనిపించుకోదు. దేశీయ విధానం లాగే విదేశాంగ విధానం కూడా వాటిని రూపొందించే నేతల వ్యక్తిత్వం, స్వభావాలపై ఆధారపడి ఉంటుంది. ప్రధాని నరేంద్ర మోదీ అనుభవజ్ఞుడైన పాలకుడు. విదేశాంగ శాఖ మంత్రిగా ఉన్న ఎస్.జైశంకర్‌కు సుదీర్ఘ కాలం దౌత్యవేత్తగా పనిచేసిన అనుభవం ఉంది. ప్రధాని చుట్టూ నిపుణుల బృందం ఉంది. సమష్టి కృషిగా రూపొందిన భారతదేశ ప్రస్తుత విదేశాంగ విధానంలోని స్పష్టత గతంలో ఎన్నడూ లేదనే చెప్పాలి.

04 మే 2026, సోమవారం

అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ - బృహదారణ్యకోపనిషత్



38లో

కథ

**అడ్డగీత**

- దొండపాటి కృష్ణ

దరహాసం





ఓటెత్తిన బెంగాలీలు (జాతీయం) - 12
మారని తీరు ...రాష్ట్రం అప్పుల కుప్ప (తెలంగాణ) - 14
నూలు మిల్లులు కష్టాల నుంచి లాభాల దిశగా.. (ఆంధ్రప్రదేశ్) - 16
కోర్టులతో కేజ్రీవాల్ రాజకీయాలు (వివాదం) - 18
చర్చలు సాధ్యమా.. యుద్ధం ముగుస్తుందా? (అంతర్జాతీయం) - 24
చీడపురుగులను చట్టసభల్లోకి రానిద్దామా? (చర్చ) - 28
..మొదటి స్వదేశీ స్వాతంత్ర్య సమరయోధుడు (గళమెత్తిన గతం) - 30
సంస్కృతం జ్ఞాననిధికి మార్గం (ఆర్ఎస్ఎస్-100) - 32
సమయపాలనతో విజయం(వ్యక్తిత్వ వికాసం) - 35
ఐపీఎల్‌లో పరుగుల హోరు, శతకాల జోరు! (క్రీడ) - 43
బాలజాగృతి - 46
వేసవి సీజన్ చిన్న సినిమాలదే! (సినిమా) - 50

# నిజమా.. నాటకమా?



"మళ్లీ మిస్సయ్యిందా..?" స్థానిక కాలమానం ప్రకారం ఏప్రిల్ 24, శనివారం రాత్రి అమెరికాలోని వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌లో దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పై హత్యాయత్నం జరిగింది అన్న వార్త వినగానే నా సహోద్యోగి అన్న మాట ఇది. 2016 నుంచి ఇప్పటిదాకా తాజాగా జరిగిన దానితో లెక్క వేసుకుంటే ఆయనపై 15 హత్యాయత్నాలు జరిగాయి. నాకు తెలిసి అమెరికా చరిత్రలో ట్రంప్‌కు ముందు పనిచేసిన దేశాధ్యక్షుల్లో ఏ ఒక్కరిపైనా ఇన్నిసార్లు హత్యాయత్నాలు జరిగినట్టు దాఖలాలు లేవు. గడచిన పదేళ్లుగా ట్రంప్ వ్యవహారశైలి పట్ల కొద్దిపాటి అవగాహన ఉన్నవారికి సైతం శనివారం నాటి దాడి నిజమైందా లేక నాటకీయంగా సృష్టించిన ఘటనా అనే సందేహం రావడం సహజం. దీనికి నిదర్శనం అన్నట్టుగా హోటల్ వద్ద దుండగుడి హత్యాయత్నం విఫలమవ్వడంతో, సోషల్ మీడియా కుట్ర సిద్ధాంతాలతో నిండిపోయింది. లెఫ్టిస్టులు, రైటిస్టులు అనే తేడా లేకుండా చాలావరకు ఖాతాలు ఎటువంటి ఆధారాలు లేకుండా ఈ దాడిని "స్టేజ్‌డ్ – నాటకీయంగా సృష్టించినది" అని ఆరోపించాయి. సోషల్ మీడియా విశ్లేషణల సంస్థ ట్వీట్‌బైండర్ ప్రకారం, ఆదివారం మధ్యాహ్నానికి, 3,00,000కు పైగా పోస్టులలో "స్టేజ్‌డ్" అనే పదం కనిపించింది.

తమ ఆరోపణకు మద్దతుగా వివిధ రాజకీయ వర్గాలకు చెందిన ఇంటర్నెట్ వినియోగదారులు(నెటిజన్లు) చేసిన వాదనల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పడిపోతున్న ప్రజాదరణ నుంచి, ఇరాన్ యుద్ధం నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి ఈ కాల్పుల ఘటనను కల్పించారు అనే మాట గట్టిగా వినిపించింది. మరికొందరైతే అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత రావడంతో వైట్ హౌస్‌లో నిలిచిపోయిన బాల్‌రూమ్ నిర్మాణ పనుల పునరుద్ధరణకు మద్దతు కూడగట్టుకోవడానికే ఈ కాల్పుల ఘటన అని పోస్టులలో రాసుకొచ్చారు. నిజానికి, ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికే ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రంప్ తన బాల్‌రూమ్ గురించి ప్రస్తావించారు. ఈ ఘటన దాని నిర్మాణం ప్రాముఖ్యతను చూపిస్తుందని ఆయన అన్నారు. అలాగే మరుసటి రోజు ఉదయం ట్రూత్ సోషల్‌లో కూడా దీనిని పేర్కొన్నారు. ఇంతలో, పలువురు ట్రంప్ మద్దతుదారులు కొత్త బాల్‌రూమ్ అవసరాన్ని పునరుద్ఘాటించడానికి సోషల్ మీడియాను ఆశ్రయించారు. ఈ త్వరితగతిన, సమన్వయంతో కూడిన ప్రతిస్పందన ఒక పెద్ద కుట్రకు సాక్ష్యమని నెటిజన్లు ఆరోపించారు. ఘటన తర్వాత కార్యక్రమానికి సంబంధించిన కొన్ని వీడియోలు ఆన్‌లైన్‌లో వైరల్ అయ్యాయి. అవి ఈ వివాదానికి మరింత ఆజ్యం పోశాయి.నిర్దేశిత కార్యక్రమానికి ముందు ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ ఫాక్స్ న్యూస్‌తో మాట్లాడుతున్న వీడియోను నెటిజన్లు లక్షలాది సార్లు వీక్షించారు. ఆ వీడియోలో ఆమె ట్రంప్ చేయబోయే ప్రసంగం గురించి మాట్లాడుతూ "ఈ రాత్రి గది(బాల్‌రూమ్)లో కాల్పులు జరుగుతాయి" అని అన్నారు. ఆన్‌లైన్‌లో ఇది మరిన్ని ఊహాగానాలకు ఆజ్యం పోసింది. అమెరికా విషయానికి వచ్చేసరికి "కాల్పులు జరగడం" అనేది మాటల తూటాలు పేలుతాయి అని చెబుతూ ఒకరిని విమర్శించడానికి లేదా ఎగతాళి చేయడానికి ఉపయోగించే ఒక సాధారణ జాతీయ పదం. ఫాక్స్ న్యూస్‌కు చెందిన మరో వీడియో కూడా ఈ కుట్రపూరిత గందరగోళానికి ఆజ్యం పోసింది. ఆ ఛానెల్ వైట్ హౌస్ కరస్పాండెంట్ ఐషా హస్నీ, ఆ సాయంత్రం తన అనుభవాన్ని స్వయంగా వివరిస్తున్న వీడియో అది. "ఈ రాత్రి సురక్షితంగా ఉండండి" అని లీవిట్ భర్త తనతో చెబుతుండగా ఆమె కాల్ కట్

## కాల్పుల కాలక్రమం (స్థానిక కాలమానం ప్రకారం)

**ఏప్రిల్ 24, శనివారం రాత్రి 8.35 గంటలు**

కాల్పుల శబ్దం వినిపించగానే వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌లో వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్‌కు వచ్చిన అతిథులు ఎక్కడివారక్కడ టేబుళ్ల కింద దాక్కున్నారు. అదే హోటల్‌లో బాల్‌రూమ్‌లోకి దూసుకువచ్చిన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు ట్రంప్‌ను, ఆయన మంత్రివర్గ సహచరులను సురక్షితంగా వెలుపలకు తీసుకొనివెళ్లారు.

**అసలేం జరిగింది?**

షాట్‌గన్, హ్యాండ్‌గన్, కత్తులతో కూడిన ఒక ఆగంతకుడు హోటల్ లాబీ ప్రాంతంలో సీక్రెట్ సర్వీస్ చెక్ పాయింట్‌పైకి కాల్పులు జరుపుతూ దూసుకొనివచ్చాడు. సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు అతడిని అడ్డుకున్నారు. ఆ క్రమంలో ఒక ఏజెంట్ గాయపడ్డాడు.





**9.17 గంటలు**

కాల్పుల తర్వాత ట్రంప్ తొలిసారిగా మాట్లాడారు. కార్యక్రమాన్ని కొనసాగించాలని కోరారు.

**9.45 గంటలు**

ట్రంప్ హోటల్‌ను వీడారు. రాత్రి 10 గంటలు అవుతుండగా వైట్ హౌస్ చేరుకున్నారు.

**10.30 గంటలు**

వైట్‌హౌస్‌లో మీడియాను ఉద్దేశించి మాట్లాడారు. ఒకే ఒక వ్యక్తి కాల్పులు జరిపాడని వెల్లడించారు.

**11.13 గంటలు**

కాల్పుల జరిపిన వ్యక్తిపై తుపాకీ వాడకం, సీక్రెట్ సర్వీస్ ఏజెంట్‌పై కాల్పులు జరపడం అనే అభియోగాలు మోపారు.



పోలీసుల అధీనంలో నిందితుడు కోల్ టొమాస్ అలెన్

**హోటల్‌లో భద్రతాపరమైన లోపాలు**

హోటల్‌లోకి ప్రవేశించే చోట ఎలాంటి మెటల్ డిటెక్టర్లు లేవు. హోటల్‌లో చాలా లోపల ఉన్న బాల్‌రూమ్‌కు దగ్గర్లో మాత్రమే కట్టుదిట్టమైన భద్రతావలయం ఉంది.



**వైట్‌హౌస్‌లో బాల్‌రూమ్ కోసం ట్రంప్ ఆరాటం**

తాజా సంఘటన వైట్‌హౌస్‌లో 400 మిలియన్ డాలర్ల ఖర్చుతో అధునాతనమైన భద్రతా ఏర్పాట్లతో కూడుకున్న బాల్‌రూమ్ నిర్మాణం ఆవశ్యకతను స్పష్టం చేస్తుందని ట్రంప్ అన్నారు. అంత భద్రమైన భవన ప్రాంగణం కాదు అని హిల్టన్ హోటల్‌పై వ్యాఖ్యానించారు. మనకు బుల్లెట్‌ప్రూఫ్ గ్లాస్‌తో కూడిన బాల్‌రూమ్ కావాలని ఆయన తెలిపారు.




ఇదే వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌లో 1981లో అప్పటి దేశాధ్యక్షుడు రోనాల్డ్ రీగన్‌ను హతమార్చడానికి జాన్ హింక్లే జూనియర్ అనే వ్యక్తి ప్రయత్నించాడు.

అయిపోయింది. ఆ తర్వాత ఆమె ఆన్‌లైన్‌లో, తన కాల్ సమయంలో బాల్‌రూమ్‌లో సిగ్నల్ సరిగ్గా లేదని స్పష్టం చేశారు. సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు ట్రంప్ వద్దకు చేరుకోవడానికి ముందే ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌ను సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న వీడియోపైన కూడా నెటిజన్లు సందేహాలు వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడి కంటే ముందుగా ఉపాధ్యక్షుడిని ఎందుకు తరలించారని నిలదీశారు. ఇన్ని సందేహాల మధ్య దాడి వెనుక నాటకీయ కల్పన అనే వాదనను వమ్ము చేయాల్సిన బాధ్యత వైట్‌హౌస్ మీద ఉందనేది అక్షర సత్యం.

# మృత్యుంజయుడిపై పదేళ్లుగా ప్రయత్నాలు

**మార్చి 2016**

ఒహియో రాష్ట్రం, డేటన్‌లో పోలీసు బారికేడ్‌ను దాటుకొని వేదికపైన ఉన్న ట్రంప్‌ను హుటాహుటిన చేరుకోవడానికి ప్రయత్నించిన ఒక వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు.

**జూన్ 2016**

నెవడా రాష్ట్రం, లాస్‌వెగాస్‌లో ప్రసంగిస్తున్న ట్రంప్ పైకి పోలీసు దగ్గర తుపాకీ లాక్కొని మరీ కాల్పుల జరపడానికి ఒక వ్యక్తి ప్రయత్నించాడు.

**సెప్టెంబర్ 2017**

నార్త్ డకోటా రాష్ట్రం, మండన్‌లో చోరీ చేసిన ట్రక్కును నడుపుతూ ట్రంప్ వాహనశ్రేణిలోకి చొరబడటానికి ప్రయత్నించిన ఒక వ్యక్తిని అరెస్టు చేశారు.

**అక్టోబర్ 2018**

ట్రంప్‌కు ఆముదపు గింజలతో కూడిన కవర్‌ను పంపించిన నావికాదళం మాజీ అధికారిని అదుపులోకి తీసుకున్నారు.

**ఆగస్ట్ 2020**

వైట్‌హౌస్‌లో విలేకరుల సమావేశాన్ని ముగించుకొని కట్టుదిట్టమైన భద్రత మధ్య వెలుపలకు వస్తున్న ట్రంప్ లక్ష్యంగా బారికేడ్ మీదుగా ఒక వ్యక్తి కాల్పులు జరిపాడు.

**సెప్టెంబర్ 2020**

న్యూయార్క్‌లో 2020 అధ్యక్ష ఎన్నికల పోటీ నుంచి తప్పుకోవాలంటూ ట్రంప్‌కు రిసిన్ అనే రసాయన విషం అద్దిన లేఖను అందించిన ఒక కెనడా దేశస్థుడిని పోలీసులు అరెస్టు చేశారు.

**జూలై 2024**

పెన్‌సిల్వేనియా రాష్ట్రం, బట్లర్‌లో సభలో మాట్లాడుతున్న ట్రంప్ పైకి ఒక వ్యక్తి తుపాకీతో ఎనిమిది సార్లు కాల్పులు జరిపాడు. ఒక తూటా కుడి చెవిని రాసుకుంటూ పోయింది. కాల్పులు జరిపిన వ్యక్తిని అక్కడికక్కడే కాల్చి చంపారు.



**జూలై 12, 2024**

ఇరాన్ సైన్యం తరపున ట్రంప్‌ను హతమార్చడానికి కిరాయి వ్యక్తులను రంగంలోకి దించాడనే అభియోగాలపై పాకిస్తాన్‌కు చెందిన ఆసిఫ్ మర్చంట్ అనే వ్యక్తిని హూస్టన్‌లో అరెస్టు చేశారు.

**సెప్టెంబర్ 2024**

ఫ్లోరిడాలో అంతర్జాతీయ గోల్ఫ్ క్లబ్‌లో ట్రంప్ గోల్ఫ్ ఆడుతుండగా రైఫిల్‌తో ఒక వ్యక్తి కనిపించాడు. అతడికి జీవిత ఖైదు విధించారు.

**మే 2025**

ట్రంప్ తదుపరి సభలో ఆయన్ను కాల్చి చంపుతామంటూ మెక్సికా దేశస్థుడి నుంచి యూఎస్ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్-ఐసీఈకి ఒక లేఖ అందింది.

**ఆగస్ట్ 2025**

ట్రంప్‌ను చంపుతానంటూ బెదిరింపులకు దిగిన ఒక వ్యక్తిని కొలంబియా జిల్లా-డీసీలో అరెస్టు చేశారు.

**అక్టోబర్ 2025**

ఫ్లోరిడాలోని పామ్ బీచ్ విమానాశ్రయం వద్ద ట్రంప్ ప్రయాణించే ఎయిర్ ఫోర్స్ వన్ విమానం పార్క్ చేసి ఉండగా, సరిగ్గా ఆ విమానాన్ని లక్ష్యంగా చేసుకున్నట్టుగా అక్కడికి సమీపంలో వేటగాళ్లు ఉపయోగించే ఎత్తైన స్టాండును భద్రతాసిబ్బంది కనిపెట్టారు.

**ఫిబ్రవరి 2026**

ఫ్లోరిడా రాష్ట్రం, మారాలాగోలో ట్రంప్ ప్రైవేట్ నివాసానికి షాట్‌గన్, గ్యాస్‌తో నిండిన క్యాన్‌ను తీసుకొనివచ్చిన వ్యక్తిని భద్రతాసిబ్బంది కాల్చి చంపారు.



**మార్చి 2026**

ఫ్లోరిడా రాష్ట్రం, మారాలాగోలో ట్రంప్ ప్రైవేట్ నివాసంపై తిరుగుతున్న ఒక విమానాన్ని అధికారులు అడ్డుకున్నారు.




డొనాల్డ్ ట్రంప్ వంటి విలక్షణమైన, సుస్థిరమైన భావప్రసార శైలిని ప్రదర్శించిన రాజకీయ నాయకులు చాలా తక్కువ. ప్రజా చర్చను ప్రభావితం చేయడం, మీడియా దృష్టిని ఆకర్షించడం, తన ప్రేక్షకులను మమేకం చేయగల ఆయన సామర్థ్యం తన కెరీర్ పొడవునా స్థిరంగా ఉంది.

# రాజకీయ డిజిటల్ విప్లవకారుడు

ఒక వ్యాపారవేత్తగా, మీడియా వ్యక్తిగా తన తొలి రోజుల నుండి అమెరికా అధ్యక్షుడిగా తన పదవీకాలం వరకు, ట్రంప్ ప్రతి కాల సందర్భానికి అనుగుణంగా తన సందేశాన్ని మెరుగుపరుచు కుంటూ, మార్చుకుంటూ వచ్చారు. ఆయన శైలిలోని ప్రధాన అంశాలైన సూటిగా మాట్లాడటం, పునరావృతం చేయడం, భావోద్వేగపూరితమైన ఆకర్షణ వంటివి నిలకడగా ఉన్నప్పటికీ, ప్రతి దశలోనూ స్వరం, వ్యూహం, విధానంలో మార్పులు చోటుచేసుకుంటూ వస్తున్నాయి. ఈ కథనం భాషా సరళి, అలంకారిక పద్ధతులు, మీడియా భాగ స్వామ్యం, ప్రేక్షకులపై ప్రభావంపై దృష్టి సారిస్తూ, ట్రంప్ భావప్రసార పరిణామాన్ని అన్వేషిస్తుంది.

**వ్యాపారవేత్త, మీడియా ప్రముఖుడు (1980లు-2015)**

రాజకీయ రంగంలోకి అడుగుపెట్టక ముందే, డొనాల్డ్ ట్రంప్ స్వీయ ప్రచార కళలో ఆరితేరి పోయారు. అతిశయోక్తి, బ్రాండింగ్, మీడియాను తనకు అనుకూలంగా మలచుకోవడం వంటివి ఆయన ప్రచార విధానంలో ప్రధానంగా ఉండేవి. ఈ మూడు కీలక అంశాలు ఆయన ప్రజా ప్రతిష్టను పటిష్టం చేసుకోవడానికి సహాయపడ్డాయి. ట్రంప్ తన వ్యాపారాల పట్ల ఉత్సాహాన్ని రేకెత్తించడానికి తరచుగా ఆడంబరమైన భాషను ఉపయోగించేవారు. ఆయన ప్రసంగాలు, ఇంటర్వ్యూలు "అత్యుత్త మమైన," "గొప్ప," "అత్యంత అద్భుతమైన" వంటి అతిశయోక్తులతో నిండి ఉండేవి. ఇవి ఆయన్ని సాటిలేని విజయవంతమైన వ్యక్తిగా నిలబెట్టాయి. తన 'ది ఆర్ట్ ఆఫ్ ది డీల్' (1987) పుస్తకంలో, ప్రచార వ్యూహంగా "నిజమైన అతిశయోక్తి"ని ఉపయోగించినట్లు ఆయన నిష్కపటంగా అంగీక రించారు. రాజకీయాల్లోకి ప్రవేశించక ముందే, ట్రంప్ పేరు, ప్రఖ్యాతుల విలువను గుర్తించారు. ఆయన ఇంటిపేరు ఒక శక్తిమంతమైన బ్రాండ్‌గా మారి, భవనాలు, క్యాసినోలు, ఉత్పత్తులపై ప్రముఖంగా ప్రదర్శితమైంది. ఆయన సంభాషణ ఈ విధానాన్ని ప్రతిబింబించింది. తన వ్యక్తిత్వానికి, విజయానికి మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి కీలక పదబంధాలను పదేపదే పునరా వృతం చేసేవారు. వివాదం, ఆర్భాటమే మీడియా కవరేజీని నడిపిస్తాయని ట్రంప్ సహజంగానే అర్థం చేసుకున్నారు. ధైర్యమైన, రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం ద్వారా తన పేరు వార్తల్లో నిలిచేలా ఆయన చూసుకున్నారు. ప్రజల దృష్టిని ఖచ్చితంగా ఆకర్షించే ఈ వ్యూహం, ఆ తర్వాత ఆయన రాజకీయ ప్రచారంలో ఒక ప్రధాన లక్షణంగా మారింది.

**మొదటి అధ్యక్ష ఎన్నికల ప్రచారం (2015-2016)**

వ్యాపారవేత్త నుండి రాజకీయ పోటీదారుగా మారిన ట్రంప్, తన ప్రసంగ శైలిలో గణనీయమైన మార్పును చూశారు. ఆయన భారీ జనసమూహాన్ని దృష్టిలో ఉంచుకుని తన సందేశాన్ని తీర్చిదిద్దారు. సాంప్రదాయ పద్ధతులను అధిగమించడానికి డిజిటల్ మీడియాను ఉపయోగించుకున్నారు. ఆయన విభజన, ఆవశ్యకతను ప్రేరేపించే ప్రసంగాలను

## ప్రశ్నలడిగితే పాపమే..!



ఈ ఏడాది ఏప్రిల్ 24న వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీస్‌లో ఇరాన్‌తో యుద్ధంపై ప్రశ్నలు అడిగిన విలేకరులపై ట్రంప్ మండిపడ్డారు. యుద్ధం ఎంతకాలం కొనసాగుతుంది? గ్యాస్, చమురు ధరలు ఎప్పుడు తగ్గుతాయి? అని అడిగిన వారిని తీవ్రంగా దూషించారు. ఒకరిని మీరు అవమానకరమైనవారు అని నిందించారు. వియత్నాంతో యుద్ధం 18 సంవత్సరాలు జరిగింది అని గట్టిగా అరిచి మరీ చెప్పారు. ఇరాన్‌తో యుద్ధం విషయంలో తనను వేగిరపరచవద్దు అని బ్లూమ్‌బెర్గ్ మీడియా సంస్థ విలేకరిని హెచ్చరించారు. అదే ప్రశ్న అడిగిన సీబీఎస్ మీడియా సంస్థ విలేకరి వైపు వేలెత్తి చూపిస్తూ గెటౌట్ అని అరిచారు. ఆమెను ఓవల్ ఆఫీస్ నుంచి వెలుపలకు పంపించేశారు. ఇరాన్ ఓడిపోయిందని, యుద్ధం ముగిసిపోయింది అని చెప్పడం ద్వారా వారి ప్రశ్నలకు సమాధానాన్ని దాటవేశారు.



మహేష్ ధూళిపాళ్ల

చేశారు. సాంప్రదాయ రాజకీయ నాయకులకు భిన్నంగా, ట్రంప్ సూటిగా, నిష్కపటంగా మాట్లాడే శైలిని అవలంబించారు. ఆయన చిన్న వాక్యాలు, రోజువారీ పదజాలం, పునరావృతమయ్యే పదబంధాలపై ఆధారపడ్డారు, దీనివల్ల ఆయన సందేశం సులభంగా అర్థమయ్యేలా ఉంది. భాషా విశ్లేషణల ప్రకారం, ఆయన ప్రసంగాలు తరచుగా ప్రాథమిక పాఠశాల విద్యార్థుల పఠన స్థాయికి సరిపోలాయని తేలింది. తన ప్రసంగాల ద్వారా తాను చెప్పదలుచుకున్న దానిపట్ల ప్రజల్లో అవగాహనను కలిగించడానికి, తన భావజాలంలో వారి భాగస్వామ్యాన్ని పెంచడానికి ఇది ఆయన ఉద్దేశపూర్వకంగా తీసుకున్న నిర్ణయం.

ఆయన సందేశం “సామాన్య ప్రజలు వర్సెస్ మేధావులు” అనే సమకాలీన సంఘర్షణాత్మక అంశంపై కేంద్రీకృతమై ఉంది. అవినీతిమయమైన వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఒక బయటి వ్యక్తిగా తనను తాను నిలబెట్టుకోవడం ద్వారా, ఆయన ప్రజలలోని నిరాశ, భ్రమల భావాలను తట్టిలేపి, వారితో బలమైన బంధాన్ని ఏర్పరచుకున్నారు.



(ట్రంప్ ఈ వార్తా సంస్థలపై పరువు నష్టం దావా వేశారు)

ప్రపంచానికి ఆయన గొంతుకగా ట్విట్టర్ (ప్రస్తుతం ఎక్స్) మారింది. తన సందేశాన్ని తెలియజేయడానికి పాత్రికేయులను అనుమతించకుండా, ట్రంప్ తరచుగా మొరటుగా, రెచ్చగొట్టే విధంగా ఉండే పోస్టుల ద్వారా నేరుగా ప్రజలతో మాట్లాడారు. వైరల్ అయ్యేలా రూపొందించిన ఆయన ట్వీట్లు, వార్తా ప్రసారాలను నియంత్రించడానికి, రాజకీయ సంభాషణను శాసించడానికి ఆయనకు వీలు కల్పించాయి.

### మొదటిసారి అధ్యక్ష పదవీకాలం (2017-2021)

అధ్యక్షుడిగా, ట్రంప్ సంభాషణా శైలి నిష్కపటంగా, ఘర్షణపూరితంగానే కొనసాగింది. అయినప్పటికీ, పరిపాలనలోని వాస్తవాలు, పత్రికల పరిశీలనకు అనుగుణంగా అది పరిణామం చెందింది. వార్తా చక్రంలో నిరంతరం ఆధిపత్యం చెలాయించడమే ట్రంప్ వ్యూహం. అధికారిక ప్రకటనలు, సోషల్ మీడియా పోస్టులు, ఆకస్మిక వ్యాఖ్యల ద్వారా తానే ఎల్లప్పుడూ అందరి దృష్టికి కేంద్రంగా ఉండేలా ఆయన చూసుకున్నారు. విమర్శకులు, సంస్థలపై పద్ధతి ప్రకారం దాడి చేయడం ఆయన ప్రసంగ శైలిలోని ఒక ముఖ్య లక్షణం. పత్రికలను “నకిలీ వార్తల మీడియా” అని ముద్ర వేయడం నుండి రాజకీయ ప్రత్యర్థులకు (“మోసగత్తె హిల్లరీ”, “నిద్రమత్తు జో”) అవమానకరమైన మారుపేర్లు పెట్టడం వరకు, తన మద్దతుదారుల విధేయతను బలోపేతం చేయడానికి ప్రత్యర్థులను అప్రతిష్టపాలు చేయడమే ఆయన సంభాషణా వ్యూహంలో భాగం.

ట్రంప్ ప్రసంగాలు బలమైన భావోద్వేగ ప్రతిస్పందనలను రేకెత్తించేలా ఉంటాయి. ఆయన తరచుగా సమస్యలను నలుపు-తెలుపు కోణంలో తేటతెల్లం చేసేవారు. ఒక అస్తిత్వ సంక్షోభాన్ని పరిష్కరించగల ఏకైక నాయకుడిగా తనను తాను ప్రదర్శించుకునేవారు. ఈ విధానం మద్దతుదారులలో ప్రగాఢమైన విధేయతను పెంపొందించినప్పటికీ, రాజకీయ రంగంలో విభేదాలను తీవ్రతరం చేసింది.

### పదవీవిరమణ, మళ్లీ ఎన్నికల ప్రచారం (2021-2024)

అధ్యక్ష పదవి నుండి వైదొలిగిన తర్వాత మారుతున్న మీడియా వాతావరణానికి అనుగుణంగా తన వ్యూహాన్ని ట్రంప్ మార్చుకున్నారు. ప్రత్యామ్నాయ వేదికలపై దృష్టి సారిస్తూ, తనకు అన్యాయం జరిగిందని, అందుకు ప్రతీకారం తీర్చుకుంటాననే కథనానికి మరింత పదును పెట్టారు. ప్రధాన సోషల్ మీడియా నెట్‌వర్క్‌లు బహిష్కరించిన తర్వాత, తన మద్దతుదారులతో ప్రత్యక్ష సంభాషణను కొనసాగించడానికి ట్రంప్ ‘ట్రూత్ సోషల్’ను ప్రారంభించారు. ఈ మార్పు ప్రధాన స్రవంతి చర్చలలో ఆయన ప్రాబల్యాన్ని పరిమితం చేసినప్పటికీ, ఆయన విధేయులైన మద్దతుదారులలో భాగస్వామ్యాన్ని బలపరిచింది. అవినీతి శక్తులు అన్యాయంగా లక్ష్యంగా చేసుకున్న నాయకుడిగా తనను తాను చిత్రీకరించుకుంటూ, ఆయన వాక్చాతుర్యం బాధితుడిగా నటించడం, ప్రతీకారంపై మరింతగా కేంద్రీకృతమైంది. తన మునుపటి విధానానికి

## రెండు వేలకు పైగా క్షిపణులు భస్మీపటలం

ట్రంప్ అహంకారానికి, ఆధిపత్య ధోరణికి రెండు వేలకుపైగా క్షిపణులు ఇరాన్‌తో యుద్ధంలో ఖర్చయిపోయాయి. న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రకారం అమెరికా సైన్యం 1,200 పేట్రియాట్ ఇంటర్‌సెప్టర్ క్షిపణులను ఇరాన్‌పైకి ప్రయోగించింది. ఈ క్షిపణి విలువ 40 లక్షల డాలర్లు. అలాగే 1,000 తొమహాక్ క్రూజ్ క్షిపణులను కూడా ప్రయోగించింది. ఈ క్షిపణి విలువ 36 లక్షల డాలర్లు. ఇది అమెరికా ప్రతి సంవత్సరం కొనుగోలు చేసే సంఖ్య కంటే 10 రెట్లు ఎక్కువ. ఈ వినియోగం వల్ల అమెరికా ఆయుధాగారంలో నిల్వలు బాగా తగ్గిపోయాయని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది.





## మాకొద్దీ అమెరికా

అమెరికాలో ఉంటున్న భారతీయుల్లో ప్రతి నలుగురిలో ఒకరు అంటే సుమారు 40 శాతం మంది ఆ దేశాన్ని శాశ్వతంగా వదిలివెళ్లాలనే ఆలోచనలో ఉన్నారు. కార్నెగీ ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషన్ పీస్ అనే సంస్థ ఇటీవల నిర్వహించిన సర్వేలో ఈ విషయం బైటపడింది. ఇది భారతీయుల్లో అమెరికా స్వప్నం ఛిన్నాభిన్నమైన పరిస్థితిని ప్రతిబింబిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్ మధ్యకాలంలో ఈ సర్వేను చేపట్టారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి యూఎస్‌లో భారతీయుల జనాభా 54 లక్షలుగా ఉంది. సర్వేలో పాల్గొన్న వారిలో 40 శాతం మంది సంక్షోభిత వాతావరణంలో చిక్కుకున్నామని దేశాన్ని వీడి వెళ్లాలని అనుకుంటున్నట్టు తెలిపారు. తాము దేశాన్ని వీడిపోవాలనే దిశగా ఆలోచించడానికి రాజకీయ వాతావరణమే ప్రధాన కారణమని 58 శాతం మంది వెల్లడించారు. జనవరి, 2025లో మొదలైన అధ్యక్షుడిగా ట్రంప్ రెండవ విడత పాలన పట్ల 71 శాతం మంది భారతీయులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అమెరికన్లదే అమెరికా అంటూ ట్రంప్ అదే పనిగా చేస్తున్న ప్రకటనలు వారిలో అమెరికాకు తాము పరాయివారము అనే భావనను పెంచి పోషిస్తోంది. దీనికి తోడు వారు గ్రీన్ కార్డు కోసం 30 నుంచి 40 సంవత్సరాలు వేచి ఉండాల్సి వస్తోంది. హెచ్-1బీ వీసాల జారీలో నెలకొన్న అనిశ్చితి కూడా వారిని కెనడా లేదా ఆస్ట్రేలియా వైపు మళ్లిస్తోంది. కుటుంబ ఖర్చులు, రాజకీయ అనిశ్చితి పెరగడం భారతీయుల్లో పరాయిదేశాలకు వలసపోవాలనే ఆలోచనకు దారి తీసింది. అదేసమయంలో డెమోక్రాట్ పార్టీకి మద్దతు వచ్చేవారి సంఖ్య కూడా గణనీయంగా తగ్గుముఖం పడుతోందని సర్వే ఫలితాలు వెల్లడించాయి.

భిన్నంగా, ట్రంప్ ఇంటర్వ్యూల కోసం తనకు అనుకూలమైన మీడియా వాతావరణాన్ని ఎక్కువగా ఎంచుకున్నారు. తన సందేశానికి అనుగుణంగా చర్చ జరిగే సంప్రదాయవాద టెలివిజన్ నెట్‌వర్క్‌లు, పాడ్‌కాస్ట్‌లలో ఆయన కనిపించారు.

**రెండవసారి అధ్యక్ష పదవీకాలం (2025-ప్రస్తుతం)**

తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రంప్ ప్రత్యక్ష సంప్రదింపులు, దూకుడు వాక్చాతుర్యం, మీడియా నియంత్రణపై మరింతగా దృష్టి సారించారు. ఆయన సంభాషణ మరింత ఘర్షణా పూరితంగా మారింది; కఠినమైన భాషను ఉపయోగిస్తూ, తన అధ్యక్ష పదవిని దేశ మనుగడ కోసం చేసే ఒక అస్తిత్వ పోరాటంగా చిత్రీక రిస్తున్నారు. అధికారిక ప్రభుత్వ సందేశాలకు, వ్యక్తిగత బ్రాండింగ్‌కు మధ్య ఉన్న గీత అస్పష్టంగా మారింది. వైట్ హౌస్ అధికారిక సమాచారాలు కూడా ఆయన పోస్టుల శైలినే ప్రతిబింబిస్తున్నాయి. ప్రత్యక్ష సంభాషణలో నిమగ్నమై ఉన్నప్పటికీ, ట్రంప్ బృందం ఆయన మీడియా ప్రచారాన్ని మెరుగు పరిచింది. గరిష్ఠ ప్రభావాన్ని సాధించడానికి అధికారిక ప్రకటనలు, నియంత్రిత ఇంటర్వ్యూలు, డిజిటల్ మీడియా ద్వారా రెచ్చగొట్టే చర్యలను సమతుల్యం చేసింది.

**ముక్తాయింపు:** డోనాల్డ్ ట్రంప్ భావప్రసార విధానం దాని మూల సూత్రాలైన ప్రత్యక్షత, పునరావృత్తి, భావోద్వేగపూరిత విజ్ఞప్తి, మీడియాను ప్రభావితం చేయడం వంటి వాటిలో గణనీయంగా స్థిరంగా ఉంది. అయితే మారుతున్న మీడియా వాతావరణం, తన అవసరాలకు అనుగుణంగా ఆయన తన వ్యూహాలను ఎప్పటికప్పుడు మార్చు కుంటూ ముందుకు సాగుతున్నారు. ఒక వ్యాపార దిగ్గజంగా తన తొలి రోజుల నుండి డిజిటల్ రాజకీయ విప్లవకారుడిగా తన పాత్ర వరకు, ట్రంప్ ప్రజల దృష్టిని ఆకర్షించడంలో, ప్రేక్షకులను సమీకరించడంలో, ప్రజా చర్చను పునర్నిర్మించడంలో అసమానమైన సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్నారు.

సమయస్ఫూర్తి, వాక్చాతుర్యం, బుద్ధికుశలత, అధికార బలం, అర్థబలం.. ఇలా ఇన్ని విశేషణాలు ఉన్నప్పటికీ అహంభావం, అమానవీయత, అన్నింటిలోనూ లాభాపేక్షను ఆశించే గుణం అమెరికా అధ్యక్షున్ని అధికార పరంగా, వ్యక్తిగతంగా ప్రపంచ దేశాలకు మరీ ముఖ్యంగా మానవాళికి కొరకరాని కొయ్యగా తయారు చేస్తోంది. మార్గం ఏదైనప్పటికీ, ఆచరణ ఎంత వక్రమైనప్పటికీ గెలుపే పరమావధిగా సాగుతున్న ట్రంప్ రాజకీయ ప్రస్థానం ఏ తీరాలకు చేరుతుందనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా అంతర్జాతీయ సమాజానికి మిగిలిపోయింది. ప్రపంచంలో ఏమూల ఏది జరిగినా తన ప్రమేయం ఉండాలనే సగటు అమెరికా అధ్యక్షుడి మనస్తత్వం, ఆధిపత్య ధోరణికి మూసపోసినట్టుగా నిలిచిన ట్రంప్ నేటి తరానికి ఇస్తున్న సందేశం అస్పష్టంగా ఉందనడంలో ఏమాత్రం సందేహంలేదు. ★





# ఓటెత్తిన

**పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికల మొదటి దశలో అత్యధికంగా 92 శాతం పోలింగ్ జరగడం ఒక రికార్డు కాగా, గత పదిహేనేళ్లలో కనీవినీ ఎరుగని విధంగా తక్కువ స్థాయిలో హింస, విధ్వంసకాండలు చెలరేగడం మరో రికార్డు. మొదటి దశ ఎన్నికల్లో చెదురు మదురుగా మాత్రమే హింసాకాండ జరిగినట్టు ఎన్నికల అధికారులు, పోలీస్ అధికారులు ధ్రువీకరించారు. అక్కడ అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు 2016, 2021 సంవత్సరాల్లో మాదిరిగా ఓటర్లను బెదిరించడానికి, బీజేపీ కార్యకర్తలను చెట్లకు తలకిందులుగా వేలాడదీయడానికి, ఇతర పార్టీల వారి ఇళ్ల మీద దాడులు చేసి అత్యాచారాలకు, బెదిరింపులకు పాల్పడడానికి, ఇతర పార్టీల అభ్యర్థులు ప్రచారం చేసుకోకుండా దాడులు చేయడానికి ఏ మాత్రం అవకాశం లేకుండా పోయింది.**

మొత్తం మీద ఈసారి ఎన్నికల్లో ఒకటి రెండు కీలక పరిణామాలు స్పష్టంగా కనిపించాయి. పోలింగ్ శాతం అత్యధికంగా ఉండడాన్ని బట్టి పశ్చిమ బెంగాల్ ప్రజలు ఈసారి మార్పు కోరుకుంటున్నారన్నది స్పష్టమైంది. మరో విశేషమేమిటంటే, తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులకు గానీ, కార్యకర్తలకు గానీ, ఆ పార్టీకి చెందిన గూండాలకు గానీ రాష్ట్ర ప్రజలు భయపడడం లేదు. మరో పెద్ద మార్పు ఏమిటంటే, బాంగ్లాదేశ్ నుంచి చొరబడుతున్న రోహింగ్యాలు, ముస్లింల ఆధిపత్యం పట్ల స్థానిక ప్రజలు తిరగబడుతున్నారు. నిజానికి, ఈసారి బీజేపీ ఆ రాష్ట్రంలో బలం పుంజుకోవడాన్ని సహించలేని తృణమూల్ కాంగ్రెస్ పెద్ద ఎత్తున హింసా, విధ్వంసకాండలకు తెర తీస్తుందని అంతా భావించారు. ఓటర్ల జాబితాలను సవరించడానికి అధికారులు వచ్చినప్పుడే తీవ్రస్థాయిలో అడ్డుకున్న అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికలను సవ్యంగా జరగనిస్తారా? అన్న అనుమానం పశ్చిమ బెంగాల్ ప్రజల్లో బాగా వ్యక్తమైంది.

**మమతకు ఎదురు దెబ్బలు**

ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గూండాలు హింసాకాండకు పథక రచన చేశారు. మైనారిటీలు అధికంగా ఉండే ముర్షీదాబాద్, మాల్దా తదితర ప్రాంతాల్లో హింసను బాగానే ప్రేరేపించారు. బీజేపీ అభ్యర్థి సుభేందు సర్కార్ మీద దాడి చేశారు. చాలా చోట్ల బాంబులు విసిరారు. ప్రజలను విపరీతంగా భయపెట్టే ప్రయత్నం చేశారు. అయితే, ముందు జాగ్రత్త చర్యగా ఎన్నికల ప్రధాన కమిషనర్ ఆదేశాల మేరకు సి.ఆర్.పి.ఎఫ్ బలగాలు భారీ సంఖ్యలో మోహరించడం వల్ల అనేక ఉపద్రవాలు చివరి క్షణంలో తప్పిపోయాయి. తృణమూల్ కాంగ్రెస్ గూండాలు ఒకపక్క ఇతర పార్టీల అభ్యర్థులను, కార్యకర్తలను, పోలింగ్ ఏజెంట్లను భయపెట్టే ప్రయత్నం చేస్తుండగా ముస్లిం నాయకుడు హుమయూన్ కబీర్ మరోపక్క తన వంతుగా అల్లర్లు సృష్టించడానికి యథాశక్తి ప్రయత్నం చేశారు.

దేశంలో కనీవినీ ఎరుగని స్థాయిలో రాష్ట్రంలో మార్పు కోరుకుంటున్న ప్రజలు గట్టి పట్టుదలతో వీటన్నిటినీ భరించి, తీవ్రస్థాయిలో ఎదుర్కొని 92 శాతం పోలింగ్ జరగడానికి కారకులయ్యారు. దక్షిణ దినాజ్‌పూర్‌లో సుభేందు సర్కార్ మీద తృణమూల్ కార్యకర్తలు దాడి చేయడం, కొట్టడం రికార్డు కూడా అయి దేశ ప్రజలందరికీ చేరిపోయింది. తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తల దాడులను ఇతర పార్టీలు తమకు వీలైనంతగా నిరోధించడం, ఇదివరకటి మాదిరిగా వారికి భయపడకపోవడం ఒక గొప్ప శుభసూచకంగా కూడా కనిపిస్తోంది. దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 21 లక్షల మంది బెంగాలీ వలసదార్లు తమ రాష్ట్రానికి తిరిగి వచ్చి పోలింగ్‌లో పాల్గొనడం ఆసక్తికరం. పశ్చిమ బెంగాల్ లో ఉద్యోగావకాశాలు లేకపోవడం, వేలాది పరిశ్రమలు, కర్మాగారాలు మూతబడడం వల్ల వారంతా ఇతర రాష్ట్రాలకు ఉపాధి కోసం వలస పోవలసి వచ్చింది.

**దీర్ఘకాలిక ప్రణాళికలు**

పశ్చిమ బెంగాల్ కంటే కొద్దిగా ముందుగా



పశ్చిమ బెంగాల్, తమిళనాడు ప్రభుత్వాల తీరుతెన్నులను, లౌకిక వాదం ముసుగులో ఆ ప్రభుత్వాలు చేస్తున్న అక్రమాలను చాలా కాలంగా గమనిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇక ఇటువంటి అరాచకాలకు స్వస్తి చెప్పాలని కృతనిశ్చయంతో ఉంది. మోదీ, షాలు ఈ రాష్ట్రాల మీద తమ దృష్టినంతా కేంద్రీకరించడంతో ఈ ఎన్నికలు వారికి అగ్నిపరీక్షగా మారాయన్న అభిప్రాయం దేశమంతా వ్యక్తమవుతోంది. అసోంలో బీజేపీ నాయకత్వంలోని ఎన్.డి.ఏ ప్రభుత్వం మూడవ పర్యాయం అధికారంలోకి రావాలని భావిస్తోంది.



# బెంగాలీలు

ఎన్నికలు జరిగిన అసోం, కేరళ, పుదుచ్చేరి, బెంగాల్‌తో పాటే ఎన్నికలు జరిగిన తమిళనాడు రాష్ట్రాల్లో ఇటువంటి హింసా విధ్వంసకాండ దృశ్యాలు ఎక్కడా కనిపించలేదు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షాల వ్యూహాలకు అద్దం పట్టే ఈ అయిదు రాష్ట్రాల ఎన్నికలను సాధారణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలుగా తీసిపారేయడానికి వీల్లేదు. అధికార పక్షాలే కాక, ప్రతిపక్షాలు కూడా తమ రాజకీయ శక్తియుక్తులన్నిటినీ ఇందులో పణంగా పెట్టాయి. తమ అర్థ బలాన్నీ, అంగ బలాన్నీ ఇక్కడ పరీక్షకు పెట్టాయి. ఈ ఎన్నికల మీద ఎన్నో ఆశలు పెట్టుకుని ఎన్నికల రంగాన్ని రణ రంగంగా మార్చేశాయి. మంత్రులు, నాయకులు, మిత్రపక్షాలు, నటులు, ఇతర ప్రముఖులు ఈ రాష్ట్రాల్లో మోహరించారు. ఎన్నికల ప్రచారం తప్ప తమకు వేరే బాధ్యతలేవీ లేనట్టు ఒక రెండు నెలల పాటు పూర్తి సమయాన్ని వీటికే కేటాయించారు.

పశ్చిమ బెంగాల్, తమిళనాడు ప్రభుత్వాల తీరుతెన్నులను, లౌకికవాదం ముసుగులో ఆ ప్రభుత్వాలు చేస్తున్న అక్రమాలను చాలా కాలంగా గమనిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇక ఇటువంటి అరాచకాలకు స్వస్తి చెప్పాలని కృతనిశ్చయంతో ఉంది. మోదీ, షాలు ఈ రాష్ట్రాల మీద తమ దృష్టినంతా కేంద్రీకరించడంతో ఈ ఎన్నికలు వారికి అగ్నిపరీక్షగా మారాయన్న అభిప్రాయం దేశమంతా వ్యక్తమవుతోంది. అసోంలో బీజేపీ నాయకత్వంలోని ఎన్.డి.ఎ ప్రభుత్వం మూడవ పర్యాయం అధికారంలోకి రావాలని భావిస్తోంది. గతంలో 2016, 2021 సంవత్సరాల్లో భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చి ఈశాన్య రాష్ట్రాలన్నిటినీ ప్రభావితం చేయడంతో పాటు ఈ రాష్ట్రాల్లో బీజేపీ బలాన్ని పెంచిన నాయకత్వం మూడవసారి కూడా అధికారంలోకి వచ్చే ప్రయత్నం చేస్తోంది. పుదుచ్చేరిలో అధికారంలో ఎన్.డి.ఎ భాగస్వామ్య పక్షం ఈసారి కూడా అధికారంలో కొనసాగాలని ప్రయత్నిస్తోంది.

**దక్షిణాదిపై దృష్టి**

తమిళనాడు విషయానికి వస్తే, ఇక్కడ అన్నాడి.ఎం.కెతో చేతులు కలిపిన బీజేపీ అధికార పక్షమైన డి.ఎం.కె. ను ఈసారైనా గద్దె దించాలనే పట్టుదలతో ఉంది. అనేక సంవత్సరాలుగా ఇక్కడ బీజేపీని అడ్డుకుంటున్న ద్రవిడ పార్టీల కంచుకోటలను బద్దలు కొట్టి ఈసారి ఈ పార్టీ తన బలాన్ని పెంచుకునే అవకాశం ఉంది. కేరళలో అడుగుపెట్టడం కష్టమే అయినప్పటికీ, క్రమంగా ఒక్కొక్క అడుగే ముందుకు వేస్తున్న బీజేపీ ఈసారి మరికొన్ని స్థానాలను తమ ఖాతాలో వేసుకోవడానికి అవకాశం ఉంది. అటు వామపక్ష కూటమికి, ఇటు కాంగ్రెస్ కూటమికి కంచుకోటలుగా ఉన్న కొన్ని స్థానాలు బీజేపీ చేజిక్కే సూచనలు కనిపిస్తున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో మాత్రం మమతా బెనర్జీ పార్టీని మట్టి కరిపించి అధికారంలోకి రావడమే పరమావధిగా బీజేపీ ప్రయత్నాలు సాగించింది. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఇక్కడ నాలుగవసారి అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తోంది.

వాస్తవానికి అసోం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు బీజేపీకి ప్రతిష్టాత్మకంగా మారాయి. హోం మంత్రి అమిత్ షా కోల్‌కతాలో 15 రోజుల పాటు బస చేసి, ఎన్నికల వ్యూహాలను పర్యవేక్షించడం, అధికారులకు ఆదేశాలివ్వడం వంటివి చేశారు. ఇదివరకటి ఎన్నికల్లోనే అంచనాలకు మించి స్థానాలు సంపాదించిన బీజేపీ ఆ తర్వాత కూడా అనేక స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయాలు సాధించడం ఆ పార్టీలో ఉత్సాహాన్ని పెంచింది. ఈసారి ఎన్నికల్లో ఏ అవకాశాన్నీ, ఏ మార్గాన్నీ జారవిడుచుకోకూడదని బీజేపీ గట్టి పట్టుదలతో ఉంది.

**పురోగతి దిశగా అడుగులు**

నిజానికి, 2016లో 10 శాతం ఓట్లతో మూడు స్థానాలు మాత్రమే గెలుచుకున్న బీజేపీ ఆ తర్వాత 2021 ఎన్నికల్లో 39 శాతం ఓట్లతో 77 స్థానాలను సంపాదించుకోగలిగింది. అయినప్పటికీ, 48 శాతం ఓట్లు, 200కు పైగా సీట్లతో తృణమూల్ కాంగ్రెస్ అధికారంలోకి రాగలిగింది. రాష్ట్రంలో తమకు అనుకూలంగా ప్రజాభిప్రాయం మారుతోందన్న వాస్తవాన్ని గమనించిన బీజేపీ ఆ రాష్ట్రం మీద మరింతగా దృష్టి పెట్టడం ప్రారంభించింది. ఈ రాష్ట్రాల్లో విజయం సాధించడమనేది తాత్కాలిక ప్రయోజనాలనే కాక, 2029 లోక్‌సభ ఎన్నికల ప్రయోజనాలను కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది. అసోంలో అధికారంలో కొనసాగడం, పశ్చిమ బెంగాల్ లో అధికారంలోకి రావడం, కేరళలో కొన్ని సీట్లయినా సంపాదించడం, తమిళనాడులో చక్రం తిప్పగలగడం, పుదుచ్చేరిని నిలబెట్టుకోవడం బీజేపీ ప్రధాన లక్ష్యాలుగా కనిపిస్తున్నాయి.

ఇది మోదీ జనాకర్షణను, విశ్వసనీయతను మరింతగా పెంచుతుందనడంలో సందేహం లేదు. దేశ ఆర్థిక వ్యవస్థను నాలుగవ స్థానంలో తీసుకు వెళ్లడంతో పాటు, అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తూ, అటు జాతీయంగానూ, ఇటు అంతర్జాతీయంగానూ ఉన్నత స్థానానికి చేరుకుంటూ, అనేక సంక్షోభాల నుంచి దేశాన్ని గట్టెక్కిస్తున్న మోదీ ప్రతిష్ఠ ఈ విజయాల వల్ల మరింతగా వృద్ధి చెందే అవకాశం ఉంది. ఇక ప్రాంతీయ స్థాయిలో ఉన్న పార్టీని అంతర్జాతీయంగా అతి పెద్ద పార్టీగా తీర్చిదిద్దిన అమిత్ షా బీజేపీని మున్ముందు మరింతగా బలోపేతం చేయడానికి అవకాశం కలుగుతుంది. బీజేపీని బలోపేతం చేయడంతో పాటు ఇతర ప్రధాన ప్రతిపక్షాలను కకావికలు చేయడానికి కూడా ఆయనకు అవకాశం ఉంటుంది. అనేక రాష్ట్రాల్లో అధికారాన్ని విస్తరించగలగడం వల్ల బీజేపీ కొన్ని కొత్త చట్టాలను తీసుకురావడంతో పాటు రాజ్యాంగ సవరణలు చేయడానికి కూడా అవకాశం కలుగుతుంది.

ఎన్నికలతో వచ్చే మార్పులతో పాటు ప్రభుత్వ పరంగా, సంస్థాగతంగా కూడా మోదీ కొన్ని కీలక మార్పులు చేపట్టే సూచనలు కనిపిస్తున్నాయి. సాంస్కృతిక సంబంధమైన ఆధిపత్యంతో పాటు, ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా ఆయన ఇప్పటికే అడుగులు వేస్తున్నారు. పార్టీని, ప్రభుత్వాన్ని, పాలనా యంత్రాంగాన్ని పునర్వ్యవస్థీకరించి, దేశాన్ని 2029 నాటికి మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయడానికి ఆయన కృషి చేస్తున్నారు. ఇవన్నీ ఈ ఎన్నికల ఫలితాల మీద ఆధారపడి ఉన్నాయి. మోదీ, షాల ద్వయం ఈ ఎన్నికల మీద సర్వశక్తులూ ఒడ్డడానికి ఇటువంటివే కారణాలుగా కనిపిస్తున్నాయి.



**జి.రాజశుక**
సీనియర్ జర్నలిస్ట్



# మారని తీరు..

**ప్రభుత్వాలు మారుతున్నాయి, పార్టీలు మారుతున్నాయి, కానీ, తెలంగాణ రాష్ట్రం మీదుగా అప్పుల వరద మాత్రం ఆగడం లేదు. ఒకనాడు భారీ రుణాలతో విమర్శలకు గురైన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ప్రభుత్వం స్థానంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమూ అదే బాటలో నడుస్తోందనే ఆరోపణలు మరింత బలపడుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి సగటున గంటకు రూ.13.6 కోట్ల చొప్పున రాష్ట్ర ప్రజలపై రుణభారాన్ని మోపుతున్నదని లెక్కలు చెబుతున్నాయి. సగటున రోజుకు రూ.327 కోట్ల అప్పు చేస్తూ రాష్ట్ర పాలన నిర్వహిస్తున్నదని విపక్షాలు విమర్శిస్తున్నాయి.**

రాష్ట్ర ప్రభుత్వం, ఈ ఆర్థిక సంవత్సరం (2026–27) సంవత్సరం మొదలైన మొదటి 21 రోజుల్లోనే భారతీయ రిజర్వ్ బ్యాంకు(ఆర్బీఐ) ద్వారా నిర్వహించిన పెన్ మార్కెట్ బాండ్ వేలంలో ఏకంగా రూ. 6,900 కోట్లు రుణంగా సమీకరించింది. ఏప్రిల్ 7న రెండు విడతల్లో రూ. 3,900 కోట్లు తీసుకుంది. అందులో 17 సంవత్సరాల కాలపరిమితికి రూ. 2,000 కోట్లు , 30 సంవత్సరాల కాలపరిమితికి రూ. 1,900 కోట్లు సేకరించింది. వీటిలో 17 సంవత్సరాల కాల పరిమితి కోసం తీసుకున్న రూ. 2వేల కోట్లకు 7.97శాతం వడ్డీకి అంగీకరించగా, 30 సంవత్సరాల కాలపరిమితి రుణాలకు 1900 కోట్ల రూపాయలకు వడ్డీని 8.07 శాతంగా ఖరారు చేసుకుంది. ఏప్రిల్ 21న మరో రూ. 3,000 కోట్లు సమీకరించింది. వీటిని వరుసగా 7, 11, 21 సంవత్సరాల కాలపరిమితుల్లో తలా రూ. 1,000 కోట్ల చొప్పున మూడు విడతల్లో అప్పు తీసుకుంది. వీటికి సంబంధించి వడ్డీ రేట్లు వరుసగా 7.54 శాతం, 7.70 శాతం, 7.82 శాతంగా ఉన్నాయి. వాస్తవానికి ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి అంటే.. ఏప్రిల్ నుంచి జూన్ నెల మధ్యలోనే మొత్తంగా రూ. 18,900 కోట్లు రుణ సమీకరణ చేస్తామని రాష్ట్ర ఆర్థికశాఖ ఆర్బీఐకి ముందుగానే ఇండెంట్ సమర్పించింది. అందులో మూడోవంతుకు పైగా రుణం మొదటి నెలలోనే అదీ.. తొలి 21 రోజుల్లోనే సేకరించింది.

**గత బడ్జెట్ అంచనాకు మించి అప్పు**

గత ఆర్థిక సంవత్సరం(2025–26)లో రాష్ట్ర ప్రభుత్వం ఆర్బీఐ ద్వారా ఓపెన్ మార్కెట్ రుణాలుగా రూ. 85,840 కోట్లు తీసుకుంది. అయితే, ఆ సంవత్సరపు బడ్జెట్ అంచనాల్లో రుణ సమీకరణ కేవలం రూ. 54,009 కోట్లుగా ప్రతిపాదించింది. నిజానికి బడ్జెట్ అంచనాలకంటే 158.93 శాతం అధికంగా అప్పు తీసుకోవడం అంటే.. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పూర్తిగా కోల్పోయిందన్న వాస్తవాన్ని నిరూపిస్తోందని నిపుణులు అంటున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 80,000 కోట్ల రుణ సమీకరిస్తామని బడ్జెట్లో ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే, గత అనుభవాన్ని బట్టి అసలు అప్పు దీన్ని దాటే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

**రూ.8.64 లక్షల కోట్లకు చేరనున్న రాష్ట్ర రుణభారం**

ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రాష్ట్ర మొత్తం రుణభారం రూ. 8.64 లక్షల కోట్లకు చేరనుందని అంచనా వేస్తున్నారు. ఇందులో ఎఫ్ఆర్బీఎం పరిధిలోని ప్రభుత్వ ప్రత్యక్ష రుణాలు రూ. 5,62,363 కోట్లు ఉండగా, కార్పొరేషన్లు, గ్యారంటీలు కలిపి నాన్–ఎఫ్ఆర్బీఎం అప్పులు మరో రూ. 3,01,835 కోట్లకు చేరాయి. ఈ నాన్–ఎఫ్ఆర్బీఎం అప్పుల్లో ప్రభుత్వ గ్యారంటీ ఉన్న రుణాలు రూ. 2,41,743 కోట్లు కాగా, గ్యారంటీ లేని కార్పొరేషన్ అప్పులు రూ. 60,092 కోట్లు ఉన్నాయి.

ప్రత్యక్ష రుణాలు రాష్ట్ర జీఎస్డీపీలో ఏకంగా 29 శాతానికి చేరాయి. సాధారణంగా ఈ మొత్తం 25 శాతంలోపే ఉండాలి. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 27 శాతంగా ఉన్న ఈ నిష్పత్తి కేవలం మూడు సంవత్సరాల్లో 29 శాతానికి పెరగడం రాష్ట్ర ఆర్థిక పతనానికి అద్దం పడుతున్నదని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రాష్ట్రంలో ప్రతి ఒక్కరిపై రూ. 2.46 లక్షల అప్పు ఉందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతోంది. రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 4.18 లక్షలతో దేశంలోనే ముందున్నామని గొప్పగా చెప్పుకుంటున్నా, అదే సమయంలో ప్రతి పౌరుడిపై లక్షలాది రూపాయల రుణభారం పేరుకుపోతోంది. వస్తున్న ఆదాయంతో అప్పులు తీర్చలేని పరిస్థితి నెలకొంటే, ఆ భారం నేరుగా పడేది రాష్ట్ర ప్రజలపైనే అన్న వాస్తవాన్ని ఎవరూ విస్మరించకూడదంటున్నారు విశ్లేషకులు.

రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం 2026–27 ఆర్థిక సంవత్సరంలో రూ. 1,48,186 కోట్లుగా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. కానీ, అందులో





# ... రాష్ట్రం అప్పుల కుప్ప

దాదాపు సగం మొత్తం పాత అప్పుల వడ్డీలు, చెల్లింపులకే వెచ్చించాల్సిన దుస్థితి నెలకొంది. అంటే.. సంక్షేమ పథకాలకు, అభివృద్ధి కార్యక్రమాలకు మిగిలేది చాలా తక్కువ. ఆ లోటు పూడ్చడానికి మళ్లీ అప్పే శరణ్యం, అనివార్యమయ్యే పరిస్థితి నెలకొంది.

**అప్పుల్లో దొందూదొందే**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి అప్పుల వేట ప్రారంభమైంది. కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రభుత్వం పెద్ద ఎత్తున అప్పులు చేసింది. ఒకవైపు కళ్యాణలక్ష్మి, రైతుబంధు, దళితబంధు వంటి పథకాలకు నిధులు సమకూర్చడానికి, మరోవైపు.. భారీ సాగునీటి ప్రాజెక్టులకు ఆర్థికంగా ఊతం ఇవ్వడానికి రుణాలపై ఆధారపడింది. ఆ అప్పులు భావి తరాల నెత్తిమీద పడతాయని నాటి ప్రతిపక్షం కాంగ్రెస్ తీవ్రంగా విమర్శించింది.కానీ, 2023 చివరిలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అదే రుణ సంస్కృతిని కొనసాగిస్తోంది. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, మహాలక్ష్మి, ఉచిత విద్యుత్ తదితర ఆరు గ్యారంటీ పథకాల, సంక్షేమ కార్యక్రమాల కొనసాగింపునకు భారీ ఎత్తున నిధులు అవసరం అన్నది కాదనలేని సత్యం. ఆ నిధులు రాష్ట్ర ఆదాయం నుంచి రాబట్టుకోగలిగితే సమస్య ఏమీ లేదు. కానీ, అందుకు తగినంత మొత్తంలో ఆదాయం లేకపోవడం కారణంగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మళ్లీ మార్కెట్ రుణాలనే నమ్ముకుంటోంది. అంతేకాదు.. అప్పటికే బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పెద్దమొత్తంలో తెచ్చిన పాత అప్పులకు సంబంధించిన వడ్డీలు చెల్లించేందుకూ కొత్తగా అప్పు చేయాల్సిన దుస్థితి నెలకొంది. అటు.. పాత అప్పుల వడ్డీలు కట్టేందుకు కొత్తగా అప్పులు, ఇటు.. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు కొత్తగా మరిన్ని అప్పులు చేయక తప్పని అనివార్య పరిస్థితి ఇప్పుడు నెలకొంది. ఫలితంగా రాష్ట్రం అప్పుల సుడిగుండంలో చిక్కుకున్నట్లు రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

**మెట్రో స్వాధీనంతో రూ.13,615 కోట్ల రుణభారం**

రాష్ట్రానికి ఉన్న అప్పుల తాకిడి సరిపోదన్నట్టు హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశ టేకోవర్‌తో రాష్ట్ర ప్రభుత్వం మరో భారీ రుణ సంకెళ్లను అదనంగా తగిలించుకుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో (పీపీపీ) ఎల్అండ్‌టీ, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ నిర్మించి నిర్వహిస్తున్న మెట్రో మొదటి దశను అప్పులతో కలిపి రూ.15 వేల కోట్ల వ్యయంతో ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. దానికి సంబంధించిన లాంఛన ప్రక్రియలు కూడా పూర్తి చేసింది. ఇందులో రూ.13 వేల కోట్లు అప్పులు, రూ.2,000 కోట్ల ఈక్విటీ వాటా ఉన్నాయి. మెట్రో రైలు స్వాధీనానికి కీలకమైన రూ.13,615 కోట్ల రుణం ఇవ్వడానికి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) అంగీకరించింది. ఈ అప్పును 20 సంవత్సరాల్లో చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఒప్పందానికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. మిగిలిన మొత్తాన్ని హెచ్ఎండీఏ ద్వారా సమకూర్చుకోనుంది. అలాగే మెట్రో నిర్వహణ నిరంతరాయంగా కొనసాగేందుకు ఎల్అండ్‌టీ ఉద్యోగులు 115 మందిని ఏడాది పాటు హెచ్ఎంఆర్ఎల్ పే-రోల్‌పై కొనసాగించనున్నారు. అందుకు అయ్యే వేతనాల ఖర్చు రూ.24.3 కోట్లు హెచ్ఎంఆర్ఎల్ భరించాల్సి ఉంటుంది.

ఈ పరిస్థితులపై ఆర్థిక నిపుణులు ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరిస్తున్నారు. అప్పులు నియంత్రిస్తామని, తక్కువ వడ్డీ రుణాల వైపు మళ్లుతామని, ఆఫ్-బడ్జెట్ రుణాలను బడ్జెట్ పరిధిలోకి తెస్తున్నామని ప్రభుత్వం ఫిస్కల్ పాలసీ స్టేట్‌మెంట్‌లో తన ఆర్థిక విధాన ప్రకటనలో పేర్కొంది. కానీ, క్షేత్రస్థాయిలో, వాస్తవ పరిస్థితిలో సంఖ్యలు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. వచ్చే సంవత్సరంలోనే బహిరంగ మార్కెట్ నుంచి రూ.73,383 కోట్ల రుణాలు సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అదనంగా కేంద్రం నుంచి రూ.5,500 కోట్లు, ఇతర రుణాలు రూ. వేయి కోట్లు, ఇతర డిపాజిట్లు, అడ్వాన్స్‌లతో రూ.2,986 కోట్లు తీసుకోనున్నట్టు వెల్లడించింది. ఇవన్నీ కలిపి 2026-27 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రుణ సమీకరణ రూ.82,000 కోట్లు దాటనుంది. కార్పొరేషన్లు, ఇతర సంస్థల గ్యారంటీ అప్పుల వడ్డీలు, కిస్తీల చెల్లింపు కూడా ప్రభుత్వానికి పెను సవాలుగా మారింది. ఈ ఆర్థిక సంవత్సరం కూడా ఇదే పరిస్థితి కొనసాగితే, రాబోయే రోజుల్లో రాష్ట్ర ఖజానాపై వడ్డీల భారం మరింత పెరిగే ప్రమాదం పొంచి ఉంది.

**జవాబుదారీతనం ఏది?**

బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై విమర్శలు చేస్తూనే ఆ అప్పులకు తోడు.. ప్రస్తుత ప్రభుత్వం మరిన్ని అప్పులు చేయడం పట్ల ప్రతిపక్షాలు నిలదీస్తున్నాయి. ప్రభుత్వం మాత్రం అప్పు ఆర్థిక వ్యవస్థకు అప్పు అవసరమని, సంక్షేమ పథకాల అమలుకు అనివార్యమని సమర్థించు కుంటోంది. కానీ, ఒక్క విషయం స్పష్టంగా అర్థమవుతోంది. అర్థం కావడమే కాదు.. వాస్తవమూ అదే.. ఏంటంటే... అప్పు చేసేది పాలకులు, భరించేది ప్రజలు. నేటి ప్రభుత్వాలు చేస్తున్న అప్పులకు రేపటి భవిష్యత్ తరాలు వడ్డీ చెల్లించాల్సి వస్తుందన్నది నిజం. తెలంగాణ ప్రజల నెత్తిపై ఇలా అప్పుల కుప్ప మరింత భారంగా మారకముందే.. అర్థవంతమైన ఆర్థిక క్రమశిక్షణ, పారదర్శకత అత్యంత అవసరం అని రాజకీయ, ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సుజాత గోపగోని
సీనియర్ జర్నలిస్ట్, 6302164068



**మూడేళ్ల సంక్షోభం తర్వాత రాష్ట్రంలో నూలు మిల్లులు లాభాల బాటలో పయనిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో జౌళి ఉత్పత్తులకు పెరిగిన భారీ డిమాండ్, చైనా, బాంగ్లాదేశ్‌లకు తిరిగి భారీగా ప్రారంభమైన ఎగుమతులు ఈ రంగానికి మళ్లీ ప్రాణం పోశాయి. నష్టాల ఊబిలో కూరుకుపోయిన మిల్లులు ఇప్పుడు గిట్టుబాటు ధరలతో లాభాల బాట పట్టాయి.**

# నూలు మిల్లులు కష్టాల

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించే నూలు మిల్లుల రంగం గత మూడేళ్లుగా తీవ్రమైన సంక్షోభంలో కూరుకు పోయింది. 2022 నుంచి 2025 వరకు పెరిగిన విద్యుత్ ఛార్జీలు, ఖరీదైన ముడిసరకు ధరలు, పడిపోయిన ఎగుమతుల కారణంగా రాష్ట్రంలోని దాదాపు 30కి పైగా మిల్లులు పూర్తిగా మూతపడ్డాయి. వేలాది మంది కార్మికులు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. కానీ, మూడేళ్ల సుదీర్ఘ చీకటి కాలం తర్వాత, అంతర్జాతీయ మార్కెట్‌లో జౌళి ఉత్పత్తులకు పెరిగిన భారీ డిమాండ్ కారణంగా 2026 ఏప్రిల్ నాటికి ఈ పరిశ్రమలో అనూహ్యమైన మార్పు చోటుచేసుకుంది. ఎగుమతులు పెరిగి మిల్లులు ఇప్పుడు గిట్టుబాటు ధరలతో లాభాల బాట పట్టాయి. కష్టాల కొలిమి నుంచి లాభాల తీరం వైపు సాగుతున్న ఏపీ నూలు మిల్లుల పునరుజ్జీవన ప్రయాణం మూడేళ్లుగా ఇలా సాగింది.

**ఆర్థిక వ్యవస్థ కీలకపాత్ర**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో దశాబ్దాలుగా అత్యంత కీలక పాత్ర పోషిస్తూ, లక్షలాది మందికి జీవనాధారంగా నిలిచిన వస్త్ర, నూలు పరిశ్రమ, గత కొన్నేళ్లుగా ఊహించని రీతిలో అత్యంత తీవ్రమైన ఒడుదొడుకులను, భయానకమైన ఆర్థిక సంక్షోభాలను ఎదుర్కొని, ఎట్టకేలకు ఒక సానుకూలమైన మలుపు తిరిగింది. 2022 ఏప్రిల్‌లో రష్యా–ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన సరఫరా గొలుసు అంతరాయాలతో ప్రారంభమైన ఈ చీకటి దశ, క్రమంగా 2025 నాటికి రాష్ట్ర పారిశ్రామిక రంగానికి ఒక పీడకలగా పరిణమించింది.

సుమారు 35 లక్షల స్పిండిల్ సామర్థ్యం కలిగి, ప్రత్యక్షంగా 70 వేల మంది కార్మికులకు, పరోక్షంగా మరో లక్ష మందికి పైగా ఉపాధి కల్పిస్తున్న ఈ అతిపెద్ద రంగం కుప్పకూలే పరిస్థితికి చేరుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మొత్తం 125 నూలు మిల్లులలో, మూడేళ్ల పాటు వరుసగా వచ్చిన భారీ నష్టాలను ఆర్థికంగా తట్టుకోలేక సుమారు 30 మిల్లులు శాశ్వతంగా మూతపడగా, మిగిలినవి మనుగడ కోసం కష్టాల కొలిమిలో అత్యంత దీన స్థితిలో నెట్టుకు రావాల్సి వచ్చింది. ఈ మూసివేతల కారణంగా అప్పటివరకు పరిశ్రమలపై ఆధారపడి బతుకుతున్న వేలాది మంది కార్మికులు రాత్రికి రాత్రే తమ జీవనోపాధిని కోల్పోయి రోడ్డున పడ్డారు.

వాస్తవానికి, ఒక నూలు మిల్లును ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆపివేస్తే, అందులో పనిచేసే 300 నుండి 800 మంది అత్యంత నిపుణులైన కార్మికులు ఉపాధి వెతుక్కుంటూ తమ స్వగ్రామాలకు వలస వెళ్లిపోతారు. దీనివల్ల వాతావరణం అనుకూలించి భవిష్యత్తులో ఆ మిల్లును తిరిగి ప్రారంభించాలనుకున్నా, నైపుణ్యం ఉన్న కార్మికుల కొరత వల్ల అది దాదాపు అసాధ్యంగా మారుతుంది. అంతర్జాతీయ వాణిజ్యంలో వచ్చిన అనూహ్యమైన ప్రతికూల మార్పులు, ముడిసరకు లభ్యత తగ్గిపోవడం, దేశీయంగా తలెత్తిన ఆర్థిక ఇబ్బందుల వలయంలో చిక్కుకుని, బ్యాంకుల నుంచి తీసుకున్న భారీ రుణాల వాయిదాలు కూడా చెల్లించలేని స్థితిలో పలు ప్రతిష్ఠాత్మక మిల్లులు నిరర్థక ఆస్తులుగా మిగిలిపోయాయి.

**మార్కెట్ ధరలు - ఉత్పత్తి ఖర్చుల మధ్య భారీ వ్యత్యాసం**

ఈ చారిత్రక సంక్షోభానికి ప్రధాన కారణం మార్కెట్ ధరలకు, ఉత్పత్తి ఖర్చులకు మధ్య ఉన్న భారీ వ్యత్యాసమే అని చెప్పవచ్చు. 2025 నాటి గడ్డు పరిస్థితులను నిశితంగా గమనిస్తే, మార్కెట్లో గిట్టుబాటు ధరలు పూర్తిగా పతనమవడం, మరోవైపు ఉత్పత్తి వ్యయం విపరీతంగా పెరగడంతో కిలో దారం ఉత్పత్తిపై మిల్లు యజమానులకు సగటున రూ. 10 నుంచి రూ. 15 వరకు కచ్చితమైన నష్టం వాటిల్లింది. అధిక పరిమాణంలో ఉత్పత్తి జరిగే ఈ రంగంలో ఇంత భారీ నష్టం రావడం పరిశ్రమ పునాదులనే కదిలించింది. ఇందులో విద్యుత్ ఛార్జీల భారం మిల్లుల పాలిట ఉరితాడులా మారింది. కిలో దారం ఉత్పత్తికి అయ్యే మొత్తం వ్యయంలో ఏకంగా 55 శాతం కేవలం విద్యుత్ బిల్లులకే సరిపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఉదాహరణకు, ఒక కిలో 40–కౌంట్ దారం ఉత్పత్తి చేయడానికి రూ. 80 నుంచి రూ. 87 వరకు ఖర్చు అవుతుంటే, అందులో సగానికి పైగా, అంటే రూ. 42 నుంచి రూ. 43 కేవలం కరెంటుకే వెచ్చించాల్సి రావడం ఈ రంగం ఆర్థిక దుస్థితికి అద్దం పడుతోంది. దీనికి తోడు ప్రభుత్వాల నుంచి పారిశ్రామిక రాయితీల కింద రావాల్సిన రూ. 1,000 కోట్ల ప్రోత్సాహకాల బకాయిలు సకాలంలో విడుదల కాకపోవడం, సొంత విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు లేని చిన్న మిల్లులకు ప్రాణసంకటంగా మారింది. మహారాష్ట్ర వంటి పొరుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు పరిశ్రమలకు మద్దతుగా విద్యుత్ ఛార్జీలు తక్కువగా నిర్ణయించడంతో, ఏపీ మిల్లులు జాతీయ మార్కెట్ పోటీలో దారుణంగా వెనుకబడిపోయాయి. ఇక అత్యంత కీలకమైన ముడిసరకు విషయానికి వస్తే, అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక క్యాండీ దూది (356 కిలోలు) రూ. 50 వేలు తక్కువ ధరకు లభిస్తున్నప్పటికీ, ప్రభుత్వం విధించిన 11 శాతం అదనపు దిగుమతి సుంకం వల్ల ఆ ప్రయోజనం మిల్లులకు దక్కలేదు. దీంతో, స్థానిక మిల్లులు అనివార్యంగా దేశీయ మార్కెట్లోనే రూ. 56,000 అత్యధిక ధర వెచ్చించి పత్తిని కొనుగోలు చేయాల్సి





# నుంచి లాభాల దిశగా..

వచ్చింది. ఇలా అడుగడుగునా ఖర్చులు పెరిగి పోవడంతో మిల్లులు నష్టాల ఊబిలో కూరుకు పోయాయి.

**పెరిగిన డిమాండ్**

అయితే, సుదీర్ఘమైన కారుచీకటి తర్వాత అనూహ్యంగా వెలుగు రేఖలు వచ్చినట్లుగా, 2026 ఏప్రిల్ నాటికి రాష్ట్ర నూలు మిల్లుల పరిస్థితిలో అనూహ్యమైన, అత్యంత ఆశాజనకమైన మలుపు చోటుచేసుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో జౌళి ఉత్పత్తులకు అకస్మాత్తుగా తీవ్రమైన కొరత ఏర్పడటంతో, ప్రపంచ వ్యాప్తంగా నూలు డిమాండ్ ఒక్కసారిగా పెరిగిపోయింది. ఇది ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆంధ్రప్రదేశ్ నూలు మిల్లులకు నిజమైన సంజీవినిలా పనిచేసింది. దాదాపు రెండేళ్లుగా పూర్తిగా నిలిచిపోయిన విదేశీ ఎగుమతులు తిరిగి పూర్తి స్థాయిలో ఊపందుకోవడం ఈ ఆకస్మిక పునరుజ్జీవనానికి ప్రధాన కారణం. ప్రస్తుతం మన దేశంలో ఉత్పత్తయ్యే మొత్తం దారంలో దాదాపు 20 శాతం చైనా దేశానికి, 5 శాతం బాంగ్లాదేశ్‌కు నేరుగా ఎగుమతి అవుతూ పరిశ్రమకు ఊపిరి పోస్తోందిట. ముఖ్యంగా రాష్ట్రంలో తయారయ్యే 21-కౌంట్ దారానికి చైనా మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉంది. ప్రపంచవ్యాప్తంగా అమ్ముడయ్యే నాణ్యమైన టవళ్లు, కర్టెన్లు, ఇతర గృహాలంకరణ జౌళి ఉత్పత్తుల తయారీలో అత్యంత కీలకమైన ఈ 21-కౌంట్ దారాన్ని మన మిల్లులు ప్రస్తుతం కిలోకు రూ. 240 లాభదాయకమైన ధరకు భారీ ఎత్తున విక్రయిస్తున్నాయి. మరోవైపు, ప్రపంచంలోనే అతిపెద్ద వస్త్ర తయారీ కేంద్రంగా ఉన్న బాంగ్లాదేశ్, తమ దేశంలోని భారీ గార్మెంట్ పరిశ్రమ, ముఖ్యంగా టీ-షర్టులు, బనియన్లు, లోదుస్తుల తయారీ కోసం మన రాష్ట్రం నుంచి 30, 34, 40-కౌంట్ దారంతో పాటు అత్యుత్తమ నాణ్యత గల ముడి పత్తిని కూడా పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తోంది. వస్త్ర పరిశ్రమలో అత్యంత కీలకమైన నాణ్యమైన 40-కౌంట్ దారానికి అంతర్జాతీయ మార్కెట్లో ప్రస్తుతం కిలోకు రూ.305 రికార్డు స్థాయి ధర పలుకు తుండటం విశేషం. దీనికి అదనపు బోనస్‌గా, భారత రూపాయి మారకపు విలువతో పోలిస్తే అంతర్జాతీయ మార్కెట్లో అమెరికన్ డాలర్ అనూహ్యంగా బలపడటం కూడా మన ఎగుమతిదారుల లాభాల శాతాన్ని గణనీయంగా పెంచి, వారు ఆర్థికంగా వేగంగా గట్టెక్కడానికి ఎంతగానో సహాయపడింది.

**కొత్త సవాలు**

ఈ విధంగా మిల్లులు తమ మూడేళ్ల సుదీర్ఘమైన, బాధాకరమైన సంక్షోభం నుంచి విజయవంతంగా కోలుకుంటున్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో వారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మరో కొత్త సవాలును ధైర్యంగా ఎదుర్కోవాల్సి వస్తోంది. ఏ విదేశీ ఎగుమతుల డిమాండ్ అయితే వారిని నష్టాల ఊబి నుంచి గట్టెక్కించిందో, కచ్చితంగా అదే డిమాండ్ ఇప్పుడు ప్రధాన ముడిసరకు ధరల అమాంతం పెరుగుదలకు కూడా పరోక్షంగా దారితీస్తోంది. వాతావరణ మార్పుల వల్ల ప్రపంచవ్యాప్తంగా పత్తి దిగుబడి గణనీయంగా తగ్గడం, అంతర్జాతీయంగా జౌళి ఉత్పత్తులకు డిమాండ్ అత్యంత తీవ్రంగా ఉండటం వల్ల, దారం తయారీకి మూలాధారమైన ముడిపత్తి ధరలు మళ్లీ ఆకాశాన్నంటుతున్నాయి. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉందంటే, 2026 జనవరి నెలలో రూ. 55,000 గా ఉన్న ఒక క్యాండీ దూది (356 కిలోలు) మార్కెట్ ధర, కేవలం మూడు నెలల స్వల్ప వ్యవధిలోనే, అంటే ఏప్రిల్ నాటికి ఏకంగా రూ. 61 వేలకు పెరిగిపోయి ఉత్పత్తిదారులను కలవరపెడుతోంది. అయినప్పటికీ, అంతర్జాతీయ మార్కెట్లో నూలుకు ఉన్న బలమైన డిమాండ్, ఎగుమతుల ద్వారా వస్తున్న అత్యంత అనుకూలమైన అధిక ధరలు ప్రస్తుతానికి ఆంధ్రప్రదేశ్‌లోని నూలు మిల్లులను నష్టాల నుంచి కాపాడి తిరిగి లాభాల బాటలోనే పయనించేలా చేస్తున్నాయి. అయితే, దీర్ఘకాలికంగా ఈ సానుకూల పరిస్థితులు స్థిరంగా కొనసాగాలంటే, ఉత్పత్తి వ్యయంలో సింహభాగం ఆక్రమిస్తున్న విద్యుత్ ఖర్చులను శాశ్వతంగా తగ్గించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇందులో భాగంగా, భవిష్యత్తులో పరిశ్రమలన్నీ గ్రీన్ ఎనర్జీ (సౌర, పవన విద్యుత్) యూనిట్లను సొంతంగా ఏర్పాటు చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకే సులభ వాయిదాల్లో రుణాలు ఇప్పించే ఒక సమగ్రమైన విధానాన్ని తీసుకువస్తే, 50 శాతంగా ఉన్న విద్యుత్ వ్యయాన్ని శాశ్వతంగా తగ్గించుకోవచ్చు. ప్రపంచవ్యాప్త వస్త్ర డిమాండ్ రాబోయే కాలంలో ఇదే విధంగా స్థిరంగా కొనసాగి, రాష్ట్ర ప్రభుత్వం గతంలో పెండింగ్‌లో పెట్టిన ప్రోత్సాహక బకాయిలను తక్షణమే విడుదల చేసి పారిశ్రామికవేత్తలకు పూర్తి స్థాయిలో నైతిక, ఆర్థిక మద్దతుగా నిలిస్తే, ఆంధ్రప్రదేశ్ వస్త్ర పరిశ్రమ తన కోల్పోయిన పూర్వ వైభవాన్ని తిరిగి పొందడమే కాకుండా రాబోయే దశాబ్దంలో దేశంలోనే అగ్రగామిగా నిలవడం ఖాయం.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్

"లెక్చర్లు ఇచ్చి జనాలను మెప్పించడం నాకు వెన్నతో పెట్టిన విద్య" అని గిరీశం కన్యాశుల్కంలో చెప్పిన వ్యాఖ్యలు ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు సరిగ్గా సరిపోతాయి. మద్యం స్కాంకు సంబంధించి ఆయన ఢిల్లీ హైకోర్టులో స్వయంగా వాదించడం చూస్తే కేసులో అసలైన విషయాలను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని అర్థమవుతోంది. అవినీతిపై పోరాటం పేరుతో అధికారంలోకి వచ్చిన ఆయన మద్యం స్కాంలో జైలుకు వెళ్లారు.ఆ తర్వాత ఆయనపై కేసును కోర్టు కొట్టివేసింది. దాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టును సీబీఐ ఆశ్రయించింది. అనంతరం నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. తన కేసు విచారిస్తున్న న్యాయమూర్తినే మార్చాలని కేజ్రీవాల్ కోర్టును కోరడం సంచలనం రేపింది. కేసును పక్కదారి పట్టించడంతో పాటు ప్రజల్లో లేనిపోని అనుమానాలు సృష్టించి, సానుభూతి పొందడం లక్ష్యంగానే ఆయన న్యాయమూర్తిపైనే వ్యాఖ్యలు చేశారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

# కోర్టులతో కేజ్రీవాల్ రా

దేశ రాజకీయ, న్యాయవ్యవస్థల మధ్య సున్నితమైన సమతుల్యతను మరోసారి పరీక్షించిన ఘటనగా ఢిల్లీ మద్యం పాలసీ కేసు నిలిచింది. కేవలం ఒక కేసు పరిధిలోనే కాకుండా, న్యాయవ్యవస్థ స్వతంత్రత, రాజకీయాల పాత్ర, పార్టీ అంతర్గత పరిస్థితులన్నీ కలిపి ఒక పెద్ద చర్చకు దారి తీస్తున్నాయి.

ఆప్ ప్రభుత్వం ఢిల్లీలో తీసుకొచ్చిన మద్యం పాలసీపై అవినీతి ఆరోపణలు రావడంతో దీనిపై సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దర్యాప్తు ప్రారంభించాయి. నవంబర్ 17, 2021న మద్యం పాలసీని తీసుకొచ్చిన ఢిల్లీ ప్రభుత్వం సెప్టెంబర్, 2022లో దానిని వెనక్కి తీసుకొంది. ఈ మధ్యకాలంలోనే ఆప్ నేతలు మనీలాండరింగ్‌కు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. మద్యం పాలసీని సవరించే టప్పుడు అక్రమాలకు పాల్పడ్డారని సీబీఐ, ఈడీలు ఆరోపించాయి. లైసెన్స్‌దారులకు అవసరమైన సాయం చేసి వారి నుండి ప్రతిఫలం పొందినట్టు దర్యాప్తు సంస్థలు చెప్పాయి. ఈ స్కాంలో అరవింద్ కేజ్రీవాల్‌తోపాటు ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, ఇతర ఆప్ నేతలు, తెలంగాణకు చెందిన మాజీ ఎంపీ, కేసీఆర్ కూతురు కవిత జైలుకు వెళ్లి విడుదలయ్యారు. అనంతరం మద్యం పాలసీపై విచారణ జరిపిన రౌస్ అవెన్యూ కోర్టు మొత్తం 23 మంది నిందితులపై నమోదు చేసిన కేసులను కొట్టివేసింది. అభియోగాలపై తగిన ఆధారాలను సీబీఐ చూపించలేకపోయిందని పేర్కొంది.. అయితే ఈ తీర్పును సీబీఐ హైకోర్టులో సవాలు చేయడంతో ఢిల్లీ మద్యం స్కాం కేసు మళ్లీ వెలుగులోకి వచ్చింది.

సీబీఐ దాఖలు చేసిన పిటీషన్‌ను స్వీకరించిన ఢిల్లీ హైకోర్టు కేజ్రీవాల్, సిసోడియా, కవిత సహా మొత్తం 23 మంది నిందితులకు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో సీబీఐ అధికారిపై విచారణ జరపాలంటూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ స్టే ఇచ్చారు. దీంతో కలవరపడిన కేజ్రీవాల్ ఈ అప్పీల్ కేసును జస్టిస్ స్వర్ణకాంత శర్మ బెంచ్ నుండి మరో ఇతర బెంచ్‌కు బదిలీ చేయాలని, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దేవంద్ర కుమార్ ఉపాధ్యాయకు లేఖ రాయగా ఆయన తోసిపుచ్చారు. రోస్టర్ ప్రకారం కేసును బెంచ్‌కు కేటాయిస్తారని కోర్టు తెలిపింది. అయితే దీనిపై అసంతృప్తి చెందిన కేజ్రీవాల్ సీబీఐ పిటీషన్‌పై జస్టిస్ స్వర్ణకాంత శర్మ విచారణ ప్రారంభించడానికి ముందే సుప్రీం కోర్టును ఆశ్రయించారు.

కేజ్రీవాల్ తన వాదనల్లో ప్రధానంగా జస్టిస్ స్వర్ణకాంత శర్మపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులు కేంద్ర ప్రభుత్వానికి లాయర్లుగా పనిచేస్తున్నారని, ఈ పరిస్థితిలో కేసు విచారణలో నిష్పక్షపాతంపై అనుమానం కలుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ కేసులో భాగస్వామిగా ఉన్నందున, న్యాయమూర్తి కుటుంబ సంబంధాలు ప్రభావం చూపవచ్చని ఆయన వాదించడం విడ్డూరం. "న్యాయం జరిగితే సరిపోదు, న్యాయం జరిగినట్టు కనిపించాలి" అన్న సూత్రాన్ని కూడా తన వాదనలో ప్రస్తావించారు. ఈ కేసు రాజకీయ ప్రేరేపితమైందని, కేంద్ర ప్రభుత్వం తనను లక్ష్యంగా చేసుకుందని పేర్కొన్నారు. దర్యాప్తు సంస్థలు స్వతంత్రంగా కాకుండా రాజకీయ ప్రభావంతో పనిచేస్తున్నాయన్నారు. ఇక్కడ ఆయన వాదన చాలా విచిత్రంగా ఉంది. ఒక కుటుంబంలోని వ్యక్తులు వేర్వేరు వృత్తుల్లో ఉండడం సహజం. వృత్తిరీత్యా వారు చేసే పనులు కుటుంబంలోని ఇతర వ్యక్తులపై పడుతుందని చెప్పడం హాస్యాస్పదం. న్యాయమూర్తి కుటుంబ సభ్యులు ప్రభుత్వ విధులు నిర్వహిస్తే సర్కారు వారిపై ఒత్తిడి తెచ్చి కేసును ప్రభావితం చేస్తుందని చెప్పడం ఆశ్చర్యకరం. ఇది న్యాయమూర్తిని శంకించడమే. తనకు అనుకూలంగా వస్తే న్యాయం గెలిచిందని వ్యాఖ్యలు చేసే వీరు, కొంచెం అననుకూలత కనిపిస్తే న్యాయమూర్తిపై, న్యాయ



వ్యవస్థపై అనుమానాలు వ్యక్తం చేయడమంటే అసలైన విషయాలను పక్కదారి పట్టిస్తూ కేసుపై ప్రభావం చూపించేందుకు ప్రయత్నించడం దిగజారుడుతనమే.

ఇదే సమయంలో కేజ్రీవాల్ మరో అడుగు ముందుకేసి సంఘపరివార్ గురించి కేసులో ప్రస్తావించారు. తాను బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలకు వ్యతిరేకం కాబట్టి న్యాయం విషయంలో అనుమానాలున్నాయని చెబుతున్న కేజ్రీవాల్ కేసును మరో న్యాయమూర్తికి బదిలీ చేయాలని కోరారు. ఇక్కడ బీజేపీకి, ఆర్‌ఎస్‌ఎస్‌కు కేసుతో సంబంధమేమిటి? అనే అనుమానాన్ని ఉద్దేశపూర్వకంగా రేకెత్తించారు. కేసు విచారిస్తున్న జస్టిస్ స్వర్ణ కాంత శర్మ ఆర్‌ఎస్‌ఎస్‌కు అనుబంధంగా ఉన్న పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారని కేజ్రీవాల్ వాదించారు.

# జకీయాలు

ఆయన చేసిన వాదన విడ్డూరంగా ఉంది. ఉన్నతాధి కారులు, పదోన్నతుల్లో ఉన్న వారు స్వచ్ఛంద, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడంపై ఆక్షేపించడం సమంజసం కాదు. నిజంగా కోర్టు వ్యవహారాల్లో బీజేపీ ప్రభుత్వం జోక్యం చేసుకొని ఉంటే కేజ్రీవాల్‌కు ట్రయల్ కోర్టులో ఊరట లభించేదా..? ఆర్ఎస్ఎస్ ఒక సాంస్కృతిక స్వచ్ఛంద సంస్థ. అది ఇతర



అంశాల్లో జోక్యం చేసుకోవడమే కనిపించదు. న్యాయమూర్తిపై వారి ప్రభావం ఉంటుందనే అనుమానాలు రేపడం కేసును పక్కదారి పట్టించడమే. ఉన్నతస్థానంలోని న్యాయమూర్తి ప్రభావితమవుతారని చెప్పడం వారిని అవమానించడమే. మరింత విచిత్రం ఏమిటంటే జస్టిస్ స్వర్ణ క్రాంత శర్మ గతంలో తాను తన అరెస్టును సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటీషన్‌ను తిరస్కరించారని, సిసోడియా, కవితలకు బెయిల్ కూడా ఇవ్వలేదని అన్నారు. ఈ వాదన చూస్తే న్యాయమూర్తులందరూ తనకు అనుకూలంగా ఉండాలని కేజ్రీవాల్ కోరుకుంటున్నారు. లేకపోతే వారిపై అభాండాలు వేస్తున్నారని స్పష్టమవుతోంది. న్యాయమూర్తులు తమ వద్దకు వచ్చిన కేసుల్లో న్యాయాన్యాయాలను అంచనావేసి తీర్పులు ఇస్తుం టారు. అంతే కానీ వ్యక్తులను, హోదాలను బట్టి తీర్పులివ్వరనే కనీస అవగాహన లేకుండా క్రేజీవాల్ న్యాయమూర్తి అంశాన్ని రాజకీయం చేశారు.

కేజ్రీవాల్ అసంబద్ధ వ్యాఖ్యలను కోర్టు ఖండించడంతో దేశ ప్రజలకు న్యాయస్థానాలపై విశ్వాసం మరింత పెరిగింది. వ్యక్తిగత అభిప్రా యాలు, అనుమానాల ఆధారంగా న్యాయమూర్తిని మార్చలేమని హైకోర్టు స్పష్టం చేయడం ఆహ్వానించ దగ్గ పరిణామం. న్యాయమూర్తుల కుటుంబ సభ్యులు స్వతంత్ర వృత్తిపరమైన హక్కులు కలిగుంటారని, వారికి ఈ కేసుకు ఎలాంటి సంబంధం లేదని కోర్టు తేల్చింది. న్యాయమూర్తులపై చేసే వ్యక్తిగత ఆరోపణలు వ్యవస్థపై చేస్తున్న దాడిగా పరిగణించాల్సి వస్తుందని కోర్టు తీవ్రంగా హెచ్చరించింది. కేజ్రీవాల్‌తో పాటు మనీష్ సిసోడియా, ఆప్ నేత దుర్గేష్ పాఠక్ దాఖలు చేసిన ఇటువంటి పిటీషన్లను హైకోర్టు కొట్టివేయడం వీరికి చెంపపెట్టు. ఒక రాజకీయ నాయకుడు న్యాయమూర్తి సామర్థ్యాన్ని నిర్ణయించలేడని, ఇటువంటి వాదనలు న్యాయ వ్యవస్థపై అనవసరమైన అనుమానాలను పెంచే ప్రమాదం ఉందని కోర్టు అభిప్రాయపడింది. సరైన ఆధారాలు లేకుండా ఏకపక్షంగా ఆరోపణలు చేయడం న్యాయవ్యవస్థపై విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని ఆక్షేపించిన కోర్టు కేజ్రీవాల్ అభ్యర్థనను తిరస్కరిస్తూ అదే న్యాయమూర్తితో విచారణ కొనసాగించాలని నిర్ణయించడం స్వాగతించాల్సిన అంశం.

హైకోర్టు తీర్పుతో తన పాచిక పారలేదని గ్రహించిన కేజ్రీవాల్ బృందం న్యాయమూర్తిని మార్చాలని కోరుతూ సుప్రీం కోర్టు తలుపు తట్టడం న్యాయపోరాటాన్ని మరో స్థాయికి తీసుకెళ్లడమే. హైకోర్టు సీబీఐ పిటీషన్‌ను స్వీకరించి నోటీసులు జారీ చేయడం, సీబీఐపై విచారణ ఆపివేయడంతో పాటు కింది స్థాయి కోర్టు చేసిన వ్యాఖ్యలను తప్పుపడుతూ వ్యాఖ్యానించడంతో కేజ్రీవాల్‌లో అభద్రతా నెలకొంది. రౌస్ అవెన్యూ కోర్టు తీర్పు అనుకూలంగా రావడంతో తనపై మోదీ ప్రభుత్వం కక్షపూరితంగా కేసులు నమోదు చేసిందని వ్యాఖ్యా నిస్తూ కేజ్రీవాల్ కోర్టులోనే కన్నీరు పెట్టుకున్నారు. సెంటిమెంట్‌తో ప్రజల మనస్సును గెలుచుకోవడానికి ప్రయత్నించారు. అయితే హైకోర్టు ప్రాథమికంగానే నోటీసులు ఇవ్వడంతో పాటు సీబీఐపై విచారణను ఆపివేయడంతో అవి తనకు వ్యతిరేక సంకేతాలుగా ఆయన భావించారు. ఫలితంగా న్యాయమూర్తినే మార్చాలని కోరారు. దీంతో ఆయన రెండు ఆశయాలను లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒకటి తానే స్వయంగా వాదిస్తే ప్రజలకు తనపై సానుభూతి వస్తుందని, మరొకటి జడ్జీని మార్చాలని కోరితే అక్కడ తనకు అన్యాయం జరుగుతుందనే అపోహను ప్రజల్లోకి పంపించవచ్చని ఆయన భావించారు. ఈ పరిణామాలను పరిశీలిస్తే రాజకీయాలతో న్యాయ వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నమని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కోర్టు ముందు స్పష్టమైన ఆధారాలు చూపకుండా, కేవలం అనుమానాలతో వాదించడం న్యాయపరంగా చెల్లదనే అభిప్రాయా లున్నాయి. కేసులో ఎదుర్కొంటున్న బలమైన ఆరోపణల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు కోర్టులో కేజ్రీవాల్ రాజకీయ కథనం నిర్మించే ప్రయత్నం చేశారు. అధికారం కోల్పోయిన కేజ్రీవాల్ రాజకీయంగా బలహీనపడుతున్న దశలో ట్రయల్ కోర్టు తీర్పు ఆయనకు ఊరటనిచ్చింది. దాన్ని ఆసరాగా చేసుకొని ఆయన తిరిగి బలపడాలని చూస్తున్నా రాజకీయంగా కలిసి రావడం లేదు. ఇదే సమయంలో ఆమ్ఆద్మీ పార్టీలో అంతర్గత రాజకీయ పరిస్థితులపై కూడా చర్చలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు రాఘవ చద్దాతో పాటుగా మరో ఆరుగురు ఆప్ రాజ్యసభ సభ్యులు బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్ సమక్షంలో బీజేపీలో చేరిన విషయం కేజ్రీవాల్‌కు మింగుడుపడటం లేదు.

ఆయన రాజకీయ ప్రస్థానంలో గతంలో కూడా వివాదాలు ఎదుర్కొన్న సందర్భాల్లో కూడా అసలు విషయాలను పక్కదారి పట్టించేవారు. అవినీతి వ్యతిరేక ఉద్యమంతో ప్రారంభమైన ఆయన ప్రయాణం తరువాత కొన్ని నిర్ణయాలపై విమర్శలను ఎదుర్కొంది. ఢిల్లీ మద్యం పాలసీ వివాదం, అధికార వినియోగంపై వచ్చిన ఆరోపణలు, కేంద్ర సంస్థలతో ఘర్షణలు వంటి అంశాలు తరచూ చర్చకు వచ్చాయి. అదనంగా, ప్రతి విచారణను రాజకీయ కోణంలో చూపించడం, కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం ఆయనకు అలవాటుగా మారిపోయింది. ఇలాంటి ప్రయత్నాల్లో పలుమార్లు భంగపడి అధికారం కోల్పోయిన కేజ్రీవాల్‌కు మరోసారి భంగపాటు తప్పేలా లేదు.

మద్యం స్కాంలో కేజ్రీవాల్‌కు ట్రయల్ కోర్టులో ఊరట లభించినా హైకోర్టులో ఎదురుదెబ్బ తగులుతుందేమోననే భయం ఆయన్ను వెంటాడు తోందని పలు పరిణామాలు నిరూపిస్తున్నాయి. అందుకే ఆప్ అధినేత రాజకీయ ఎత్తుగడలు వేస్తూ, వాటిలో భాగంగా కేసులో ప్రధాన అంశాలను పక్కదారి పట్టించడం, న్యాయమూర్తులపై వ్యక్తిగత ఆరోపణలతో ఒత్తిడి తేవడం వంటి అస్త్రాలను ప్రయోగిస్తున్నారు. అవినీతిపై పోరాటం అంటూ అధికారంలోకి వచ్చిన ఆయన అదే అవినీతి రాజకీయాల్లో కూరుకుపోయారు. ఇప్పుడు అదే పంథాలో కోర్టులతో కూడా రాజకీయాలు చేస్తున్నారు. ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా అంతిమంగా గెలిచేది సత్యమే.

**– శ్రీపాద**

స్తంభాలపూండి గ్రామంలో ఓ శైవ మతావలంబి అయిన రైతుపై వీర వైష్ణవులు దాడి చేశారు.

"చెప్పు.. ఆ శివుడు కైలాసంలో సోమరసం తాగి పడుకుని ఉంటాడు. చెప్పు... నా దైవం ఆ శ్రీమహావిష్ణువు.. మేం చెప్పమన్నట్లు చెప్పు. కేశవా అను. లేకుంటే ఇప్పుడే ఇక్కడే చంపేస్తాం." అన్నారు

వారి మాటలకు రైతు నవ్వి, "ఆ శ్మశానం వాడే కైలాసనాథుడు. ఆ దేవదేవుని ప్రార్థించు. నీ సమస్యలన్నీ తొలగిపోతాయి.." అన్నాడు చేతులు జోడించి ఆకాశం కేసి చూసి చిన్మయంతో.

ఓ ఆగంతకుడు నెత్తిన ఉన్న కుండను శైవభక్తుని మీద కుమ్మరించాడు. అదే సమయానికి పక్కసందుల నుంచి మరికొందరు ఆగంతకులు అక్కడికి వచ్చేశారు. ఆ రైతుపై పడి అతని ముఖాన ఉన్న విబూదిని తుడిచేశారు. ఇద్దరు అతన్ని పెడరెక్కలు విరిచి పట్టుకోగా ఒకడు అతని ముఖాన సున్నంతో నిలువుగా నామం పెట్టాడు. మరో ఇద్దరు అతని బట్టల నిండా తిరుచూర్ణంతో నామాలు గీశారు.



అతడు "శివా శివా పాహిమాం.. రక్షించు. నన్ను రక్షించు.." అంటూ అరుస్తున్నాడు.

వాళ్లు అతన్ని బరబరా పక్కకు ఈడ్చుకుపోయి ఓ తాడి చెట్టుకు కట్టేశారు. ఒకడు అంటుంటే ముగ్గురు చురకత్తులు తీసి బుగ్గలపై గాట్లు పెట్టారు. బుగ్గల నుంచి రక్తం చివ్వున ఎగసింది.

అతడు కళ్లు మూసుకుని బాధగా 'శివా..' అన్నాడు కాని 'కేశవా' అనలేదు.

ఆ బృందంలో ఒకడు తీవ్రావేశంతో ఖడ్గంలాగి ఆ రైతు మెడపై బలంగా నరికాడు. అతడు కుప్పకూలిపోయాడు.

అటుగా వెళుతున్న ఒకరిద్దరు గ్రామీణులు ఈ గుంపు వద్ద ఏదో జరుగుతోందని సందేహంగా చూస్తున్నారు. అంతలోనే ఆ గుంపు మధ్యగా ఆ శైవ రైతు కిందికి జారిపోయి గిలగిలా కొట్టుకోవడం కనిపించింది. వెంటనే ఆ గ్రామీణులు అక్కడికి పరుగులు పెట్టారు కాని ఆ వీరవైష్ణవ బృందం చురకత్తులు, ఖడ్గాలు చూపుతూ "ఓం కేశవ.. ముకుందా.. మురారీ.." అంటూ అరుచుకుంటూ పరారయ్యారు.

* * *

సత్తెనంపల్లి స్థల.. పలనాడు రాజ్యం.

ఓ పంచాణం వారి చావిడి. సగం సగం పూర్తయ్యి తయారీలో ఉన్న నాగళ్లు, బల్లలు, ఊయల తొట్టెలు, పీటలు, కత్తులు, బండి చక్రాలు.. అన్నింటి మధ్యగా కొలిమి. దానికి ఆవలగా ఊక పెద్ద గుట్టగా పోసి ఉంది. దానిపై ఓ రాతిశిల్పం.. విష్ణుమూర్తి రూపం చెక్కినది.. పెట్టి ఉంది. దాని ముందు కొన్ని పువ్వులు, శిల్పానికి ఓ పూల దండ..

ఓ పదిమంది వైష్ణవులు ఆ ఊక గుట్టకు ముందు.. అంటే శిల్పానికి ముందు కూర్చుని వైష్ణవ గీతాలు ఏవో పాడుతూ భజన చేస్తున్నారు. అప్పుడప్పుడూ తలెత్తి స్వామిని చూస్తున్నారు.

అప్పటికి సమయం రాత్రి మొదటి జాము ముగుస్తోంది.. ఊరు దాదాపుగా నిద్రకు ఉపక్రమించింది. వీధులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి.

భక్తులంతా హరినామస్మరణతో పులకించి పోతున్నారు. అందరూ నుదుటన నామాలు.. భుజాలకు, ఉదరంపై నామాలు, తిరుచూర్ణంతో ఎర్రెర్రని నిలువుబొట్లూ, చెవుల్లో పువ్వులూ.. చేతుల్లో కంచుచిడతలతో ఊరు ఊరంతా గొంతెత్తి విష్ణు గీతాలు పాడుతూ భక్త సముద్రంలో ఓలలాడు తున్నారు.

అదే సమయంలో ఉన్ని కంబళ్లు కప్పుకున్న ఓ బృందం ఆ కర్మాగారాన్ని చుట్టు ముట్టడం గమనించ లేదు.

ఆ ముసుగువీరులు..వీరశైవబృందం.. మౌనంగా ఆ ఊక గుత్తకు నిప్పంటించింది. తర్వాత ఆ విష్ణురూప శిల్పాన్ని ఎత్తి ఆ మంటల్లో పడేశారు. ఒకరిద్దరు భక్తులు అది గుర్తించి అరిచేసరికే కర్మాగారం చావిడి, ఊకగుట్ట భగ్గున మండు తున్నాయి.

ఆ ఆగంతుక బృందంలోని వారు.. "హరహర మహాదేవా.. శంభోశంకరా" అంటూ ఊరంతా వినిపించేలా అరచి పరారయ్యారు. అది వీరశైవ బృందం.. ఇలాంటి బృందాలు రానురానూ నియంత్రణ తప్పుతున్నాయి మహామాత్యా!

మరికాసేపట్లో నిప్పు మొత్తంగా ఆ చావిడిని చుట్టుముట్టి లిప్తలకాలంలోనే పూర్తిగా దహించి వేసింది. అందరూ బయటపడ్డారో ఒకరిద్దరు అగ్నికి ఆహుతయ్యారో.. అనూహ్యం!

* * *

మరికొన్ని రోజుల అనంతరం సత్తెనంపల్లి గ్రామానికి కపర్దిభట్టు నాయకత్వాన ఓ హరిహర బృందం వెళ్లింది. శివకేశవులు ఒక్కరే అనే తత్వాన్ని ఆచరిస్తూ.. సాటివారిలో మత తీవ్రతను తగ్గించడమే ఈ హరిహరతత్వ బృందాల కార్యకలాపం.వీటికి రూపకల్పన చేసిన వాడు తిక్కనామాత్యుడు. బృంద సభ్యులంతా 'విష్ణు రూపాయ నమశ్శివాయ..'అనే వాక్యంతో అందరిని పలుకరిస్తూ..

"శివకేశవా.. దేవదేవా..
హరిహరా.. మహానుభావా..
మము కటాక్షింపుము మహాదేవా.."

అని పాడుకుంటూ గ్రామమంతా.. వెలివాడలు సహా వీధివీధి.. సందూ గొందూ తిరుగాడారు. అనంతరం దేవాలయాల వద్ద కాకుండా గ్రామ సమయ కచేరి వద్ద ఆగారు. అప్పటికే అనేకమంది గ్రామస్తులు కూడా అక్కడికి చేరారు.

# గణపతిదేవుడు




**'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన**

బృందనాయకుడు కపర్దిభట్టు వారిని ఉద్దేశించి మాట్లాడుతూ, 'గ్రామస్తులకు నమస్కారం. మేము మహాకవి తిక్కనామాత్యుల వారి హరిహర తత్వబృంద సభ్యులం. శివకేశవులకు భేదం లేదని.. ఇద్దరూ ఒక్కరేనని మహాకవులు ప్రతిపాదిస్తున్న సిద్ధాంతం. అంటే అహింసా సిద్ధాంతం...అలీన విధానం. మేము శివుని పూజిస్తాము.. విష్ణువునూ కొలుస్తాము. రెండు భక్తి బృందాల ఘర్షణల వల్ల మన రోజువారీ జీవితం ప్రశాంతంగా సాగడంలేదు. వేళకు నాట్లు పడటంలేదు. వృత్తులవారికి దినమూ అడ్డంకులే. ఒకరినొకరు చంపుకోవడం సుతరామూ అంగీకరించం. ఈ భావనలు నచ్చినవారు ఉండొచ్చు... నచ్చనివారు వెళ్లిపోవచ్చు..” అన్నాడు.

ఆ మాటలకు స్పందిస్తున్నట్లు జనులు కాస్త అటూ ఇటూగా కదిలారు. ఒకరినొకరు చూసుకున్నారు కాని ఎవ్వరూ వెళ్లలేదు. రానురానూ మరికొందరు వచ్చి చేరుతున్నారు. నిత్యమూ తమతమ వృత్తులలో పూర్తిగా నిమగ్నమయ్యే రైతులు, ఇతర వృత్తిదారులు ఎక్కువ మంది ఉన్నారు. ఆ బృందంలో మహిళలు కూడా ఉన్నారు. రానురానూ వచ్చి చేరుతున్న గ్రామస్తులలో ఎక్కువమంది జంటలే. అనవసరపు ఉద్రేకాల వల్ల కుటుంబాలలో.. తద్వారా సమాజంలో జరుగుతున్న నష్టాలను మొదట గుర్తించేది మహిళలే.

“నాకు బోలెడు పని ఉంది. రెక్కాడితే కాని డొక్కాడదు. రైతు కూలీని. కానీ నా పనంతా వదులుకుని ఎందుకు వచ్చాను?.. ఈ మారణకాండ చూడలేక. నేను నాకు నచ్చిన దేవుడిని తలచుకుంటాను. ఆయనపై పాటలు పాడుకుంటాను. మరో దేవుడిని తిట్టను. ఆ దేవుడిని పూజించేవాళ్లను ద్వేషించను. దూషించను. ఇదిగో ఈమెను చూడండి. ఈమె భర్త చాకలి. అందరి బాగు కోరే మడేలన్న. గ్రామంలోని వారందరి మురికి కడిగి వేసే రజకుడు. ఆయనను ఓ వీరశైవ బృందం చంపేసింది. అదిగో అవతల కొంగు నోట్లో పెట్టుకుని కుమిలి కుమిలి ఏడుస్తున్న ఆమె కొడుకును మరో బృందం.. అంటే వీర వైష్ణవ బృందం చంపేసింది. ఇపుడు ఈమెకు దిక్కెవరు? ఈమెకు పది మంది పిల్లలు..వాళ్లను ఎవరు చూస్తారు? ఆ పదిమంది అడుక్కు తినాల్సిందేనా..!! తర్వాత వాళ్లు కూడ దొంగలుగా, దోపిడిదారులుగా బ్రతకాల్సిందేనా..? కార్చిచ్చులా వ్యాపిస్తున్న ఈ మత హత్యలను ఆపేదెవ్వరు? ఇక్కడ ఓ చిన్నరైతు.. శివభక్తుడు. ఆయనను గొంతు కోసి చంపేశారు. ఆయనకు ఇద్దరు భార్యలు. మొత్తంగా పాతికమంది పిల్లలు.. ముసలి తల్లిదండ్రులు. అతన్ని చంపేస్తే ఆ కుటుంబం సంగతి ఏమిటి? మనం ఇవన్నీ ఆలోచించాలి. అందుకే మనమంతా శివుడిని, అదే సమయంలో విష్ణువును పూజిద్దాం. అంటే హరిహరదేవుడిని పూజిద్దాం. ఒక్కసారి అందరూ చేతులు జోడించి హరిహరనాథా.. నమోన్నమః.. నమోన్నమః అనండి..”

అందరూ ముక్తకంఠంతో, అలాగే పలికారు పులకిత మనస్సులతో.. భక్తిభావం తొణికిసలాడే కంఠాలతో..

“శివాయ విష్ణురూపాయ శివ రూపాయ విష్ణవే..” అనేది మా ప్రధాన విధానం. ఇకపై మీరంతా కూడా అందరిని.. శైవులను, వైష్ణవులకు కూడా “శివాయ విష్ణురూపాయ శివ రూపాయ విష్ణవే..” అని పలకరించండి. మీ గ్రామంలో లేదా ఈ స్థలలో కూడా హరిహరతత్వ బృందాన్ని ఏర్పాటు చేద్దాం. తద్వారా ఈ మత విద్వేషాలను మీ గ్రామం నుండి తరిమికొట్టవచ్చు. మనకు అందరూ మిత్రులే. శివుడూ మన దేవుడే. కేశవుడూ మనకు ఆపద్బాంధవుడే. మనం శివరాత్రిని, గోకులాష్టమిని ఒకే విధంగా జరుపుకుందాము. విభూతి పూసుకుని దానిపై శ్రీగంధాన్ని అలంకరించుకుందాము.”

ఆ తర్వాత ఆ స్థలలోని మరికొన్ని గ్రామాలలో కూడా పర్యటించి హరిహర తత్వాన్ని వివరిస్తూ.. దీనిద్వారా మత గొడవలు ఉండవని.. మన వృత్తులకు ఆటంకం ఏర్పడదని.. స్త్రీలు, పిల్లలు, వృద్ధులు ప్రశాంతంగా ఉంటారని వివరించాక.. అందుకు సమ్మతించిన రైతులతో అక్కడొక హరిహర బృందాన్ని ఏర్పాటు చేశారు.

అయితే ఈ ఏర్పాటు నచ్చని మహానుభావుడు ఆ దగ్గరలోనే ఉన్నాడు.

* * *

ఓ గృహస్తు నివాసం, సత్తెనంపల్లి స్థల..

అదొక శైవ ఆశ్రమంలాగుంది.

శైవ పాటలతో వీరశైవ నృత్యాలతో ఆ ఆశ్రమ ప్రాంగణం హోరెత్తిపోతోంది. ప్రాంగణం బయట కనిపిస్తున్న ఎడ్ల బళ్లు, గుర్రపు బళ్లు, ఎద్దులు, గుర్రాలు.. అలాగే రకరకాల పల్లకీలను పరిశీలిస్తే లోపల చాలామంది జనం ఉన్నట్లు తెలుస్తోంది.

బయట నుంచి ఆసక్తి ఉన్నవారు ఉరకలెత్తే ఉత్సాహంతో లోపలికి పరుగులు పెడుతుంటే.. ఆసక్తి లేని.. అసలు నచ్చనివారు తలవొంచుకుని చిరాగ్గా దూరంగా వెళ్లిపోతున్నారు.

కపర్ది నాయకత్వాన ఓ హరిహర బృందం ఆ గృహం ముందు కాసేపటి నుంచి నిలిచి ఉంది. లోపలికి వెళ్లేవారిని చూస్తూ.. లోపలి నుండి వినవచ్చే శైవ గీతాలను వింటూ.. మధ్య మధ్య వినవచ్చే ఆ గృహస్తు మాటలు వింటూ అక్కడే ఉన్నారు. వారిని బృందంగా ఎవ్వరూ గుర్తించకుండా అందరూ కాస్త దూరదూరంగా నిలబడ్డారు. కాసేపటికి కపర్ది లోపలికి వెళ్లడానికి సమాయత్తమౌగానే అందరూ ఆయన వెంట లోపలికి వెళ్లారు. లోపలి దృశ్యం చాలా ఉద్రేకంగా ఉంది.

ఆ గృహస్తు ఓ గుర్తింపు ఉన్న కవి.. పేరు నీలకంఠమయ. ప్రస్తుత కాకతీయ సమాజంలోనే కాదు మొత్తం ఎక్కడ తెలుగువారున్నా అక్కడల్లా పండితవర్గాల్లో మంచి పేరున్న సాహితీవేత్త, పండితుడు. అయితే ఆయన తనను తాను వీరశైవకవిగా చెప్పుకుంటాడు. అందరూ అలాగే పిలవాలని కోరుకుంటాడు. అలా పిలిస్తే సంతోషంతో పులకిస్తాడు.

నీలకంఠమయ గృహం అంతలా శైవపాటలతో నృత్యాలతో హోరెత్తిపోవడానికి కారణం ఆయన



మత్తి భానుమూర్తి

ఈరోజే కన్నడ సీమనుండి తిరిగివచ్చాడు. అక్కడ వీరశైవ ప్రబోధకుడు బసవణ్ణ తిరుగాడిన ప్రదేశాలను సందర్శించి ఆయన ఉద్రేకాన్ని, ఉద్వేగాన్ని మరింత పదిలంగా.. మనసులోనే కాదు ఒడలెల్ల రాసుకున్నట్లు వీరశైవ భావనలతో ఊగిపోతూ అనేకానేక కొత్త పాటలను భక్తి గీతాలను మనస్సులోనే అల్లుకుంటూ పాడుకుంటూ ఆ పారవశ్యంతో గంతులతో నాట్యాలతో పరవశిస్తూ ఈ రోజే గ్రామానికి తిరిగి వచ్చాడు. వెనువెంటనే ఆయన అనుయాయులైన వీరశైవులందరూ అక్కడికి చేరారు. ఆయన గొంతెత్తి పాడుతున్న కొత్త పాటలు వింటూ శిష్యులంతా పరవశించి పోతున్నారు.

**“శివ యను.. శివ యను.. శివా యను।**
**శివా యనకపోతే.. పరమశివుని యానా॥**
**నిను భజించనివాడు పరమ మూర్ఖుడు।**
**నిను కొలువని వాని నేనొదల.. నేనొదల।**
**నిను కొలువమని కైలసంబు కంపెద॥”**

పాటకు రూపకల్పన చేస్తూనే రాగం కూడా కూరుస్తూ తన్మయత్వంతో పాడుతున్నాడు నీలకంఠమయ. భక్తులంతా అరమోడ్పు కన్నులతో ఆయనతో గొంతు కలుపుతూ.. కాలు కదిపి నర్తిస్తూ.. వీరావేశంతో ఊగిపోతున్నారు.

అప్పుడే హరిహర బృందనాయకుడు కపర్దిభట్టు ఆయన బృందం నిశ్శబ్దంగా లోపలికి ప్రవేశించింది.

తీవ్ర ఉద్వేగంతో ఊగిపోతున్న వీరశైవులు కొందరు.. ఈ హరిహర బృందాన్ని గుర్తించారు. .

“ఎవర్రా.. మీరంతా??” అని ఒకడు తీవ్రకంఠంతో గర్జించాడు.

అది విన్న హరిహరబృంద సభ్యుల చేతులు నడబంధంలోని చురకత్తిని ఓసారి తడిమాయి. అన్నిటికి సిద్ధమై ఉన్నారు వారంతా.

“మహాకవులను కలవాలని వచ్చాం. శ్రీశ్రీశ్రీ నీలకంఠమయ వారికి ప్రణామములు..” అంటూనే ఆయన పాదాలపై వ్రాలి నమస్కరించాడు కపర్ది.

ఆ చర్యతో ఆ మందిరమంతా నిశ్శబ్దమై పోయింది. కవి ముఖంలో ఉద్రేక తీవ్రత తగ్గి తనకు నమస్కరించిన వారి పట్ల ప్రసన్నత ఏర్పడింది.

“ఎవరు మీరు?? శైవుల్లా లేరే.. వేరే బొట్లు.. తిరుచూర్ణం..?? కొంపదీసి వైష్ణవులా??” అన్నాడు.

అంతే. ఆ మందిరమంతా ఒక్కసారిగా అరుపులతో కేకలతో మార్మోగి పోయింది.

కపర్దిభట్టు మరింత పెద్ద కంఠంతో “కాదు కాదు. మేము వైష్ణవులం కాదు.. కాదు. అంతా కాస్త సంయమనం పాటిస్తే మా ఆలోచనలు కవిగారికి విన్నవించుకుంటాము..” చెప్పాడు.

కవి సరే అన్నట్లు తల ఊపాడు.

కబర్ది గొంతు సవరించుకుని ఆయన బృందం వైపు తిరిగి అందుండి ఓ మహిళను ముందుకు లాగాడు.

“ఈమె శంఖమ. గోపులప్ప భార్య..” చెప్పాడు..

అంతా ఆశ్చర్యంగా చూశారు. శంఖమ ఎవరో.. గోపులప్ప ఎవరో ఎవరికీ గుర్తు రాలేదు. నీలకంఠ మయ కూడా ఆశ్చర్యంగా చూశాడు.

అప్పుడు చెప్పాడు కపర్ది. “ఈమె ఎవ్వరో మీకు తెలుసు కవివరేణ్యా! ఈమె మీరు.. అంటే మీ వీరశైవులు హత్యచేసిన గోపులప్ప భార్య. ఈమెకు అత్తమామలు, ఇద్దరు తలచెడిన ఆడపడచులు, ఇద్దరు సవతులు, పదిమంది పిల్లలు ఉన్నారు. ఈమె భర్తను మీ వీరశైవశిష్యులు.. వైష్ణవుడు అనే అభిప్రాయంతో చంపివేశారు. మరి ఇప్పుడు ఈ కుటుంబం పరిస్థితి ఏవిటి??” అని అడిగాడు.

“ఒక మహాకవిగా మీరు శివ మహాదేవుడ్ని కొలుస్తారు. ప్రార్థిస్తారు. అందుకు మాకేమీ అభ్యంతరం లేదు. కానీ శైవుడు కాని వాడిని చంపేస్తామని.. శివుడు ఒక్కడే దేవుడని.. ఆయనను పూజించని వాళ్లను పొడిచేస్తాం.. నరికేస్తాం.. అనడం ఎంతవరకు న్యాయం??” అన్నాడు.

తిరిగి మందిరమంతా ఉద్రేకం నెలకొంది.

ఒక భక్తుడు అతివేగంగా నడుము నుంచి చురకత్తి తీస్తూ కపర్ది పైకి దూసుకువచ్చి అతని పీకకు కత్తి ఆనించాడు. అంతే..!హరిహరబృందమంతా కూడా వేగంగా చురకత్తులు తీసి ఆతన్ని చుట్టు ముట్టింది. వీరశైవులు కూడా అంతే వేగంగా హరిహర బృందాన్ని కత్తులతో చుట్టుముట్టారు.

“ఆగండాగండి..” అంటూ నీలకంఠమయ అరిచాడు.

“మహాకవులయిన మీరు నలుగురి మంచి కోరాలి. సమాజపు హితం కోసం పాటలు రాయాలి. మీరు కొలిచే దేవుడిని ప్రార్థించమని చెప్పవచ్చు కాని కేవలం శివుడిని మాత్రమే కొలవాలనడం, ఇతర దేవుళ్లను పూజిస్తే చంపేస్తాం అంటే ఎలా మహాకవి? సమాజ హితాన్ని కోరాల్సిన మీరే మీ బాధ్యతను మీ శైవవాదంతో ప్రక్కదారి పట్టిస్తున్నారు అని నేనంటాను.. మీరేమంటారు..?!” అని గట్టిగా ప్రశ్నించాడు.

వీరశైవులు మళ్లీ అరిచారు.

“మహాకవులనే అనే ధైర్యం ఎక్కడి నుంచి వచ్చిందిరా నీకు? ఇక్కడికిక్కడే.. ఇపుడిప్పుడే నిన్ను ఆ మహారుద్రునికి బలికావిస్తాను.. ఎవడేఅడ్డు వస్తాడో రండి..” అని ఒకడన్నాడు.

అప్పుడే కపర్ది వీర శైవులలోని ఒకతన్ని పట్టి చూపాడు.

“వేరే ఎవరో వద్దు. ఇదిగో ఇతడు మీ పాటలకు, మీ ప్రవచనాలకు ఉత్తేజితమై నాలుకను ఆ శివునికి సమర్పించుకున్నాడు. ఇతడొక చాకలి. ఇంటింటికీ తిరిగి బట్టలు సేకరించి ఉతికి ఇస్తాడు. ఇప్పుడు మాట్లాడలేడు. దాంతో ఈయన వృత్తి బాగా దెబ్బతిన్నది. ఇతని కుటుంబం పరిస్థితి ఏవిటి కవివర్యా?.. ఎవరైనా అతని కుటుంబానికి సహాయం చేస్తున్నారా? అదుగో అతడు కాలు సమర్పించు కున్నాడు. ఇక్కడే మీ పాటలతో ఉత్తేజితులై ఎందరో తమ ప్రాణాలను ఆ శివుని అర్పించు కున్నారు. శ్రీశైలం వెళ్లి ఆ కొండ మీది నుంచి దూకి అత్మా ర్పణం చేసుకున్నారు. ఆ యా భక్తుల కుటుంబాల పరిస్థితి ఏవిటి.. చెప్పండి.. మీరేన్నడైనా వారి కుటుంబాల గురించి ఆలోచన చేశారా..??”

“వేరే ఎవరో వద్దు. ఇదిగో ఇతడు మీ పాటలకు, మీ ప్రవచనాలకు ఉత్తేజితమై నాలుకను ఆ శివునికి సమర్పించుకున్నాడు. ఇతడొక చాకలి. ఇంటింటికీ తిరిగి బట్టలు సేకరించి ఉతికి ఇస్తాడు. ఇప్పుడు మాట్లాడలేడు. దాంతో ఈయన వృత్తి బాగా దెబ్బతిన్నది. ఇతని కుటుంబం పరిస్థితి ఏవిటి కవివర్యా?.. ఎవరైనా అతని కుటుంబానికి సహాయం చేస్తున్నారా? అదుగో అతడు కాలు సమర్పించు కున్నాడు. ఇక్కడే మీ పాటలతో ఉత్తేజితులై ఎందరో తమ ప్రాణాలను ఆ శివుని అర్పించు కున్నారు. శ్రీశైలం వెళ్లి ఆ కొండ మీది నుంచి దూకి అత్మా ర్పణం చేసుకున్నారు. ఆ యా భక్తుల కుటుంబాల పరిస్థితి ఏవిటి.. చెప్పండి.. మీరేన్నడైనా వారి కుటుంబాల గురించి ఆలోచన చేశారా..??”

ఆయన మాట్లాడలేదు. ఎవరో మాట్లాడబోతే ఆయన చేయెత్తి వారించాడు.

అప్పుడే కపర్ది కదిలి వేగంగా చురుగ్గా వెళ్లి నీలకంఠమయ కంఠానికి చురకత్తి ఆనించాడు.

“ఈ వీరశైవులు ఇంతలా చెలరేగిపోవడానికి నీలాంటి కవులే కారణం. అందుకే నిన్ను ఆ శివునికి బలి ఇస్తే ఈ చుట్టుపక్కల నీ వల్ల జరిగే హత్యలు ఆగిపోతాయి.. ఏమంటావు మహాకవీ??”

వీరశైవులంతా ఒక్క ఉదుటన కపర్ది మీదికి దూకారు.

నీలకంఠమయ ఓ చేయి ఎత్తి కపర్దిని చుట్టు ముట్టిన వీరశైవులను ఆపాడు. రెండు చేతులు జోడించి కపర్దికి నమస్కరించాడు.

* * *

తెలుగుచోడ రాజ్యం, సింహపురి పట్టణం.. పెన్నానదీతీరం.

పెన్నమ్మ ఏవో గాలిపాటల రాగాలు తీస్తూ హుందాగా.. మృదువుగా సాగిపోతోంది.

పెన్నమ్మకు దగ్గరగా మహాకవి తిక్కనామాత్యుని పండితారామం. పొందికైన ఉద్యానవనంలా ఉన్న ప్రాంగణంలో వివిధ ఫల పుష్పజాతి వృక్షాలు, చెట్లు,

తీగెల మధ్యగా దాదాపు పది భవంతులు. రాజనగరిలా అలరారుతున్న ఓ బ్రాహ్మణ అగ్రహారం అది. ఓ భవంతిలో కవులు, పండితులు సాహితీ సేద్యం చేస్తుండగా.. మరో భవంతి ముందు రైతులు ఎడ్లబళ్ల నుంచి పెరిక బస్తాలు దింపి కోష్ఠాగారంలోకి చేర్చుతుండగా.. మూలగా ఉన్న మరో భవంతి వద్ద కొందరు పెన్న రేవు నుంచి కావిళ్లతో తెచ్చిన నీళ్లు పెద్ద పెద్ద కంచు, ఇత్తడి, మట్టి గుండిగల్లో పోసి మళ్లీ నదివైపు పోతున్నారు కబుర్లు చెప్పుకుంటూ. ఆవలగా అనేక మంది స్త్రీలు దంపుడు పాటలు పాడుతూ వడ్లు దంచుతుండగా మరి కొందరు.. పేడ, మట్టి కలిపి ఇంటిలోపలి నేలకు లోపలా బయటా గోడలకు అలుకుతున్నారు. అలికిన తడినేలపైనా, గోడలపైనా మరి కొందరు ముగ్గుతో రంగవల్లులు దిద్దుతున్నారు.

అందరి వెనగ్గా వంట భవంతి నుండి పైకి లేచిన పొగ ఆవలగా కనిపిస్తోన్న పెన్నమ్మ తోయ మాలికలను పలుకరిస్తోంది. ఆ రెండు, మూడు మందిరాలలో స్త్రీలు చేస్తున్న వంటింటి పనిపాటలను పర్యవేక్షిస్తోంది జానమాంబ, తిక్కనామాత్యుని ధర్మపత్ని. ఆమె ఎక్కడున్నా ఎదురు భవంతి మొదటి అంతర్వులో తిరుగాడుతూ కనిపిస్తున్న భర్త చూపులతో చూపు కలుపుతూనే ఉంటుంది.

మొత్తం ప్రాంగణంలో జరుగుతున్న ప్రతి చర్యను తన సాహితీభవనం మొదటి అంతర్వునుండి నాలుగుమూలలా తిరుగుతూ పర్యవేక్షిస్తూ.. లోలోన ఆంధ్ర మహాభారత రచన రాత్రి ఎక్కడ ఆపామో.. ఆ తర్వాత ఏమి రాయాలో ఆ పద్యాలను చందోబద్ధంగా అమర్చుకుంటూ కూడా ఆయన భార్య చూపులతో చూపు కలుపుతూనే ఉన్నాడు.

పేరుకు తిక్కనామాత్యుడు పండితుడు. విక్రమసింహపురి రాజ్యానికి మహా ప్రధానిగా అందరికి తెలిసినా ఆయనకు ఓ పూర్తి మండలేశ్వరు నిస్థాయి వ్యవస్థ ఉంది. పటిష్టమైన శిష్య ప్రశిష్యుల బృందం, ఏ రాజ్యంతోనూ ప్రత్యేక సంబంధం లేకుండా.. మొత్తం తెలుగు రాజ్యాలలోని గ్రామ సమయశెట్టిలలో, వణిజులలో ఆయన అనుయాయు లున్నారు. ప్రస్తుతం తెలుగు భాషావాదుల బృందం కూడా పటిష్టంగా ఆయన వెంట ఉంది. ఏ రాజ్యానికి వెళ్లినా అపూర్వమైన రాజ గౌరవాలే కాక అతి సామాన్యులు కూడా ఆయనను అమితంగా ఆరాధిస్తారు. ఆయన సాహిత్యం తెలియని వారు కూడా ఆయనను ప్రేమిస్తారు. అందుకు కారణం ఆయన పండితుల్లో పండితుడు.. సామాన్యుల్లో సామాన్యుడు. మహారాజులకు ఆయనంటే ఎంత గౌరవమో సాధారణ గ్రామీణుడు కూడా తిక్కనా మాత్యుడు అనే పేరు చెవిన పడగానే వినమ్రంగా వంగి నమస్కరిస్తాడు.

కేతన వేంగీ రాజ్యంలోని వెంటిరాల గ్రామవాసి. తాతల నాటి నుంచి అగ్రహారీకులు, ఉపాధ్యాయులు. కేతన ఇటీవల వెంటిరాల అగ్రహారంలోని గురు కులాన్ని ఘటికగా పునర్నిర్మించాడు. తెలుగురాజ్యాల్లో తొలి ఘటికల్లో ఇది ఒకటి కావడంతో మూలఘటిక అని.. కేతనను మూలఘటిక కేతన.. అని సంబోధిస్తారు పండితలోకంలో తిక్కనకు ఆంతరంగిక శిష్యుడిగా పేరుపడిన ఆయన...తిక్కన ఆదేశంపై ఇటీవల కుటుంబంతో సహా ఆయనతో నెల్లూరులోనే ఉంటున్నాడు.

నిజానికి ఆయన అజాతశత్రువు. పండితోత్తముడు. కయ్యానికి కాలు దువ్వితే, 'సరే.. అయితే నేనూ సిద్ధం' అంటాడు కానీ వెనక్కు తగ్గడు. ఇప్పుడు ఆయనకు పాలకుడు తిక్క భూపాలుడైతే.. అత్యంత నమ్మకస్తుడైన శిష్యుడు కాకతీయ గణపతిదేవుడు. తిక్కభూపాలుడు స్థానిక రాజ్యపాలకుడే కానీ కాకతీయరాజ్య మహామండలేశ్వరుడు గణపతిదేవుడు మొత్తం తెలుగుజాతి సమ్రాట్టు అని ఆయన భావన. ఏ విపత్కర పరిస్థితి వచ్చినా గణపతిదేవుడే దిక్కు అని ఆయన గట్టిగా నమ్ముతాడు.

తిక్కన తన కార్యకలాపాల నిమిత్తం ఓ గూఢచార బృందాన్ని నియమించుకున్నాడు. ఆ బృందం మొత్తం తెలుగురాజ్యాలన్నీ తిరుగుతుంటుంది. ఈ అంచున నెల్లూరు ఉంటే ఆ అంచున అనుమకొండ ఉంది. అటు వెళ్లి గణపతిదేవునికి.. ఇటు వస్తే తిక్కనకు వాళ్లు సమాచారం చేరవేస్తుంటారు.

గణపతిదేవునికి అనేకానేక కార్యకలాపాలు ఉండొచ్చు కాని తిక్కన గూఢచారులు తెచ్చే సమాచారం ఆయనకు ఆసక్తి మాత్రమే కాదు అవసరం కూడా. ఇద్దరి మధ్య ఉత్తరప్రత్యుత్తరాల కోసమే ప్రత్యేకంగా పదిమంది సమాచార భటు లున్నారు. వాళ్లు చెమటలు కక్కుకుంటూ తిరుగుతూ అంచె పద్ధతిలో ఉత్తరాలను అటూ ఇటూ ఇచ్చి పుచ్చుకుంటారు. గొప్ప గురువుకు, మహావీరుడైన శిష్యునికి ఉన్న మానసిక అనుబంధం..అదే మానవ చరిత్ర తొలిపుట నుంచి లిఖితమైన భారతీయ విద్యా విధానంలోనే కాదు రాజ్యపాలనలో కూడా గొప్ప ప్రభావాన్ని చూపిస్తున్న సంబంధం ఈ గురుశిష్య బంధం.

మరో భవంతి నుంచి బయటకు వచ్చిన శిష్యుడు కేతనభట్టు మెల్లగా మెట్లెక్కి తిక్కనకు దగ్గరగా వచ్చి వినయంగా వంగి పాద నమస్కారం చేసుకుని అక్కడున్న ఆసనంపై కూలబడ్డాడు.

కేతన వేంగీ రాజ్యంలోని వెంటిరాల గ్రామవాసి. తాతల నాటి నుంచి అగ్రహారీకులు, ఉపాధ్యాయులు. కేతన ఇటీవల వెంటిరాల అగ్రహారంలోని గురు కులాన్ని ఘటికగా పునర్నిర్మించాడు. తెలుగురాజ్యాల్లో తొలి ఘటికల్లో ఇది ఒకటి కావడంతో మూలఘటిక అని.. కేతనను మూలఘటిక కేతన.. అని సంబోధిస్తారు. పండితలోకంలో తిక్కనకు ఆంతరంగిక శిష్యుడిగా పేరుపడిన ఆయన...తిక్కన ఆదేశంపై ఇటీవల కుటుంబంతో సహా ఆయనతో నెల్లూరులోనే ఉంటున్నాడు.

"ఏమి.. ఏదో దిగులుగా కనపడుతున్నావ్ కేతనా?" మార్దవంగా పలుకరించింది తిక్కన గాత్రం.

"కరువు.. అని రాజ్యాలన్నీ అల్లల్లాడించి ఆ మహమ్మారి వెళ్లిపోయి, మళ్లీ చెట్లుపుట్టలు చిగురించి మాసాలు కాలేదే.. మళ్లీ వీరశైవ వర్గాలు.. వీరవైష్ణవ వర్గాలు విజృంభించాయని మనవాళ్ల సమాచారం గురుదేవా.." అన్నాడు కేతన.

తెలిసిందన్నట్లుగా తల పంకించాడు తిక్కన.

**(సశేషం)**






# చర్చలు సాధ
# యుద్ధం ము

**అమెరికా-ఇరాన్ యుద్ధం ఆగుతుందా? ఇరు దేశాల మధ్య చర్చలు జరుగుతాయా? అనే ప్రశ్నలకు ఇప్పటి వరకూ సమాధానం లేదు. ప్రస్తుతానికి కాల్పుల విరమణ కొనసాగుతోంది. అమెరికా-ఇరాన్ పైకి భీకర ప్రకటనలు చేస్తున్నా ఈ రెండు దేశాలూ యుద్ధం నుంచి ఎప్పుడెప్పుడు బయటపడాలా అని ఎదురు చూస్తున్నాయి. ఈ క్రమంలో చర్చలకు వచ్చినట్టే వచ్చి, పట్టుదల ప్రదర్శిస్తున్నాయి. శాంతి ఒప్పందం కుదిరేదాకా ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని కొనసాగిస్తామని అమెరికా హెచ్చరిస్తుంటే, ఉపసంహరించే వరకూ చర్చలు జరపబోమని ఇరాన్ తేల్చి చెబుతోంది.**

అమెరికా-ఇరాన్ యుద్ధానికి సంబంధించి తాజాగా రెండో విడత చర్చల కోసం అమెరికా నిర్దిష్ట కాలవ్యవధి లేకుండా గడువును పొడగించింది. ఇరాన్ ఆచితూచి స్పందిస్తోంది. యుద్ధం ముగించటానికి, కాల్పుల విరమణకు అంగీకరించడానికి ముందుకు రాకుంటే ఇరాన్ చమురు పైపులైన్లు పేలిపోతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్‌కు భారీ పరిమాణంలో చమురు సరఫరా వ్యవస్థ ఉందని, ఏదైన కారణం చేత అది మూసుకుపోతే అప్పుడు ఇంధనాన్ని కంటైనర్లు లేదా నౌకల్లో నింపడం సాధ్యం కాదన్నారు. దిగ్బంధనం కేవలం అమెరికా వ్యూహం మాత్రమే కాదని.. ఇరాన్‌ను ఆర్థికంగా దెబ్బతీసే చర్య అని అంటున్నారు. అమెరికాకు ఇరాన్ ధీటుగా బదులిచ్చింది. తమ మౌలిక సదుపాయాలకు ఎలాంటి నష్టం కలిగినా అమెరికాకు మద్దతు ఇచ్చే దేశాలపై నాలుగు రెట్లు ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ ఉపాధ్యక్షుడు ఇస్మాయిల్ సగ్‌హబ్ ఇస్ఫహానీ హెచ్చరించారు. 'మా లెక్కలు వేరు. ఒక చమురు బావి అంటే నాలుగు చమురు బావులు' అని ఆయన తెలిపారు. గల్ఫ్ దేశాల్లో అమెరికా స్థావరాలు, ఆస్తులపై ప్రతీకార దాడులు తీవ్రంగా ఉంటాయని స్పష్టం చేశారు.

అమెరికా అధ్యక్షుని బెదిరింపులకు ఓ కారణం ఉంది. అమెరికా ఆంక్షలు, దిగ్బంధనంతో ఇరాన్ చమురు ఎగుమతులు ఆగిపోయాయి. ఇప్పటికే కీలకమైన ఖర్గ్ ద్వీపం చమురు నిల్వలతో నిండిపోతోంది. ఉత్పత్తి ఆపితే చమురు బావిలో పీడన సమస్య కారణంగా కింద ఉన్న నీరుపైకి ఉబికి వచ్చి, చమురు శిలల్లోకి చొచ్చుకు పోతుంది. కొంతకాలం తర్వాత మళ్లీ తవ్వడం ప్రారంభిస్తే నీరే వస్తుంది. ఇవన్నీ చమురు బావుల జీవితకాల ఉత్పాదకతపై ప్రభావం చూపిస్తాయి. కొన్ని అయితే పూర్తిగా వినియోగానికి రాకుండా పోవచ్చు. కొన్ని రోజుల్లోనే ఖర్గ్ ద్వీపంలోని చమురు స్టోరేజీ ట్యాంకులు నిండిపోతాయి. కీలకమైన ఇరాన్ చమురు బావులు మూతపడక తప్పదు. దీంతో ఆ దేశ ప్రధాన ఆదాయానికి గండి పడనుంది' అని ఇటీవల యూఎస్ ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ హెచ్చరించారు

**అమెరికాకు నష్టం పెద్దదే**

యుద్ధంలో ఇరాన్‌ను సైనికంగా తీవ్రంగా నష్టపరిచామని, ఒప్పందానికి రావాల్సిన పరిస్థితి కల్పించామని అమెరికా చెప్తోంది. కానీ వాస్తంగా ఇరాన్ కూడా అమెరికాను గట్టిగా దెబ్బ తీసినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. అమెరికా-ఇజ్రాయెల్ కలిసి ఇరాన్ మీద ఫిబ్రవరి 28న దాడులు ప్రారంభించిన తర్వాత ఆ దేశం గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. కమాండ్ సెంటర్లు, నిల్వ కేంద్రాలు, విమానాలు ఉంచే ప్రాంతాలు, రన్‌వేలు, రాడార్ వ్యవస్థలపై దాడులు చేసింది. అమెరికా దగ్గర అధునాతన గగనతల రక్షణ వ్యవస్థలున్నా.. ఇరాన్ తన పాత ఎఫ్-5 యుద్ధ విమానయానాలతో ఈ దాడులు చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ యుద్ధంలో జరిగిన నష్టాలను అమెరికా బయటకు చెప్పడం లేదు. యుద్ధం ప్రారంభమైన తొలి వారంలోనే అమెరికా 11 బిలియన్ డాలర్ల మేర ఖర్చు పెట్టింది. యుద్ధం ప్రారంభంలో 1.5 ట్రిలియన్ డాలర్ల బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఆ మొత్తం క్రితం ఏడాదితో పోలిస్తే 50 శాతం ఎక్కువ కావడం గమనార్హం. యుద్ధాన్ని కొనసాగించడానికి పెట్టే ఖర్చుతోపాటు దెబ్బతిన్న వాటిని బాగు చేయడానికి కొన్ని బిలియన్ల డాలర్ల మేర అవసరం కానుంది. మరోవైపు యుద్ధం నేపథ్యంలో 200 బిలియన్ డాలర్లకు పైగా నిధులు ఇవ్వాలని అమెరికా కాంగ్రెస్‌ను పెంటగాన్ కోరినట్లు ఇప్పటికే వార్తలు వచ్చాయి. యుద్ధంలో జరిగిన నష్టాల విషయంలో డొనాల్డ్ ట్రంప్ పాలనా యంత్రాంగం పారదర్శకంగా లేకపోవడంపై కొందరు సొంత రిపబ్లికన్ పార్టీ నేతలే ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వివరాలు అడిగినా చెప్పడం లేదంటున్నారు.

**ఇరాన్ లొంగక తప్పదా?**

కాగా అమెరికాతో యుద్ధాన్ని ముగించేందుకు, హోర్మూజ్ జలసంధిని తెరిచేందుకు ఇరాన్ కొత్త ప్రతిపాదనలు అందించింది అంటూ అమెరికా మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఈ ప్రతిపాదనలను మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న పాకిస్థానీ అధికారుల ద్వారా అమెరికాకు ఇరాన్ చేరవేసింది. వివాదాస్పద అణు చర్చలను తదుపరి దశకు వాయిదా వేస్తున్నట్లు ఆ ప్రతి పాదనలో పేర్కొంది. చర్చలకు సిద్ధమైతే అయితే ఇరాన్ ఎప్పుడైనా తమకు సందేశాన్ని పంపొచ్చని ఇటీవలే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ఎట్టి పరిస్థితుల్లోనూ అణ్వాయుధాలు పొందే అవకాశాన్ని ఇరాన్‌కు ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో యుద్ధాన్ని ముగించేందుకు ఇరాన్ పంపిన కొత్త ప్రతిపాదనలు ప్రాధాన్యత ఏర్పడింది. ఆ ప్రతిపాదన వైట్‌హౌస్‌కు అందింది. కానీ దీనిని పరిశీలించడానికి సుముఖంగా ఉందో లేదో స్పష్టం

**అమెరికాతో చర్చల విషయంలో ఇరాన్ నాయ కత్వంలో విభేదాలు వచ్చినట్లు ఇప్పటికే బయట పడింది. చర్చల్లో సరళతర వైఖరిని అవలంబించాలని పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాఘెర్ ఘాలిబాఫ్, ఇతరత్రా మితవాద నేతలు ప్రతిపాదించగా దీనికి అతివాద ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ చీఫ్ అహ్మద్ వాహిది, ఆయన ఆంతరంగిక బృందం పదేపదే అడ్డుకున్నారని బయటపడింది.**



# ్యమా..
# గుస్తుందా?

కాలేదు.

ఇరాన్ కనీసం ఒక దశాబ్దం పాటు యురేనియం శుద్ధిని నిలిపివేయాలని, ప్రస్తుతం ఉన్న నిల్వలను దేశం నుండి తరలించాలని అమెరికా ప్రధాన డిమాండ్. ఈ డిమాండ్లకు ఎలా స్పందించాలనే దానిపై ఇరాన్ నాయకత్వంలో ఏకాభి ప్రాయం లేదని ఇరాన్ విదేశాంగ మంత్రి, ప్రధాన సంధానకర్త అబ్బాస్ అరఘ్చి చెప్పారు. పాకిస్థానీ మధ్యవర్తుల ద్వారా తెలియజేసిన రెండు దశల ప్రణాళికలో మొదట హార్మూజ్ జలసంధిపై సంక్షోభాన్ని పరిష్క రించడం, అమెరికా దిగ్బం ధనాన్ని ముగించడంపై ప్రాధాన్యత ఇస్తుంది. కొత్త ప్రతిపాదన ప్రకారం, కాల్పుల విరమణను సుదీర్ఘ కాలం పాటు పొడిగించడమో లేదా యుద్ధానికి శాశ్వత ముగింపు పలకడమో చేయాలి. జలసంధిని తిరిగి తెరిచి, దిగ్బంధనాన్ని ఎత్తివేసిన తర్వాత, తదుపరి దశలో మాత్రమే అణు చర్చలు ప్రారంభించాలి.

**మొజ్తబా ఎలా ఉన్నారో?**

అమెరికాతో చర్చల విషయంలో ఇరాన్ నాయ కత్వంలో విభేదాలు వచ్చినట్లు ఇప్పటికే బయట పడింది. చర్చల్లో సరళతర వైఖరిని అవలంబించాలని పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాఘెర్ ఘాలిబాఫ్, ఇతరత్రా మితవాద నేతలు ప్రతిపాదించగా దీనికి అతివాద ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ చీఫ్ అహ్మద్ వాహిది, ఆయన ఆంతరంగిక బృందం పదేపదే అడ్డుకున్నారని బయటపడింది. అమెరికాతో చర్చలు, యుద్ధం పట్ల తీవ్రమైన, రాజీపడని వైఖరిని ఇరాన్ ప్రతినిధులు ప్రదర్శించేలా చేయడంలో అహ్మద్ వాహిది సఫలమయ్యారు. అమెరికాతో మళ్లీ సైనిక ఘర్షణకు దిగేందుకే ఐఆర్జీసీ మొగ్గు చూపుతోంది.

ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ చుట్టూ అనేక అనుమానాలు, చర్చలు కొనసాగుతున్నాయి. అమెరికా దాడిలో చనిపోయిన తన తండ్రి అలీ ఖమేనీ స్థానంలో మొజ్తబా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రజల ముందు పెద్దగా కనిపించలేదు. ఇప్పటివరకు ఎలాంటి ప్రత్యక్ష వీడియో సందేశం, ఆడియో ప్రసంగం విడుదల కాలేదు. మొజ్తబా అధికారిక ప్రకటనలు సోషల్ మీడియా పోస్టుల రూపంలో లేదా ప్రభుత్వ టెలివిజన్ ద్వారా మాత్రమే ప్రకటిస్తున్నారు. సుప్రీం లీడర్‌ను ప్రత్యక్షంగా కలవడానికి కూడా ఉన్నతాధికారులు వెనుకడుగు వేస్తున్నారు. అమెరికా ఆయన స్థావరం తెలుసుకొని దాడి చేసే ప్రమాదం ఉందనే అనుమానంతో అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మొజ్తబా ఖమేనీకి చేరవలసిన సందేశాలు చేతిరాతలో రాసి, మూసి వేసిన కవర్లలో నమ్మదగ్గ వ్యక్తుల ద్వారా పంపిస్తు న్నారు. తిరిగి అదే మార్గంలో ఆయన ప్రతిస్పందన బయటకు వస్తోంది. అమెరికా దాడుల్లో మొజ్తబా ఖమేనీ తీవ్రంగా గాయపడ్డారని, పలుసార్లు శస్త్ర చికిత్స చేయించుకున్నారని చెబుతున్నారు. ఆయన ముఖం, పెదవులపై కూడా గాయాలు కావడంతో మాట్లాడటంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. అయినప్పటికీ, మానసికంగా చురుకుగా ఉండి పాలనలో పాల్గొంటున్నారని చెబుతున్నారు.

**పాకిస్థాన్ మధ్యవర్తిత్వంపై అనుమానం**

అసలు పాకిస్థాన్‌ను నమ్మొచ్చా? అమెరికాతో రెండో విడత చర్చల అనిశ్చిత నేపథ్యంలో ఇరాన్ అనుమానం ఇది. అమెరికా ప్రయోజనాలకు అను గుణంగానే పాకిస్థాన్ నాయకులు ప్రవర్తిస్తున్నారని ఇరాన్ భావిస్తోంది.మధ్యవర్తులు నిష్పక్షపాతంగా ఉండాలే కానీ, ఒకరివైపు ఉండటం సరికాదని అంటున్నారు. చర్చల విషయంలో ఇప్పటివరకు వారి చర్యలు చూస్తే వారు నిష్పక్షపాతంగా వ్యవహ రించగలరా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పాకిస్థాన్ తమకు మంచి మిత్ర దేశమేనని, కానీ చర్చలకు సరైన మధ్యవర్తి కాదని ఇరాన్ ఎంపీ, జాతీయ భద్రత విదేశాంగ విధాన కమిషన్ అధికార ప్రతినిధి ఇబ్రహీం రెజాయీ అన్నారు. పాకిస్థాన్ తటస్థ వైఖరితో సమర్థవంతంగా వ్యవహరించ గలదా? అని ఆయన ప్రశ్నిస్తున్నారు. లెబనాన్ విషయంలోనూ అమెరికా అంగీకరించలేని విధంగా డిమాండ్లను తెరపైకి తీసుకొచ్చిందని, ఆ సమయంలో పాక్ నేతలు ఎవరూ అడ్డు చెప్పలేదని గుర్తు చేశారు. పాకిస్థాన్ సరైన మధ్యవర్తి కాదని, ఇస్లామాబాద్‌లో దౌత్యానికి అనుకూల పరిస్థితులు లేవని అన్నారు. పాకిస్థాన్ తమకు మంచి మిత్ర దేశమేనని, కానీ చర్చలకు సరైన మధ్యవర్తి కాదని రెజాయి వ్యాఖ్యానించారు. ఇరాన్, అమెరికా మధ్య అనిశ్చితి ఉన్నప్పటికీ చర్చలను సజీవంగా ఉంచడానికి ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి దౌత్యపరమైన ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్న తరుణంలో రెజాయి ఇలా అనడం చేయడం పాకిస్థాన్‌కు ఊహించని విఘాతమే.

ఇదిలాఉంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, పాక్ సైన్యాధిపతి అసిమ్ మునీర్ స్నేహం అమెరికా నిఘా వర్గాలను ఆందోళన పరుస్తోంది. మునీర్ ఇప్పుడు అమెరికా, ఇరాన్ మధ్య చర్చల్లో మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నాడు. ఆయన ద్వంద్వ సంబంధాలు ఒకవైపు అమెరికాకు ఉపయోగ పడవచ్చు. కానీ వ్యూహాత్మక ప్రమాదాలను కూడా తెచ్చిపెట్టే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చ రిస్తున్నాయి. మునీర్‌కు ఎప్పటి ఇరాన్ సైన్యంలోని ఉన్నత స్థాయి అధికారులతో, ఐఆర్జీసీతో బలమైన సంబంధాలున్నాయని పాక్ మాజీ జనరల్ అహ్మద్ సయీద్ చెబుతున్నారు. ముఖ్యంగా దాని ఖుద్స్ ఫోర్స్ నేత ఖాసీం సులేమానీ, ఐఆర్జీసీ కమాండర్ హొస్సేన్ సలామీతో సంబంధా లున్నట్లు వెల్లడిం చారు. దీంతో ఈ పరిచయాలు అమెరికా విధాన నిర్ణేతల్లో అనుమానాలు రేకెత్తిస్తు న్నాయి. పాకిస్థాన్ మీద అమెరికా విధాన నిర్ణేతల అనుమానాలు కొత్తేమీ కాదు. ఆఫ్ఘనిస్థాన్ యుద్ధ సమయంలో అమెరికా సహాయం పొందుతూ, తాలిబాన్‌కి అనుకూలంగా వ్యవహరించిందని ఆరోపణలు ఉన్నాయి. అమెరికా మీద దాడి చేసి వేలాది మంది ప్రజల ప్రాణాలను తీసుకున్న అల్ ఖైదా చీఫ్ బిల్ లాడెన్ కు కూడా పాకిస్థాన్ ఆశ్రయం ఇచ్చింది. అమెరికా సైన్యం కీలక ఆపరేషన్ నిర్వహించి పాకిస్తాన్ గడ్డ మీదే లాడెన్‌ను మట్టు బెట్టడం తెలిసిందే. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ విశ్వసనీయతపై జాగ్రత్తగా ఉండాలని ఫౌండేషన్ ఫర్ డిఫెన్స్ ఆఫ్ డెమొక్రసీస్ హెచ్చరిస్తోంది.



**క్రాంతిదేవ్ మిత్ర**
సీనియర్ జర్నలిస్ట్

# వ్యక్తిత్వ హననంలో హిందూ సమాజం

**సంచార జీవనంతో భూమండలమంతా విస్తరించి క్రమంగా స్థిరనివాసిగా మారిన మానవుడు ఏ ప్రాంతంలో జీవికను వెదుకున్నా, కొద్ది తేడాలతో విశ్వమంతటా ఒకే తరహా అభిమతాన్ని అవలంబించా డనిపిస్తుంది. అదే మొత్తం మానవజాతికి వ్యక్తిత్వమై నిలిచింది. దాన్నే నిత్య నూతనము, సనాతనము అయిన ధర్మమన్నారు. అంటే సనాతనధర్మమే మొత్తం మానవాళికి వ్యక్తిత్వమై నిలిచింది యుగాల పర్యంతము. ఎడారి మతాలవారు ఎంతగా ధ్వంసం చేసినా గానీ ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా సనాతన ధర్మానికి చెందిన ఆనవాళ్లు త్రవ్వకాల్లో బయటపడడమే దీనికి తార్కాణం.**

రష్యాలోని ఓల్గా(వాలుగ అనే సంస్కృత శబ్దం) నదితీరంలో 7వ శతాబ్దికి చెందిన విష్ణుమూర్తి విగ్రహం, రోమ్‌లో ఏనుగు దంతంతో చేసిన లక్ష్మీదేవి ప్రతిమ, హంగేరిలో శివలింగాలు,వాటికన్‌లో సూర్య చిహ్నం,ఈజిప్ట్‌లో1900 ఏళ్లనాటి బుద్ధవిగ్రహంతో బాటు తెలుగురాజులైన శాతవాహనుల నాణెములు,

హిందీ/సంస్కృత శాసనము, మెక్సికోలో గణేషుడు, నాగ ప్రతిమలు, మధ్యఅమెరికాలో స్వస్తిక్ గుర్తులు, శివలింగాలు, సూర్య ఆరాధన ఆనవాళ్లు, ఈ యేడు జనవరిలో ప్రస్తుత పాక్లో లభించిన 1900 ఏళ్ల నాటి బంగారు నాణెంపై మూడు ముఖాల శివుడు, నంది, త్రిశూలంతో ఉన్న చిత్తరువును బట్టిమొత్తం జగతిలో సనాతనధర్మమే ఉండేదని అర్థమవుతుంది. ఎడారి మతాలవారు ప్రపంచంలో ఎన్నో నాగరికతలను పూర్తిగా తొలగించినా హిందూధర్మాన్ని నాశనం చేయలేకపోయారు. హిందూధర్మపు ఆనవాళ్లను మరెన్నింటిని భూమాత తనలో దాచుకుందో!

ఇంతగొప్ప ధర్మానికి చెందిన మనం హిందువులుగా గర్వంగా తలెత్తుకొని తిరగగలుగుతున్నామా? గీతలో శ్రీ కృష్ణుడు చెప్పినట్టు స్వధర్మాన్ని పాటించక పరధర్మాల వైపు ఎందుకు మొగ్గు చూపుతున్నాము. ఇతర మతాలనువారిని మితిమీరి గౌరవిస్తూ, మనల్ని మనం కించపరచుకోవడం కేవలం హిందువులపై రుద్దబడిన సెక్యులరిజం ప్రభావమా? అలాంటి నీచ స్థితికి ఎందుకు దిగజారాము?

ఐరోపా దేశాల్లో చర్చికి వెళ్లే వారి సంఖ్య తగ్గిపోవడంతో అనేక చర్చిలు గ్రంథాలయాలుగా, సాంస్కృతిక కేంద్రాలుగా మారిపోతున్నాయి. అమెరికాలో 30% మంది క్రైస్తవులుగా చెప్పుకోవడం ఇష్టం లేకుండా యోగా, ధ్యానం, ప్రకృతి ఆరాధన వంటి సనాతనధర్మ పద్ధతులు పాటిస్తున్నారు. ఇక్కడేమో ప్రజల సొమ్మును హిందూ గుళ్లకు కాకుండా చర్చిలు, మసీదుల నిర్మాణాలకు ప్రభుత్వాలు వెచ్చిస్తుంటే హిందువులుగా ఎందుకు ప్రశ్నించడం లేదు?

పైగా కేవలం హిందువుల గుళ్లనే వందేళ్లుగా అన్ని ప్రభుత్వాలు తమ హస్తాల్లో బంధించి కర్కశత్వం చూపెడుతుంటే, సనాతన ధర్మం కరోనా లాంటిదని దాన్ని అంతంచెయ్యాలనే వాళ్లు, దేవుడే లేడనే కమ్యూనిస్టుల ఏలుబడిలో కూడా హిందూగుళ్ల ఆస్తులు దోచుకుంటుంటే, దోచి అన్యులకు పందేరం చేస్తుంటే హిందువులు ఎందుకు మౌనం వహిస్తు న్నారు? ధర్మరక్షణకే కదా దేవుడు అవతారాలు దాల్చడం, ప్రతి దేవీదేవతల చేతుల్లో ఆయుధాలు ఉండడం.

ప్రపంచంలోనే అత్యంత పురాతనమైనదిగా తరాల నుండి అంది వస్తున్న వేదాలలో మొత్తం 1131 శాఖలకు గాను ప్రస్తుతం 11 శాఖలు మాత్రమే లభిస్తున్నాయని వేదపండితుల ఉవాచ. మరి అంతటి జ్ఞానాన్ని, ఆరు నుండి పన్నెండు మాసాల పాటు దహనం చేయబడ్డ నలంద విశ్వవిద్యాలయంలోని పుస్తకాలలో తిరిగి పొందలేని ఎంతో విజ్ఞానాన్ని హిందూ సమాజం ఎందుకు కాపాడుకోలేక పోయింది? ఆ వేదాల్లో ధర్మం గురించిన ప్రస్తావనలు అనేకచోట్ల కనిపిస్తున్నాయి. ఇప్పుడు మనదేశ వేగుసంస్థ రా (RAW) నినాదంగా ఉన్న “ధర్మో రక్షతి రక్షితః” (ధర్మాన్ని కాపాడితే అది మనల్ని కాపాడుతుంది) వంటివాటి గురించి కూలంకషంగా వివరించడం జరిగింది.ధర్మం అర్థం విశాలమైనది. “సర్వేజనా సుఖినోభవంతు” అని సర్వ మానవాళి బాగుకోసం ఎలుగెత్తిన ధర్మం జగతిలో మరొకటి ఉందా?

ప్రాచీన కాలంలో “మత్” (ఆలోచించడం లేదా నమ్మడం) అనే సంస్కృత ధాతువు నుండి ఇప్పటి మతం అనే పదము పుట్టింది.దీనిని అభిప్రాయం, సిద్ధాంతం లాంటి పదాలకు ప్రత్యామ్నాయంగా వాడారు. ఇప్పటికీ ఒక విషయమై స్పర్థ ఏర్పడి చర్చిస్తుంటే ఎవరి మతాన్ని (అభిప్రాయాన్ని) వారు వెల్లడించమని కోరుతుండడం చూస్తుంటాము. మరోలా చెప్పాలంటే ఒక ప్రత్యేకమైన జీవన విధానాన్ని, ఆలోచనాసరళిని అనుసరించడమే ఇప్పటి మతం అనుకోవచ్చు. ధర్మానికి, లాటిన్ పదం” రెలిజియో” (Religio) నుండి పుట్టిన “రిలిజియన్” పదానికి ఎంతో తేడా ఉంది . ధర్మం విశాలమైన




అర్థం కలిగిఉంటే మతం పరిమిత అర్థాన్ని కలిగి ఉంటుంది.

19వ శతాబ్దిలో బ్రిటీషర్లు మొదటిసారిగా విశాల హిందూదేశంలో జన గణన చేసినప్పుడు మతం అనే మాటను విస్తృతంగా వాడారు. అప్పటివరకు ఒక జీవన విధానంగా ఉన్న హిందూధర్మాన్ని హిందూ మతంగా వలసపాలకులు తెరపైకి తెచ్చారు. హిందువులది మతం కాదు ధర్మమేనని సోదాహరణంగా సర్వేపల్లి రాధాకృష్ణ, కొత్త సచ్చిదానంద మూర్తి వంటి ప్రఖ్యాత తత్వవేత్తలు ఎంతగా వివరించినా, హేతుబద్ధత లేని తప్పుడు ఆర్యద్రావిడ సిద్ధాంతం తీసుకొచ్చిన ఎడారిమతాల వారేకాదు హిందువులమని చెప్పుకొనే వారు కూడా వారితో విభేదిస్తుంటారు.

ఇతరులు తమ మతాలను బిలియన్ డాలర్లకొద్దీ ఖర్చుచేస్తూ, అనేక వక్ర మార్గాలను అనుసరిస్తూ ప్రచారం చేసినట్టు హిందూ ధర్మం చేయలేదు. అయినా ముస్లిం, క్రైస్తవ మత ప్రచారకులు కూడా హిందువులుగా మారిన వైనం అబ్బురమనిపిస్తుంది. క్రీస్తుపూర్వం 2వ శతాబ్దికి చెందిన గ్రీకు రాయబారి హెలియో డోరస్ విష్ణు భక్తునిగా, ఇలా బెన్నెట్, డేవిడ్ ఫ్రాలీ,నివేదితగా మారిన ఐర్లండువాసి, వాసీమ్ రిజ్వీ, మౌలి మహమ్మద్ ఆలీ, సన్వర్ హుస్సేన్, సయ్యద్ ఇబ్రహీం ఖాన్ వంటి ఎందరో తమ మతప్రచార వృత్తిని వదిలేసి హిందువులుగా మారారు. వీరు కాకుండా ఆఫ్రికా, ఐరోపా దేశాలకు, అమెరికాకు చెందిన సామాన్యులే కాకుండా అత్యంత ప్రముఖులు కూడా స్వచ్ఛందంగా హిందూధర్మాన్ని ఆచరించడమే




కాకుండా ఆ విషయాన్ని బహిర్గతం చేస్తున్నారు.

ఇంత గొప్పదైన హిందూధర్మంపై ఎలక్ట్రానిక్ మాధ్యమాలు ఊపిర్లు పోసుకొన్నాక అదేపనిగా, అనుచితంగా తీవ్రమైన రీతిలో విరుచుకు పడుతున్నారు. వీరిలో హిందువులపేర్లు పెట్టుకొని హిందువులుగా చలామణి అవుతున్న వారి సంఖ్యకూడా తక్కువ కాదు.

హిందూధర్మంలో ఎక్కువ విషయాలు, రాజుగారి ఏడుగురు కొడుకుల చేపలవేట వంటి కథలు కూడా అన్నీ నర్మగర్భంగా వెల్లడి అయ్యాయి. నిజాయితీగా తరచిచూస్తే నుదుట ఎర్రటి కుంకుమ ధరించడం వంటి చిన్న విషయం నుండి అన్ని విషయాలు హేతుబద్ధంగా, శాస్త్రీయంగా ఉంటాయి. ప్రశ్నించమని, ఏ వైపు నుండైనా జ్ఞానాన్ని పొందమని, గుడ్డిగా దేన్నీ నమ్మవద్దని బోధిస్తుంది హిందూ ధర్మం. శోధించి అసలు విషయాన్ని గుర్తెరగమంటుంది.వ్యక్తి అభిప్రాయాలకు, ఆలోచనలకు గౌరవం ఇస్తుంది. కాబట్టే రామాయణ కాలంలోని జాపాలి వంటి వారిని కూడా "విషవృక్షం" లా చూడక కించపరచడం చేయలేదు. అన్ని రకాల భావాల వ్యక్తులు, సమూహాలు హిందూధర్మంలో కనిపిస్తుంటారు. ఇతర ధర్మాల్లో లేని విభిన్నత్వం (ప్లురలిజం) హిందూ ధర్మంలో ఉంది. వచ్చి తమను ఇబ్బందులకు గురి చేసిన అన్ని తెగలవారికి నీడనిచ్చి అక్కున చేర్చుకుంది. 1979లో వక్రమార్గంలో రాజ్యాంగంలో చొప్పించిన సెక్యులరిజం, సోషలిజం వంటివి హిందూ ధర్మానికి అతకవు. బహుశా అదే ధైర్యంతో 2008లో హిందూ తీవ్రవాదమంటూ ఆ పార్టీ సిగ్గులేకుండా తీవ్ర ఆరోపణలు చేస్తూ కాలం గడుపుతుంటే, శత్రువులు నిర్భయంగా వచ్చి దేశ ఆర్థిక రాజధానితో సహా అనేకచోట్ల దాడులకు తెగబడ్డారు.

ప్రతి హిందువు తన ధర్మాన్ని పాటిస్తూ ఇతరులు తన పరిధిలోకి రాకుండా కట్టడి చేయాలి. ఇదిచేయక ఎడారి మతాల వారి వేషాలు ధరించి విందులు ఇస్తుంటారు. వారి ఆస్తులను కాపాడుతామని వాగ్దానాలు ఇస్తూ మన గుళ్ల ఆస్తులను యథేచ్ఛగా దోచేస్తుంటారు. ఇన్ని దశాబ్దాల్లో ఆ మతనాయకులు ఎవరైనా మన కట్టుబొట్టుతో మన పండుగలకు విందులు ఏర్పాటు చేశారా?

విపరీతమైన జాత్యహంకారం ఉన్నవాళ్లు హిందువులకు గుర్తింపు రాకూడదని హిమాలయాల ఎత్తు లెక్కించిన, రేడియోను అనేక మందులు కనుగొన్న హిందువులను కాదని వారివారికే ఘనతలను ఇచ్చుకొని ప్రచారం చేశారు.

తొలి పాఠశాల బ్రిటన్‌లో ఏర్పాటు అయినప్పటికే విశాల హిందూదేశంలో ఎనిమిది లక్షల విద్యాలయాలు గ్రామ స్థాయిలోకూడా వైభవంగా నడిచేవి. ప్రతి చోటా గుడిమాన్యం, బడిమాన్యం ఇచ్చేవారు. ఇతర మతాల వారు తమ మతవిద్యను ప్రభుత్వ ఖర్చుతో బోధించే బదులు నడుపుకోవచ్చు కానీ హిందువులకు ఆ వీలు కల్పించలేదు.ఆ విషయమై ప్రశ్నించక మార్కుల ర్యాంకులతో పిరికి మనస్తత్వం గల గుమస్తాలను తయారుచేసే విద్యవైపు మన పిల్లల్ని ఎందుకు నెడుతున్నాము?చిన్న సమస్యలకే ఉసురు తీసుకొనే వారి సంఖ్య ఎందుకు పెరుగుతోంది?

తమ ఆర్థిక సామాజిక స్థితి ఎలావున్నా ఎడారి మతాలవారు తమ పిల్లల చేత తమ మతగ్రంథాలను చిన్నప్పటినుండి చదివిస్తారు. హిందువుల్లో అలా తమ పిల్లల్ని పెంచేవారి శాతం బహు తక్కువగా ఎందుకుంటోంది? ఫలితంగా మన ధర్మం విషయాలపై ఏ మాత్రం అవగాహన లేని హిందువుల పిల్లలు ఇతర మతాల ఉచ్చుల్లో సులభంగా పడిపోతున్నారు. దేశంలోని అన్నిప్రాంతాల్లో, గొప్పసంస్థల్లో పనిచేసే ఎడారి మతాలకు చెందిన డాక్టర్లు, ఇంజనీర్లు కూడా ఈ మత మార్పిళ్లకు నిర్లజ్జగా బాహాటంగా పాల్పడుతున్నారు. చిన్న చిన్న ఊళ్లలో కూడా జిహాదీ బృందాలు, ఉగ్రవాద ముఠాలు తయారవుతున్నాయి. బట్టలిప్పి హిందువులుగా నిర్ధారించుకొని కాల్చి చంపుతుంటారు. వాళ్లకు కొన్ని రాజకీయ పక్షాలు కూడా వత్తాసు పలుకుతుండడంతో మరింతగా రెచ్చిపోతున్నారు.ముస్లింలు ఒక రకమైన పద్ధతులు అనుసరిస్తుంటే క్రైస్తవులు మరో పంథా అనుసరిస్తున్నారు.

శ్రీరాముని గుడిని సందర్శించ వెళ్లిన శాసన సభ్యునిపైనే దాడికి పూనుకునే స్థాయికి వెళ్లారు. చర్చిలను గుళ్లలాగా నిర్మించడం, ధ్వజ స్థంభాల్ని ఏర్పాటు చేయడం, గాయత్రి మంత్రం వంటి వాటిని వారి దేవునికి అన్వయిస్తూ పాడడం వీటిలో కొన్ని పోకడలు. ఇన్నీ చేస్తూ తాము హిందువుల్లోని ఎస్సీలమని చెప్పుకుంటూ అసలైన వారి సౌకర్యాలన్నీ తేరగా పొందుతూంటారు. అన్ని విధాలుగా హిందువులను ఇబ్బందులకు గురిచేస్తూ, ఎగతాళి చేస్తూకూడా తమకు ఈదేశంలో మతస్వేచ్ఛలేదంటూ గోల చేస్తుంటారు. వీళ్లకు బయటి దేశాలు వత్తాసు పలుకుతూంటాయి.

సరస్వతీ మందిరాన్ని కూడా ధ్వంసం చేసిన వర్గపు వ్యక్తి అదే శారదను, ద్రౌపదిని నగ్నంగా చిత్రీకరిస్తే, అతడిని పెద్దల సభలో కూర్చోపెట్టిన ఘనసమాజం మనది. సినిమాల్లో మన పురాణాలను వక్రీకరించినా, దేవుళ్లను ఎంతగా కించపరచినా మనం స్పందించం.

ఇదే తరహాలో హిందూ సమాజానికి సెక్యులరిజం పేరుతో దాని ఉనికినే ప్రశ్నించే ప్రమాదకర పరిస్థితులు కొనసాగితే, ఎడారి మతాలవారు రెచ్చిపోతుంటే జగతిలో ఉండే ఏకైక హిందూస్థావరం కూడా అంతమయ్యే రోజులు ఎంతో దూరంలో లేవు. వ్యక్తిత్వం కోల్పోతున్న హిందూసమాజం ఇప్పుడైనా, ఇకనైనా జాగృతి అవుతుందా? మనలోని అంతర్గత శత్రువులతోనే కాదు, హిందూదేశంలోని రకరకాల పేర్లతో చెలామణి అవుతూ, దేశాన్ని ఇస్లాం దేశంగానో, ఏసురాజ్యంగానో మార్చేస్తామనే అంతర్గత శత్రువులతో హిందువులు ఇకనైనా జాగ్రత్త వహిస్తారా?



**గడ్డం దేవీప్రసాద్**
8971830473

# చీడపురుగు చట్టసభల్లోకి

**నేరం, ప్రతీకారం, కులం ఈ మూడింటి కలయికే బిహార్ రాజకీయం. తొట్టతొలి స్వాతంత్ర్య పోరాటంలో కీలక భూమిక పోషించిన బిహార్ తర్వాత కాలంలో నేరమయ రాజకీయాలకు, అరాచక శక్తులకు కేంద్రంగా మారింది. స్వాతంత్ర్యోద్యమ ఆరంభ దశలో బిహార్ నిర్ణాయక పాత్ర పోషించిందంటారు ‘History of the Freedom Movement in Bihar’ పుస్తకం రాసిన కె.కె.దత్తా. తొంభయ్యో దశకం తర్వాత బిహార్ రాజకీయ మైదానం నెత్తురోడిందనే భావన చాలా మందిలో ఉంది. కాని, జేపీ మూవ్‌మెంట్‌గా ప్రసిద్ధి చెందిన ‘బిహార్ ఉద్యమానికి’ ముందే రాజకీయ హింస క్రమంగా సామాజిక హింసగా పరిణమించింది. 1970లో జరిగిన పంచాయితీ ఎన్నికల్లో హతుల సంఖ్య, హంతకుల ప్రాబల్యమే జయాపజయాలను నిర్ణయించాయి.**

తాజాగా పూర్ణియా లోక్‌సభ సభ్యుడు పప్పు యాదవ్ ఉరఫ్ రాజేష్ రంజన్ చేసిన వ్యాఖ్యలు దేశ వ్యాప్తంగా దుమారం రేపాయి. ‘నేతల గదుల్లోకి వెళ్లకుండా 90శాతం మంది మహిళలు రాజకీయాలు చేయలేరు’ అంటూ అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభలో జరిగిన మహిళా రిజర్వేషన్ల చర్చపై స్పందించిన పప్పుయాదవ్ ‘చట్ట సభల్లో మహిళల హుందాతనం గురించి మాట్లాడటం హాస్యాస్పదమంటూ నిర్లక్ష్య ధోరణిలో సమర్థించుకునే ప్రయత్నం చేశారు. మహిళల్ని దేవతలుగా భావించినా.. వారిని ఆ దృష్టితో ఎన్నడూ చూడలేదని, గౌరవించలేదంటూ నీతి వాక్యాలు వల్లించారు. స్త్రీలపై రాబందుల్లా వాలిపోయేది ఎవరో తెలియాలంటే.. నేతల సీసీటీవీఫుటేజీలు చూడాలంటూ ఉచిత సలహా ఇచ్చారు.

దురుసుగా, పరుషంగా మాట్లాడటం పప్పూ యాదవ్‌కు ఇదేమీ కొత్త కాదు. సమీప గతంలో మహా కుంభమేళా సందర్భంగా ‘సంపన్నులు, సన్యాసులు, నేతలు త్రివేణీ సంగమంలో మునిగి, మరణించి ముక్తి పొందాలంటూ వికృత వ్యాఖ్యలు చేశారు. ఈ మధ్య కాలంలో పప్పూ యాదవ్ చేసిన హీనమైన వ్యాఖ్య.. బిహార్ రాజకీయ స్థితికి అద్దం పడుతుంది. పాట్నా నగరంలోని మహిళా హాస్టళ్లలోని యువతులు నేతల వద్దకు వచ్చేవారే అంటూ నోరు పారేసుకున్నారు. కోవిడ్ మహమ్మారి జనం ప్రాణాలు హరిస్తున్నవేళ డజన్లకొద్ది అంబులెన్సులను దాచి పెట్టిన అమానవీయ గతం పప్పూ యాదవ్ సొంతం.

భయాన్ని అమ్ముకునే బేరగాళ్లే బిహార్ ఎన్నికల క్రీడలో విజేతలు. అలాంటి వారిలో పప్పూ యాదవ్ మొదటి వరుసలో ఉంటాడు. బీహార్ ప్రజలకు ఇలాంటి వ్యాఖ్యలు, పరుషమైన మాటలు ఆశ్చర్యాన్ని కలిగించవు. నేర సామ్రాజ్యంలో నుంచి పప్పూ యాదవ్ రాజకీయ రంగప్రవేశం చేశాడు. మేనమామ శిక్షణలో కత్తిదూయడంలో నైపుణ్యం సాధించాడు. అంగబలం, అర్థబలం సమకూరిన తర్వాత...ఎన్నికల గోదాలోకి దూకాడు.

దైనందిన జీవితంలో హింసకు, అప్రజాస్వామిక ధోరణికీ, పరుష పదజాలానికి బీహారీలు అలవాటు పడ్డారు. గొంతు చించుకోని భయం స్వభావంగా మారిపోవడమే విషాదం. ఆర్తనాదం కూడా అత్యంత రహస్యంగా ఉండాలనే తత్వం స్వభావంలో భాగమైపోయింది. అందుకే రాజకీయాల్లో కొత్తదనాన్ని అంత త్వరగా ఆహ్వానించలేకపోయారు. ఉత్తర బిహార్‌లోని కోసీ రీజియన్‌లో పప్పూయాదవ్‌కు తిరుగులేదు. కేవలం చిన్నా చితక హత్యలు, బెదిరింపులు కాదు అంతర్జాతీయ ఆయుధ డీలర్లతో ఉన్న సంబంధాల కారణంగా బిహార్ ముఖ్యమంత్రులు, నేతలు, సంపన్న పారి శ్రామిక వేత్తలు పప్పూ యాదవ్ పేరెత్తితే నిలువునా వణికిపోతారు.

పశ్చిమ బెంగాల్‌లోని పురులియాలో ఆయుధాలు జారవిడిచిన కేసు దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. డెన్‌మార్క్‌కు చెందిన కిమ్ డేవీ 1995, డిసెంబర్ 17న Antonov An-26 విమా నంలో వచ్చి అత్యాధునిక ఆయుధాలు పురులియా అటవీ ప్రాంతంలో జారవిడిచారు. పశ్చిమ బెంగాల్ లోని కమ్యూనిస్టు ప్రభుత్వం నుంచి ఆనంద్ మార్గ్ అనుసరించేవారిని రక్షించడానికి ఆయుధాలు తరలించినట్టు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఇందులో పి.వి.నరసింహారావు ప్రభుత్వం పాత్ర ఉన్నట్టు ఆరోపణలు వినిపించాయి. ఈ కేసులో పప్పూ యాదవ్ దోషిగా ఉన్నాడు. కిమ్ డేవీని క్షేమంగా దేశం దాటించే బాధ్యతను నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పప్పూ యాదవ్ కు అప్పగించినట్టూ...కిమ్ డేవీ తన ఆత్మకథ ‘They call me Terrorist’లో రాసుకున్నాడు.

పప్పూ యాదవ్, మహమ్మద్ షాహబుద్దీన్ లాంటి నేర ప్రవృత్తిగల నేతలు బిహార్ రాజకీయాల్లోకి రావడానికి ఒక నేపథ్యం ఉంది. రెండు కీలక పరిణామాలు బిహార్ రాజకీయాలను గుణాత్మకంగా మార్చేశాయి. లాలూప్రసాద్‌యాదవ్ రాజకీయ ఉత్థానం సైతం ఇదే సమయంలో మొదలైంది.



పప్పూ యాదవ్

1. ఎనభయ్యో దశకం తర్వాత బిహార్ రాజకీయాల్లోకి ప్రాంతీయ పార్టీలు ప్రవేశించాయి. ముఖ్యంగా ఓబీసీ సామాజిక వర్గాలైన యాదవ్, కుర్మి, కొయిరీలు తమ రాజకీయ ప్రాతినిధ్యం కోసం కాంగ్రేసేతరపార్టీల వైపు చూశారు. దీంతో ప్రాంతీయ పార్టీల ఆవిర్భావానికి మార్గం సుగమం అయ్యింది. మరీ ముఖ్యంగా బిహార్ సమాజంలో ఓబీసీల ప్రాబల్యం అధికం.

2. సరిగ్గా ఇదే సమయంలో 1989 అక్టోబర్‌లో రామజన్మభూమి ఉద్యమం మొదలైంది రామశిల పూజలు మారుమూల ప్రాంతాల్లో ప్రారంభమైనాయి. అక్టోబర్ 24వ తేదీన భాగల్‌పూర్ వీధుల్లో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ‘రామశిల ఊరేగింపు’ మొదలైంది. సరిగ్గా మధ్యాహ్నం పన్నెండు గంటల సమయంలో రామశిల ఊరేగింపు ముస్లీం ప్రాబల్య ప్రాంతమైన ‘తార్ తార్ పూర్’లోకి ప్రవేశించింది. ఊరేగింపుపై హఠాత్తుగా రాళ్లదాడి మొదలు కావడంతో ఘర్షణ తీవ్రరూపం దాల్చింది. చుట్టు పక్కల ఉన్న సుమారు 250 గ్రామాల్లో పెద్ద ఎత్తున హింస చెలరేగింది. కొన్ని రోజుల తరబడి వేట కొనసాగింది. ఈ హింసాగ్నిలో సుమారు ఒక వెయ్యి 70 మంది మరణించారు.



**ప్రశాంత్ జోషి, జర్నలిస్ట్**

# లను రానిద్దామా?



ఈ రెండు పరిణామాలు బిహార్ రాజకీయ స్వభావ, స్వరూపాలను మార్చేశాయి. అగ్రవర్ణాలకు వ్యతిరేకంగా ఓబీసీలు ఏకం కావడం, భాగల్‌పూర్ అల్లర్లు, అయోధ్య ఉద్యమం నేపథ్యంలో ముస్లింల సంతుష్టీకరణలు లాలూప్రసాద్ రాజకీయ ప్రస్థానానికి మార్గం సుగమం చేశాయి. ముస్లింలను కాంగ్రెస్ ప్రభుత్వం వంచించిందనే నినాదంతో లాలూ ప్రసాద్ యాదవ్ బిహార్ రాజకీయాల్లో తన స్థానాన్ని పదిలం చేసుకునే ప్రయత్నంచేశాడు. దీంతో బిహార్ రాజకీయ మైదానం అతలాకుతలం అయిపోయింది. లాలూ ప్రసాద్‌యాదవ్‌ను ప్రజలు తమను రక్షించడానికి వచ్చిన మహనీయుడిగా భావించారు. రచయిత, పారిశ్రామికవేత్త మృత్యుం జయ శర్మ 2024లో రాసిన 'Broken Promises - Caste, Crime and Politics in Bihar' పుస్తకంలో లాలూ ప్రసాద్ యాదవ్ రాజకీయాల్లోకి వచ్చిన ఆరంభదశలో బిహార్ సమాజంలో ఎలాంటి రాజ కీయ సమ్మతి ఉండేదో విశ్లేషణాత్మకంగా రాశారు. 'జంగిల్ రాజ్'కు పునాదులు ఇక్కడే పడ్డాయి.

కోసీ రీజియన్‌లో తనకున్న మందబలంతో పప్పూ యాదవ్ 1990లో సింఘేశ్వర్ శాసనసభ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగి విజయం సాధించాడు. 1991 తర్వాత లాలూ ప్రసాద్ యాదవ్‌కు దగ్గరయ్యాడు. కోసీ రీజియన్ నుంచి తన ప్రాబల్యాన్ని సుపౌల్, సహర్ష, మాధేపుర నుంచి పొరుగున ఉన్న సీమాంచల్ లోని పూర్ణియా వరకూ విస్తరించాడు.

పూర్ణియాలో 60శాతం హిందూ జనాభా ఉంటే 2011 జనాభా లెక్కల ప్రకారం 40శాతానికి పైగా ముస్లింలు ఉన్నారు. దీన్నే ఆసరాగా చేసుకుని పప్పూ యాదవ్ వరుస విజయాలు సాధిస్తున్నాడు. చట్ట సభలకు ఎన్నికైన బిహార్ ప్రజాప్రతినిధులు..అన్ని వ్యవస్థలను తమ చెప్పు చేతల్లో ఉంచుకోవడంలో సిద్ధహస్తులు. నాడు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి ప్రాంతీయ పార్టీల మద్దతు అత్యవసరం కావడంతో.. ఆయా రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు వ్యవస్థలను తమ ఇష్టానుసారంగా వాడుకున్నాయి.

నేరమే అధికారమైనప్పుడు..న్యాయ వ్యవస్థ కూడా అచేతనమవుతుంది. అందుకు ప్రబలమైన ఉదాహరణ సీపీఐ నేత అజిత్ సర్కార్ హత్య. 1998 జూన్ 14న పట్టపగలు అజిత్ సర్కార్ ను ఏకే47 రైఫిల్‌తో కాల్చి చంపారు. 1980–2000వరకు పూర్ణియా రీజియన్‌లో జరిగిన సుమారు అన్ని హత్యల్లో పప్పూ యాదవ్ ప్రమేయం ఉందనేది బహిరంగ రహస్యం. అజిత్ సర్కార్ హత్య బిహార్ వ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించింది.

అజిత్ సర్కార్ హత్య కేసులో పప్పూ యాదవ్ ప్రమేయం ఉందని తేలడంతో ఢిల్లీలోని సీబీఐ కోర్టు 2008లో యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. పాట్నా హైకోర్టు 2013లో అజిత్ సర్కార్ హత్య కేసులో పప్పూ యాదవ్‌కు వేసిన శిక్షను రద్దు చేస్తూ కేసును కొట్టి వేసింది. బలమైన సాక్ష్యాలున్నా.. కేసును కొట్టివేయడంపై అనేక విమర్శలు వచ్చాయి. లాలూ ప్రసాద్ యాదవ్, రబ్డీదేవీ ముఖ్యమంత్రులుగా ఉన్న సమయంలో పప్పూయాదవ్ చెలరేగిపోయినట్టు మృత్యుంజయ శర్మ రాసిన పుస్తకం చదివితే అర్థమవుతుంది. బిహార్‌లో హంతక రాజకీయాలు చేసిన వారంతా.. ఎన్నికల్లో భారీ విజయాన్ని నమోదు చేసిన ప్రజాప్రతినిధులే. రాజదండంలో దట్టించిన ఇంధనం భయమే అయినప్పుడు సామాన్యులు సమిధలవుతారు. బిహార్‌లో ఒక్కో ప్రాంతంలో ఒక్కో ప్రజాప్రతినిధి సామంత రాజులుగా చెలామణి అయ్యారు. 'మొకామా'లో అనంత్ సింగ్, మగధ్ రీజియన్ (నవాడా, జెహానాబాద్, గయా)లో అశోక్ మహతోలు హత్యలు, అత్యాచార ఘటనలతో స్థానికులను భయభ్రాంతులకు గురిచేశారు.

కుర్మీ సామాజిక వర్గానికి చెందిన అశోక్ మెహతో 'రణ్ వీర్ సేన' పేరిట సాయుధ ముఠాను నడిపాడు. సామూహిక హత్యలకు పాల్పడ్డాడు. కోసీ రీజియన్‌లో ఆనంద్ మోహన్ సింగ్ సమతా పార్టీ నేతగా, లోక్‌సభ సభ్యుడిగా ఉంటూ గోపాల్ గంజ్ జిల్లా మెజిస్ట్రేట్ ఎం.జి.కృష్ణయ్యను హత్య చేయించాడు.

ఎం.జి.కృష్ణయ్య తెలంగాణలోని పాలమూరు జిల్లాలో ఓ మారుమూల గ్రామంలో ఎస్సీ సామాజిక వర్గంలో పుట్టి..సివిల్స్ రాసి తర్వాత గోపాల్ గంజ్ మెజిస్ట్రేట్ అయ్యారు. సివాన్ ప్రాంతంలో షాహబుద్దీన్ సామ్రాజ్యం నడిచేది. నేర ప్రవృత్తికి అధికార ముద్ర పడిన తర్వాత..లెక్కకు మించిన పప్పూ యాదవ్‌లు మన ప్రజాస్వామ్యాన్ని, చట్టసభల్నీ అపహాస్యం చేస్తూనే ఉంటారు. ఇప్పుడు బిహార్ పాలన గాడిలో పడుతుందని అనిపించినా...అది అంత త్వరగా, సులభంగా సాధ్యమయ్యే పని కాదు. "వినేవారెవరూ లేనప్పుడు మంచిమాట కూడా శరీరంలోనే ఇంకిపోతుంది" అన్నాడు భర్తృహరి. ఇప్పుడు మన పాలకులు చెప్పే మంచిమాటలకు ప్రేక్షకులే తప్ప ఆచరణశీలురు ఎవరూ లేరు. ★



# భారతదేశపు మొదటి స్వదేశీ




**“జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ” అంటే కన్నతల్లి, మాతృభూమి స్వర్గం కంటే మిన్న అని అర్థం. ఇది వాల్మీకి రామాయణంలోని ప్రసిద్ధ శ్లోకం. రావణ సంహారం తరువాత బంగారు లంకను చూసి లక్ష్మణుడు మోహితుడైనప్పుడు, శ్రీరాముడు లక్ష్మణునితో అన్నమాట ఇది. మాతృ ప్రేమ, దేశభక్తి గొప్పతనాన్ని ఈ సూక్తి వివరిస్తుంది. “భారతం వందే జగద్గురుం”. జగద్గురువైన భారతమాతకు వందనములు. ఈ మట్టిలో పుట్టిన ప్రతీ అణువు పూజనీయమే. అందుకే ఉదయం లేవగానే మన పాదం ఈ నేలపై పెడుతూ నేలతల్లీ నీకు వందనం. నా పాదం నీకు తగిలినందుకు క్షమించమని అడుగుతాం. “సముద్రవసనే దేవి పర్వతస్తనమండలే! విష్ణుపత్ని నమస్తుభ్యం పాదస్పర్శం క్షమస్వమే! అని ఈ శ్లోకం పఠిస్తాము. నేను గుప్పెడు మట్టే కావచ్చు కాని తల ఎత్తితే ఒక దేశపు జెండాకున్నంత పొగరుంది అంటారు శేషేంద్ర. ఈ మట్టి విలువ తెలిసినవాడు కాబట్టి.**

ప్రపంచంలో అమెరికా రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అగ్రగామి రాజ్యంగా ఎదిగింది. ఆర్థికంగానే కాక సైనికపరంగా కూడా శక్తిమంతమైన దేశంగా అవతరించింది, అయినప్పటికీ వియత్నాం అనే చిన్నదేశం చేతిలో ఓడిపోయింది. మార్చి 29, 1973న అమెరికా సైన్యం వియత్నాం నుండి వైదొలిగింది. అమెరికాపై సాధించిన విజయం తరువాత వియత్నాం అధ్యక్షుడిని ఓ విలేకరి ప్రశ్నిస్తూ మీరు అమెరికాను ఎలా ఓడించారో ఎవరికి అంతుచిక్కడం లేదు అన్నాడు. దానికి వియత్నాం అధ్యక్షుడు చెప్పిన సమాధానం ఏమంటే శక్తిమంతమైన అమెరికాను ఓడించడానికి నేను గొప్ప దేశభక్తి గల భారతీయ రాజు చరిత్ర చదివాను. అతని జీవితం నుండి ప్రేరణ పొంది యుద్ధ నీతి, ప్రయోగాలతో విజయం సాధించాను అని అన్నాడు. ఎవరా భారతీయ రాజు? అని విలేఖరి తిరిగి ప్రశ్నించాడు, వెంటనే వియత్నాం అధ్యక్షుడు లేచి నిలబడి కృతజ్ఞతా పూర్వకంగా రాజస్థాన్‌లోని మేహర్ వీరుడు రాణా ప్రతాప్ సింగ్ అని సగర్వంగా ప్రకటించాడు. రాణా ప్రతాప్ పేరు చెప్పినప్పుడు ఆయన కళ్ళలో వీరత్వం తొణికిసలాడింది. అలాంటి రాజు మా దేశంలో జన్మించి ఉంటే మేము ఈ ప్రపంచాన్నే జయించే వారమని అన్నాడు. కొన్నాళ్ల తరువాత వియత్నాం రాజు మరణించాడు. ఆయన సమాధి మీద ఇది రాణా ప్రతాప్ శిష్యుడి సమాధి అని రాశారు.

కొన్ని సంవత్సరాల తరువాత వియత్నాం విదేశాంగ మంత్రి భారత్ పర్యాటనకు వచ్చారు. వచ్చినవారు భారత్‌లోని గొప్ప వీరులకు శ్రద్ధాంజలి ఘటించడం ఆనవాయితీ. దానిలో మొదట గాంధీజీ సమాధి చూపారు. తరువాత ఎర్రకోట ఇలా వరుసలో చూపించేటప్పుడు వియత్నాం మంత్రి మహారాణా ప్రతాప్ సమాధి ఎక్కడని ప్రశ్నించారు. అప్పుడా గైడ్ ఆయన సమాధి ఉదయ్‌పూర్‌లో ఉందని చెప్పగా, అక్కడకు వెళ్లి, సమాధిని దర్శించి, అక్కడ నుండి పిడికెడు మట్టి తీసుకుని తన బ్యాగ్‌లో వేసుకున్నాడు. ఇదే మట్టి దేశభక్తులైన వీరపుత్రులకు జన్మనిచ్చింది. అందుకే దీన్ని తీసుకువెళ్లి, మా దేశం మట్టిలో కలిపితే ఈ మహనీయుని ప్రేరణతో అక్కడ కూడా ఎందరో దేశభక్తులు ఉదయిస్తారు. మహారాణా ఈ దేశమే కాదు, ప్రపంచం గర్వించదగ్గ రాజని ఆ విదేశాంగ శాఖ మంత్రి ప్రకటించారు.

ఓ సందర్భంలో భారత్ పర్యటన కోసం అబ్రహాం లింకన్ సిద్ధమౌతుండగా ఆయన తల్లిని అడిగాడట, నీ కోసం భారత్ నుండి ఏమి తీసుకురావాలని. దానికి ఆమె రాజస్థాన్‌లో మేవార్ నుండి పిడికెడు మట్టిని తీసుకురమ్మన్నదట. అక్కడ రాజు ఎంతట విశ్వాసపాత్రుడుగా ఉండేవాడంటే తనకు సహకరిస్తే సగం రాజ్యం ఇస్తానని శత్రురాజు ప్రలోభ పెట్టినా తన మాతృభూమే కోరుకున్నాడు గాని స్వార్థంతో రాజ్యాన్ని కోల్పోలేదు అని చెప్పిందట. అయితే కొన్ని కారణాల వలన అబ్రహం లింకన్ భారత్ ప్రయాణం రద్దయింది. ఈ విషయాన్ని ది బుక్ ఆఫ్ ప్రెసిడెంట్, యు.ఎస్.ఎ.లో పేర్కొన్నాడు.

మహారాణా ప్రతాప్ దేశభక్తి, త్యాగం, పోరాటానికి ప్రతీకగా మారినందున భారతీయులకు గౌరవం, గర్వకారణంగా నిలిచాడు. ఆయన పేరు గుర్తుకు వస్తే.. ధైర్యంతో ప్రకాశించే మొఖముతో సాటిలేని యోధుని చిత్రం మన మదిలోనికి వస్తుంది. అత్యంత ప్రతికూల పరిస్థితుల్లో స్వాతంత్ర్యం కోసం ఆయన సాగించిన యుద్ధం ఎన్నటికీ గుర్తుండి పోతుంది. మేవార్ రాజు అయినప్పటికి ఆయన జీవితంలో ఎక్కువ భాగం అడవులు, పర్వతాల్లోనే గడిపాడు.

రాణా ప్రతాప్ అత్యున్నత సంకల్ప శక్తి, సాటిలేని యుద్ధ నైపుణ్యాలతో మేవారును విడిపించగలిగాడు. భౌతిక ఆనందాన్ని, లాభాలను త్యాగం చేస్తూ, తన మాతృభూమి స్వాతంత్ర్యం కోసం ఆయన అలుపెరుగని పోరాటం చరిత్రలో చిరస్థాయిగా, ఒక సువర్ణాధ్యాయంగా నిలిచిపోతుంది. ఆయన లాంటి వ్యక్తిత్వం యావత్ దేశానికి, అన్ని తరాలకు స్ఫూర్తి దాయకం. జాతీయ స్పృహ తగ్గుతున్న నేటి సమాజానికి రాణాప్రతాప్ లాంటి వ్యక్తుల ఆవశ్యకత ఎంతైనా ఉంది. Pratap was rather a harbinger of organized reaction against the domination of Delhi. ఢిల్లీ రాజ్యాధిపత్యాన్ని ఎదిరించడానికి సంఘటిత శక్తి అవసరమనే విషయాన్ని తెలియజెప్పినవాడు రాణాప్రతాప్. మహారాణా ప్రతాప్ మే 9, 1540న రాజస్థాన్‌లోని కుంబల్ ప్రాంతంలో జన్మించాడు. 1568లో మేవార్ పాలకుడిగా బాధ్యతలు తీసుకుని 1597 వరకు పరిపాలించాడు. చరిత్రకారుల ప్రకారం గొప్ప చక్రవర్తిగా పేరు పొందాడు. కాని నాడు ఢిల్లీ పాలకునిగా అక్బర్ ఉన్నాడు. స్వతంత్రం, ఆత్మ గౌరవం కోసం నిరంతరం మొగలాయిలతో పోరాటం చేస్తూ ఏనాడూ తలవంచలేదు. రాణాప్రతాప్ తలదించి తన కాళ్ల మీద పడితే సగం హిందుస్థాన్‌కు రాజును చేస్తానన్నాడు అక్బర్. కానీ, అక్బర్ ప్రతిపాదన తుచ్ఛమైనదిగా తిరస్కరించాడు రాణా ప్రతాప్. ఆయన వాడిన ఆయుధాలు నేడు ఉదయ్‌పూర్ మ్యూజియంలో ఉన్నాయి. రాణా ప్రతాప్ వాడిన ఈటె బరువు 80 కిలోలు, కవచం 80 కిలోలు, రాణాప్రతాప్ వాడిన ఆయుధాలు కత్తితో కలిసి 207 కిలోలు ఉండేవి. ఆయన 7 అడుగుల ఎత్తు ఉండేవాడు.

మహారాణా ప్రతాప్ దగ్గర ఆయనకు అత్యంత ఇష్టమైన గుర్రం ఉండేది. దాని పేరు “చేతక్”. అలాగే ఆయనకు మరీ నమ్మకమైన మరో జంతువు ఏనుగు. దాని పేరు “రామ్ ప్రసాద్”. అట్లాగే రాణాప్రతాప్ జీవితంలో గుర్తుండిపోయి యుద్ధం “హల్దీఘాట్”. వీరి సైన్యంతో ప్రధానమైన వారు బిల్లులు.

# స్వాతంత్ర్య సమరయోధుడు

డా. కాశింశెట్టి సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు



Indomitable courage, the protection of his jungles and ravines and the loyal assistance of the Bills - Themselves conquered by his ancestors - enabled the Rana to resist the armies of what was then the most powerful Empire in the world and to scorn an alliance, matrimonial or feudal, with the Great Mughal.

ప్రపంచంలోనే గొప్ప సామ్రాజ్యంగా కీర్తి గడించిన ఘనత వహించిన మొగల్ సామ్రాజ్యానికి సామంతులుగా గానీ, వివాహ సంబంధాల ద్వారా గాని వారి ఆధిపత్యాన్ని అంగీకరించక, బిల్లుల సహాయంతో, ధైర్యమే ఊపిరిగా, సాహసమే ప్రాణంగా అడవులను, లోయలను రక్షించుకుంటూ కొనసాగిన వారు మేవార్ రాణాలు.

హల్దీఘాట్ యుద్ధం భారత చరిత్రలో అత్యంత ప్రసిద్ధమైన, పరాక్రమానికి ప్రతీకగా నిలిచిన యుద్ధం. ఇది జూన్ 18, 1576న రాజస్థాన్‌లోని ఆరావళీ పర్వత శ్రేణులలో ఉన్న హల్దీఘాట్ అనే ప్రదేశంలో జరిగింది. మేవార్‌రాజు మహారాణా ప్రతాప్‌కు, మొగలు సైన్యాలకూ మధ్య జరిగింది. మొగల్ సైన్యానికి అంబర్‌రాజు, రాజా మాన్‌సింగ్ నాయకత్వం వహించగా, ఎదురుగా రాజపుత్ర సైన్యానికి రాణా ప్రతాప్ నాయకత్వం వహించారు. రాణాప్రతాప్ వైపు రాజపుత్రులు, ఆఫ్ఘన్ సైన్యం, బిల్లు తెగ యోధులు పోరాడారు. హల్దీ అంటే పసుపు ఇక్కడి మట్టి ఆ రంగులో ఉంటుంది. కాబట్టి దీనికి ఆ పేరు వచ్చింది. చాలా భీకర యుద్ధం. మహారాణా ప్రతాప్ అద్భుతమైన పరాక్రమాన్ని ప్రదర్శించాడు. కానీ మొగలుల భారీ సైన్యం, వారి తుపాకీ గుళ్ల ముందు ఎక్కువ కాలం నిలబడలేకపోయారు. యుద్ధంలో స్పష్టమైన విజేత లేనప్పటికీ మొగలులు మేవార్‌ను పూర్తిగా స్వాధీనపరుచుకోలేకపోయారు. రాణా ప్రతాప్ అడవులలోనికి వెళ్లిపోతూ గెరిల్లా యుద్ధాన్ని కొనసాగించాడు. ఈ యుద్ధంలో రాణాప్రతాప్ గుర్రం "చేతక్" వీరోచితంగా పోరాడి, తన యజమానిని శత్రువుల బారి నుండి తప్పించి ప్రాణాలు విడిచింది. చేతక్ పడిపోయి మరణించిన ప్రాంతంలో రాణాప్రతాప్ ఒక చిన్న స్మారక చిహ్నం నిర్మించాడు. స్మారక చిహ్నం ఉన్న కట్టడంలో చేతక్ పైకెక్కి కూర్చున్న మహారాణా కాంస్య విగ్రహం ఉంది.



రామ్‌ప్రసాద్ మహారాణా ప్రతాప్‌కు చెందిన అత్యంత నైపుణ్యంగల విశ్వసనీయమైన యుద్ధ ఏనుగు. ఇది హల్దీఘాట్ యుద్ధంలో (1576)లో తన మావటి చనిపోయిన తరువాత కూడా స్వతంత్రంగా పోరాడుతూ, సుమారు 13-16 మొగల్ ఏనుగులను ఓడించి ప్రసిద్ధి చెందింది. మొగల్ చక్రవర్తి అక్బర్ చేత బంధించబడిన రామ్‌ప్రసాద్ 18 రోజులపాటు తినడానికి, తాగడానికి నిరాకరించింది. అక్బర్ దీనికి పీర్ ప్రసాద్ అని పేరు మార్చాడు. దానితో 18 రోజుల తరువాత ప్రాణాలు విడిచింది. రామ్‌ప్రసాద్ శౌర్యం గురించి స్వయంగా హల్దీఘాట్ యుద్ధంలో పాల్గొన్న బదయూనీ "ముంతకాబ్ ఉత్-తవారిక్ (సెలక్షన్ ఆఫ్ క్రోనికల్స్) గ్రంథంలో ఏనుగు తలవంచకపోతే దాని యజమాని (రాణా ప్రతాప్) కూడా ఎప్పటికీ తలవంచడు అని ఇలా రాశాడు.

ప్రపంచ చరిత్రలో చూస్తే స్కాట్‌లాండ్‌ను 13వ శతాబ్దంలో ఇంగ్లండ్ రాజు 1వ ఎడ్వర్డ్ ఆక్రమించగా, విలియం వాలేస్ తన పోరాటాన్ని ప్రారంభించి, ఇంగ్లీషు అధికారులను హతమార్చడం ద్వారా ఆంగ్లేయులకు వ్యతిరేకంగా జ్వాల రగిలించాడు, పాల్కిర్క్ వద్ద వాలేస్‌ను ఓడించారు. దేశద్రోహ నేరం మోపి ఉరిశిక్ష విధించారు.

ఫ్రాన్స్ దేశంలో జోన్ ఆఫ్ ఆర్క్ ఓ వీరవనిత. ఆమె ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ఫ్రెంచ్ సైన్యాన్ని నడిపించి, యుద్ధం చేసి, 1430లో ఆంగ్లేయులకు చిక్కగా, మే 30, 1431న ఆమెను సజీవ దహనం చేశారు.

సియోన్ బొలివర్ (1780-1830) దక్షిణ అమెరికా స్వాతంత్ర్య యోధుడు. స్పెయిన్ పాలన నుండి దక్షిణ అమెరికా దేశాలను విముక్తి చేసి డిశంబర్ 17, 1830న మరణించాడు. ఆయన గౌరవార్థం బొలీవియా దేశానికి ఆ పేరు వచ్చింది.

వెర్సింగెటొరిక్స్ ఫ్రాన్స్‌లోని గౌల్ ప్రాంతానికి చెందిన జాతీయవాది. రోమన్ చక్రవర్తి జూలియస్ సీజర్ ఆక్రమణను ఎదిరించి పోరాడిన గల్లిక్ తెగలను ఏకం చేసిన వీరుడు. అలాగే అమెరికాలో స్వాతంత్ర్య పోరాటం చేసిన జార్జివాషింగ్‌టన్ కూడా ఈ కోవలోనికే వస్తారు.

మహారాణా ప్రతాప్ గెరిల్లా యుద్ధతంత్రం, మొగలులను ఎదిరించిన తీరు బట్టి ఛత్రపతి శివాజీని రాణాప్రతాప్‌తో ఆయనను పోలుస్తారు.

వీరు ధైర్య సాహసాలకూ, దేశభక్తికి ప్రతీకగా నిలిచారు. వీరందరిలో రాణాప్రతాప్ స్థానం 500 సంవత్సరాల తరువాత కూడా స్మరించుకో గలుగుతున్నాము. మే 9వ తారీఖున ఆ మహా నీయుని జన్మదినం. చాలామంది చరిత్రకారులు రాణా ప్రతాప్‌ను భారతదేశపు మొదటి స్వదేశీ స్వాతంత్ర్య సమరయోధునిగా పిలుస్తారు. ★

**Source:** Maharana Pratap by Srirama Sharma




# సంస్కృతం జ్ఞాననిధికి మార్గం

**ప్రపంచ ప్రగతికి జ్ఞానం చోదకశక్తిగా ఉన్న ఈ తరుణంలో, భారతదేశపు అపారమైన మేధో వారసత్వం సంస్కృత గ్రంథాలలోనే నిక్షిప్తమై ఉంది. తత్వశాస్త్రం నుండి విజ్ఞాన శాస్త్రం వరకు, ఈ నాగరిక జ్ఞానం గతాన్ని తీర్చిదిద్దిన అంతర్దృష్టులను కలిగి ఉండి, భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తూనే ఉంది.**

మనం జ్ఞానమనే విశాల భాండాగారాన్ని శోధించాలనుకున్నప్పుడు, మన సొంత భాషల వైపు చూడం. జ్ఞానాన్ని అన్వేషించే ప్రతి ఒక్కరూ పశ్చిమ దేశాల వైపే చూస్తారు. అక్కడ ఇప్పటికే అపారమైన జ్ఞానం ఉత్పత్తి అయ్యింది. ప్రతిరోజూ మరింత ఉత్పత్తి అవుతూనే ఉంది. మనం జ్ఞానాన్ని దిగుమతి చేసుకుంటాము. విజ్ఞాన శాస్త్ర రూపంలో గానీ లేదా ఆచరణాత్మక సాంకేతిక రూపంలో గానీ ఈ భారతీయ జ్ఞాన సంప్రదాయానికి తరచుగా దోహద పడతాము. ఈ జ్ఞాన ప్రక్రియలో సంస్కృతం స్థానం, భారతీయ జ్ఞాన వ్యవస్థ వృద్ధిలో దాని పాత్ర అపారమైనది, ఆదర్శప్రాయమైనది.

సంస్కృతం ఒడిలో పెరిగిన భారతీయ నాగరికత, విభిన్న ప్రజలను ఏకం చేస్తూ జాతీయ ఐక్యతను చాటిచెప్పే తన స్ఫూర్తిని ఏర్పరచుకుంది. అది భారతదేశ స్ఫూర్తికి, దాని జ్ఞానానికి స్వరం. ఒకప్పుడు సంస్కృతంపై లోతైన అవగాహన ఉన్న ఆసియా పండితులు, శతాబ్దాలుగా ఆకర్షణను రేకెత్తించిన ఉపనిషత్తులు, రామాయణం, మహాభారతం, ఇతర ఇతిహాసాలు, గ్రంథాలలోని అద్భుతమైన వ్యక్తీకరణల లోని అనిర్వచనీయమైన ఆలోచనా ప్రక్రియలను గ్రహించడానికి ప్రఖ్యాత భారతీయ సంస్థలకు వచ్చేవారు. క్రీ.పూ. 6వ శతాబ్దానికి చెందిన గ్రీకు గణిత శాస్త్రవేత్త, తత్వవేత్త పైథాగరస్ తన జ్యామితి ప్రాథమికాలను శుల్బ సూత్రాల నుండి నేర్చుకున్నారు. అర్థశాస్త్రం అనే గ్రంథం లేదా రాజనీతి శాస్త్రం, సంస్కృత పండితుల కృషి వల్ల 1909లో చాలా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మన జీవితాలపై ప్రభావం చూపడానికి, వెలుగులోకి రావడానికి, మనం అర్థం చేసుకోవ డానికి ఎన్నో పత్రాలు, గ్రంథాలు వేచి ఉన్నాయి. సంస్కృతం వాడుక నుండి కనుమరుగైతే మనం ఆ భావనలను కోల్పోతాము.

స్వల్పకాలిక, దీర్ఘకాలిక దృక్కోణాల నుండి చూసినా, నేడు సంస్కృతం మరింత అవసరం. యుగయుగాలుగా ఇది క్రమంగా వాడుక నుండి కనుమరుగైంది. ప్రపంచీకరణకు దారితీసిన స్వేచ్ఛా విపణి ఆర్థిక వ్యవస్థ సుడిగాలి లాంటి గాలుల ద్వారా




ప్రవేశించిన నేటి సంపద సృష్టి విధానాలలో సంస్కృతం ప్రాసంగికత (Relevence)ఏమిటి? అని నేడు మనం అడుగుతున్నాం.

**అపారమైన జ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం**

మన పవిత్ర గ్రంథాలలో, మన పూర్వికులు ప్రశ్నలను స్వాగతించిన వైనాన్ని మనం గమనిస్తాము. ఉపనిషత్తులు, భగవద్గీత జీవితంలోని అనేక ప్రశ్నలకు సమాధానమిస్తాయి. ప్రశ్నోపనిషత్తులో, ఆరుగురు శిష్యులు తమ గురువుతో ప్రకృతి, దేవుడు, విశ్వాసాలకు సంబంధించిన కొన్ని అత్యంత కఠినమైన భావనలను చర్చిస్తారు. మనం ప్రజా పరిపాలన, విజ్ఞానశాస్త్రం, నిర్వహణ, గణితం లేదా ఖగోళశాస్త్రం వంటి విషయాలను తీసుకుంటే, మనం కూడా దాదాపు ఇదే రీతిలో వాదించగలిగే స్థితిలో ఉండవచ్చు.

గతంలో రసాయన శాస్త్రం, గణితం, ఖగోళ శాస్త్రం, వృక్షశాస్త్రం, అనేక ఇతర రంగాలలో అద్భుత మైన పురోగతి సాధించామని సూచించడానికి పుష్కలమైన ఆధారాలు అందుబాటులో ఉన్నాయి. హిందూ రసాయన శాస్త్ర చరిత్ర అని పిలిచే పుస్తకాలను అందించే గ్రంథాలు ఇప్పటికే ఉన్నాయి. మానవీయ శాస్త్రాల విషయంలో కూడా సంస్కృత అధ్యయనం ప్రాముఖ్యత స్పష్టంగా ఉండాలి.

అనాది కాలం నుండి ఈ భూమిని 'భారత్' అని పిలుస్తారు. ఇది జ్ఞాన కాంతిలో మునిగి ఉన్న (ఒక దేశం) అని అర్థం వచ్చే సంస్కృత పదం.

కానీ వలసవాదం తరువాత, ఇది భారతదేశంగా ఎక్కువగా ప్రసిద్ధి చెందింది. మనం సంస్కృత భాషను మరచిపోయేలా నిర్బంధానికి గురయ్యాము. అందువల్లనే ఈనాడు మనం అసలైన 'భారత్'ను, అంటే ఈ నేల జ్ఞాన నిధిని తిరిగి పొందవలసి ఉంది. ఆ నిధి గృహానికి సంస్కృతమే తాళంచెవి.

ఒక వ్యక్తి, సమాజం, దేశం అభివృద్ధిలో ఆత్మ గౌరవం అత్యంత ముఖ్యమైన కారకాలలో ఒకటిగా నిలుస్తుంది. ఒక దేశం తన గత విజయాలను, బలాబలాలను గుర్తించి, ఆ అనుభవాలను తర్వాతి తరాలకు అందించడం ద్వారా దేశం ఆత్మగౌరవం పెరుగుతుంది.

సమాజాలు పురోగమించడానికి, ఆర్థిక వ్యవస్థలు వృద్ధి చెందడానికి జ్ఞానమే కీలక అంశమని ఇప్పుడు గుర్తింపు పొందుతోంది. శాస్త్రవేత్తలకు, మేధావులకు సంస్కృతం తెలియకపోవడం వల్ల, వారు వేదాలు, శాస్త్రాలు, ఇతర సంస్కృత గ్రంథాలలో నిగూఢంగా ఉన్న జ్ఞానాన్ని విశ్లేషించి వెలికితీయడానికీ, కనీసం దానిని అంచనా వేసి, ప్రశంసించడానికీ కూడా వీలులేని స్థితిలో ఉన్నారు. అత్యంత అవసరమైన ఈ జ్ఞాన విస్ఫోటనంలో ఇదే అతిపెద్ద అడ్డంకి.

భాషాపరమైన ఈ అడ్డంకి అనే మహా సవాలును అధిగమించినప్పుడే భారత్ సుసంపన్నమై, ప్రపంచాన్ని జ్ఞానవంతం చేయగలదు. 'జ్ఞాన ప్రపంచానికి' నాయకత్వం వహించడానికి మనకు గతంలో కంటే ఇప్పుడు సంస్కృతం మరింత అవసరం.

**గతకాలపు అవశేషమా లేక నిధి భాండాగారమా?**

మనం సంస్కృతాన్ని గతకాలపు అవశేషంగా చూడాలా లేక సాంప్రదాయ భారతీయ జ్ఞాన నిధిగా చూడాలా? అనే ప్రశ్న చాలా ప్రాథమికమైనది.

భారత్‌లో 50 లక్షల తాళపత్ర గ్రంథాలు ఉన్నాయి. నకళ్లను పక్కన పెట్టినా కూడా, వాటిలో 96 శాతం ఎటువంటి మార్పులు చేయకుండా, అముద్రితంగా ఉన్నాయి. వాటికి సంబంధించిన జాబితాలు కూడా తయారు కాలేదు. అవి చాలా తక్కువ మందికి మాత్రమే తెలిసిన 14 ప్రాచీన లిపులలో రాసి ఉన్నాయి. ప్రస్తుతం భారత జ్ఞాన వారసత్వపు పరిస్థితి ఇది! వాటిలో కొన్ని ఇతర చోట్ల లభించే తాళపత్ర గ్రంథాల నకళ్లు అయినప్పటికీ, వాటిలో పావు వంతు కంటే ఎక్కువ గ్రంథాలు ప్రచురించి, పండితుల సమాజానికి అందుబాటులోకి తీసుకురావడానికి తగినంత ముఖ్యమైనవి అని నమ్మడానికి కారణం ఉంది.

నిస్సందేహంగా మన జ్ఞాన భాండాగారం అంతా సంస్కృతం అనే మాధ్యమంలోనే భద్రంగా నిక్షిప్తమై ఉంది. చాలా భారతీయ భాషల పదజాలంలో 60 శాతానికి పైగా సంస్కృతం నుండే ఉద్భవించింది. అందువల్ల, ఇది అన్ని భారతీయ భాషలకు పూరకంగా ఉంది. సంస్కృతం భారతదేశ ప్రాంతీయ భాషలను కల్తీ లేకుండా పరిరక్షించడంలో సహాయ పడగలదు.

సంస్కృతం సాంఘిక సామరస్యానికి ఒక ప్రభావవంతమైన సాధనం. ఇది కుల, మత, లింగ, ప్రాంతీయ భేదాలను నిర్మూలించగలదు. మరోవైపు, సంస్కృత విద్యను అందించడానికి ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలు అత్యంత అధ్వాన్నంగా ఉన్నాయి. మన ప్రాచీన జ్ఞానం నుండి లభించే ప్రయోజనాలను గ్రహించి, సంస్కృత గ్రంథాలలోని ఆసక్తికరమైన ఆలోచనలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాల్సింది ప్రభుత్వం కాదు, మనలో ప్రతి ఒక్కరం. ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడానికి చైతన్యవంతమైన ప్రయత్నం చేస్తే, ఈ భాష ప్రాసంగికత, ఈ క్లిష్ట సమయాల్లో దాని ఉపయోగం ఆంగ్లం వలె ఆకర్షణీయంగా ఉంటుంది.

ఈ దిశగా, సంస్కృత భారతి సంస్కృతాన్ని వాడుక భాషగా ప్రోత్సహించడంలో గొప్ప సేవ చేస్తోంది. వారి తరగతులు మౌఖిక అభ్యాసాలు, సందర్భోచిత సంభాషణల ద్వారా భాగస్వామ్యంతో సాగుతాయి. ఒక ప్రత్యేకమైన బోధనా పద్ధతితో అభ్యాసకులకు ఇది సులభతరం చేస్తుంది. ఒరాకిల్, ఇంటెల్ మరియు ఎంఫసిస్ వంటి సంస్థల సాఫ్ట్‌వేర్ నిపుణులు తమ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కోర్సులను ప్రశంసించారు.

కాబట్టి, వృత్తి నిపుణులందరూ తమ అమూల్యమైన సమయాన్ని వెచ్చించి, అత్యంత విలువైన సంస్కృతాన్ని నేర్చుకోవాలని విజ్ఞప్తి. మన పూర్వికుల జ్ఞానాన్ని పెంపొందించుకోవడం ప్రస్తుత ప్రపంచాన్ని ప్రభావితం చేసి, దానిని జీవించడానికి మరింత మంచి ప్రదేశంగా మారుస్తుంది. ఒకరు డాక్టర్, ఇంజనీర్, మేనేజర్, న్యాయవాది, సీఈఓ కావచ్చు. కానీ అది ముఖ్యం కాదు. ప్రతి ఒక్కరూ సంస్కృతం నుండి తమ జ్ఞానాన్ని తప్పక సుసంపన్నం చేసుకోవాలి. ఈ రోజు నుంచే సంస్కృతం నేర్చుకోవడం ప్రారంభించండి.

**– శిరీష్‌దేవ్ పూజారి, అఖిలభారతీయ సంపర్క్ ప్రముఖ్, సంస్కృతభారతి**

# రామమందిరానికి ముస్లింల మద్దతు



లక్నోలో అరబిక్ అధ్యయన ఉపాధ్యాయురాలైన షబానా అజ్మీ ఇటీవల ఆర్ఎస్ఎస్‌లో చేరారనే విషయం చాలా మంది స్నేహితులకు, బంధువులకు తెలియదు. వ్యక్తిగతంగా ఆమె కొంచెం సిగ్గరి. అలాగని ఆర్ఎస్ఎస్‌తో తనకున్న అనుబంధం గురించి ఆమె ఏమాత్రం పశ్చాత్తాపపడరు. "అదంతా చాలా రహస్యంగా(ఆర్ఎస్ఎస్‌లో చేరడం) జరిగింది. దాని గురించి మా కుటుంబం నుంచి చాలా విమర్శలు వచ్చాయి. నాకు సంఘ్‌తో ఉన్న సంబంధం గురించి నేను చెప్పినప్పుడు కొందరు సన్నిహితులు నన్ను ఎగతాళి చేశారు. కానీ నేను వాళ్లతో, ముందు మీ మతం గురించి, ప్రవక్త జీవితం గురించి తెలుసుకోండి అని చెప్పాను" అని ఆమె అన్నారు. రాష్ట్రీయ ముస్లిం మంచ్ అవధ్ ప్రాంత అధ్యక్షుని ప్రసంగం విన్న తర్వాత షబానా సంఘ్‌లో చేరారు. లక్నోలో జరిగిన ఒక ఉర్దూ ప్రచార కార్యక్రమంలో ఆమె మహిరాజ్ ధీరజ్ సింగ్‌ను కలిశారు. "ధోతీ కుర్తా ధరించిన ఆ నిరాడంబర వ్యక్తి, మహమ్మద్ ప్రవక్త జీవిత గాథల గురించి మాట్లాడారు. నా సొంత సమాజానికి చెందిన వారు కూడా ఇస్లాం గురించి అంత అనర్గళంగా మాట్లాడటం నేను వినలేదు. నేను వెంటనే ప్రభావితురాలినయ్యాను. ఒక ఆచరణాత్మక ముస్లింగా ఆయన నాపై గొప్ప ప్రభావాన్ని చూపారు" అని చెప్పారు.

"ఒకసారి లక్నో నుంచి అజ్మీర్ వెళ్తున్న బస్సు ప్రమాదానికి గురైన సమయంలో ఆర్ఎస్ఎస్ స్వయంసేవకులు మొదటగా సంఘటనా స్థలానికి చేరి బాధితులను ఆదుకోవడం ఆమె ప్రత్యక్షంగా చూసింది. దేశంలోని మైనారిటీల అభ్యున్నతి కోసం ఆర్ఎస్ఎస్‌లో చేరాలని నేను ఆ రోజే నిర్ణయించుకున్నాను" అని షబానాఅజ్మీ తెలిపారు. కేవలం ఏడాది వ్యవధిలోనే ఆమె అవధ్ ప్రాంతానికి రాష్ట్రీయ ముస్లిం మంచ్ కో ఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. ఆమె ఎంతో మంది ముస్లిం, క్రైస్తవ మహిళలను సంఘ్‌లో చేర్పించారు.

రామ మందిరంపై వివాదం పూర్తిగా అనవసరమని షబానా అజ్మీ భావిస్తున్నారు. "అయోధ్యలోని రామ మందిరానికి ముస్లింలు ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదు. కేవలం కొందరు స్వార్థపరులు మాత్రమే దీని గురించి రాద్ధాంతం చేస్తున్నారు. మీరు ముస్లింలతో నేరుగా మాట్లాడితే, మందిరానికి వారి నుండి భారీ మద్దతు ఉందని కనుగొంటారు" అని ఆమె చెప్పారు.

బహుభార్యత్వంను రద్దు చేయాలని ఈ ఉపాధ్యాయురాలు కోరుకుంటున్నారు. ట్రిపుల్ తలాక్, బహుభార్యత్వం పవిత్ర ఖురాన్‌కు విరుద్ధం. ఈ పద్ధతులను సమర్థించే మత పెద్దలకు తమ సొంత మతం గురించే అవగాహన లేదు. పెళ్ళైన పురుషుడు మరొకరిని పెళ్లి చేసుకోవాలని ఎలా ఆలోచించగలడు? నా ఇస్లాం సమానత్వాన్ని సమర్థిస్తుంది అని షబానా అన్నారు. ★




# 15 ఏళ్ల హింసాత్మక పాలన

**మమతా బెనర్జీ నేతృత్వంలోని 15 సంవత్సరాల పాలన, పునరావృతమయ్యే మతపరమైన ఉద్రిక్తతలు, వివాదాస్పద పాలనా నిర్ణయాలతో పశ్చిమ బెంగాల్ రాజకీయ, పరిపాలనా స్వరూపాన్ని మార్చివేసింది. 2011 నుండి రాష్ట్ర గమనాన్ని నిర్దేశించే నమోదైన సంఘటనలు, విధాన నమూనాలు, సంస్థాగత ప్రతిస్పందనలను పరిశీలిద్దాం.**

2011లో అధికారం చేపట్టినప్పటి నుండి, మమతా బెనర్జీ అనుసరించిన పాలనా విధానం, జనాభా పరంగా సంక్లిష్టమైన రాష్ట్రంలో పరిపాలనా తటస్థతపై నిరంతరం ప్రశ్నలను లేవనెత్తుతోంది. భారత జనాభా లెక్కల ప్రకారం హిందువులు మెజారిటీగా, ముస్లింలు గణనీయమైన మైనారిటీగా ఉన్న పశ్చిమ బెంగాల్‌లో దశాబ్ద కాలంగా ఒక రాజకీయ ధోరణి కొనసాగుతోంది. ఈ ధోరణిలో రాష్ట్ర విధానం, ప్రజలకు ఇచ్చే సందేశాలు అనూహ్యమైనవి.

మైనారిటీ వ్యవహారాలు, మత కార్యకర్తలకు భత్యాలు, లక్షిత సంక్షేమ నిర్మాణాలు అనేవి వర్గాల మధ్య భేదాభిప్రాయాలు చూపే ఒక పాలనా చట్రాన్ని సూచిస్తాయి. ఇది ఎన్నికల సమీకరణాలు పరిపాలనా నిర్ణయాలతో సన్నిహితంగా ముడిపడి ఉన్నట్లు కనిపించే రాజకీయ వాతావరణాన్ని రూపొందిస్తుంది.

2017లో బదురియా, బసిర్‌హాట్‌లలో జరిగిన హింసాకాండ, టీఎంసీ ప్రభుత్వ హయాంలో ఒక ప్రధాన మతపరమైన ఘర్షణలకు దారితీసింది. ఒక వివాదాస్పద సోషల్ మీడియా పోస్ట్‌తో మొదలైన ఈ ఘటన, దహనకాండ, ఆస్తి విధ్వంసం, ప్రాణ నష్టంతో కూడిన విస్తృత అశాంతిగా తీవ్రరూపం దాల్చింది. క్షేత్రస్థాయి నివేదికలు, తదనంతర డాక్యుమెంటేషన్, ప్రభావిత ప్రాంతాలలో ఎంపిక చేసిన లక్ష్యాలను నిర్దేశించడాన్ని సూచించాయి. ఇది హింస స్వభావంపై తీవ్ర ఆందోళనలను రేకెత్తించింది. ఇంటర్నెట్ షట్‌డౌన్‌లు, నియంత్రణపై ఆలస్యంగా దృష్టి సారించిన పరిపాలనాపరమైన ప్రతిస్పందన, ముందస్తు జోక్యం, సన్నద్ధతలో ఉన్న లోపాలను ఎత్తిచూపింది. దీనివల్ల సమర్థవంతమైన నియంత్రణ ఏర్పడేలోపే పరిస్థితి చేయిదాటి పోయింది.

**2018: అసన్‌సోల్-రాణిగంజ్ రామనవమి ఘర్షణలు**

2018లో అసన్‌సోల్, రాణిగంజ్‌లలో జరిగిన రామనవమి ఘర్షణలు, మతపరమైన కార్యక్రమాల సమయంలో శాంతిభద్రతల నిర్వహణలో ఉన్న లోతైన వ్యవస్థాగత సమస్యలను బయటపెట్టాయి. ఘటనల అనంతరం లభించిన ఆధారాలు, ఈ హింసలో ముందస్తు సన్నాహాలు ఉన్నాయని సూచించాయి. ఇందులో భాగంగా కొన్ని ప్రదేశాలలో గుండ్లు, నాటు ఆయుధాలను నిల్వ ఉంచడం కూడా ఉంది. ఇది నిఘా, నివారణ పోలీసింగ్‌లో వైఫల్యాన్ని సూచించింది. ఉద్రిక్తతకు కొంత కారణం ఊరేగింపులే అని మమతా బెనర్జీ చేసిన ప్రకటనలు పరిపాలనా వైఖరిపై ఆందోళనలను తీవ్రతరం చేశాయి. ఎందుకంటే, ఈ ప్రకటనలు హింసకు పాల్పడిన వారిపై నుండి దృష్టిని మళ్లించి, మత పరమైన కార్యక్రమాలలో పాల్గొన్న వారిపైకి మళ్లించినట్లు కనిపించాయి.

**2021: ఎన్నికల అనంతర హింస**

ఎన్నికలలో టీఎంసీ విజయం తరువాత, హత్యలు, దహనాలు, ప్రజలు నిర్వాసితులు కావడం, లైంగిక వేధింపుల ఆరోపణలు సహా జిల్లాల వ్యాప్తంగా విస్తృత హింస చోటుచేసుకుంది. ఈ ఘటనల తీవ్రత, స్థాయి కారణంగా కలకత్తా హైకోర్టు జోక్యం చేసుకుని, పలు కేసులపై దర్యాప్తునకు ఆదేశించింది. ఈ పరిణామాల పరంపర, రాజకీయంగా ఉద్రిక్తంగా ఉన్న వాతా వరణంలో పౌరులకు నిష్పక్షపాత రక్షణ కల్పించడంలో ప్రభుత్వ యంత్రాంగం సామర్థ్యం, సంసిద్ధతపై ప్రాథమిక ఆందోళనలను రేకెత్తించింది.

**2023: జిల్లాలవ్యాప్తంగా రామనవమి ఊరేగింపుల ఘర్షణలు**

2023లో, హౌరా, హుగ్లీ, ఉత్తర దినాజ్‌పూర్ వంటి జిల్లాలలో రామనవమి ఊరేగింపుల సందర్భంగా జరిగిన మతపరమైన ఘర్షణలు, మతపరమైన కార్యక్రమాల చుట్టూ నెలకొంటున్న ఉద్రిక్తతల ధోరణిని మరింత బలపరిచాయి.

**2024: ముర్షిదాబాద్‌లోని ధూలియన్‌లో హింస**

ముర్షిదాబాద్‌లోని ధూలియన్‌లో జరిగిన హింస, స్థానిక పాలన తీవ్రంగా కుప్పకూలిపోయిందని సూచించింది. ఇళ్లు దోపిడీకి గురయ్యాయని, ఆస్తులు ధ్వంసమయ్యాయని, ప్రాణాలు పోయాయని నివేదికలు వచ్చాయి.

**ఏప్రిల్ 2025: సంఘటనలలో పెరుగుదల**

ఏప్రిల్ 2025లో అనేక జిల్లాల్లో నమోదైన సంఘటనలు గణనీయంగా పెరిగాయి. దీంతో ఇది ఇటీవలి సంవత్సరాలు అత్యంత అస్థిరమైన కాలాల్లో ఒకటిగా నిలిచింది. ఈ అల్లర్ల తరచుదనం, భౌగోళిక విస్తరణ, ఇవి కేవలం చెదురుమదురు సంఘటనలు కాకుండా ఒక పద్ధతిని సూచించాయి. తక్కువ వ్యవధిలోనే సంఘటనలు ఒకేచోట జరగడం, నివారణ పోలీసింగ్, దీర్ఘకాలిక పరిపాలనా వ్యూహంపై ఆందోళనలను తీవ్రతరం చేసింది, ఇది రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో అస్థిరత అనే విస్తృత భావనకు దోహదపడింది.

మమతా బెనర్జీ నేతృత్వంలోని 15 ఏళ్ల పాలన పశ్చిమ బెంగాల్‌లో తీవ్రంగా ధ్రువీకృతమైన రాజకీయ, సామాజిక వాతావరణాన్ని సృష్టించింది. పదేపదే జరిగే మతపరమైన సంఘటనలు, తరచుగా ప్రశ్నలకు గురైన పరిపాలనా ప్రతిస్పందనలు, అసమాన ప్రాధాన్యతలను ప్రతిబింబించే విధాన నిర్ణయాలు అన్నీ కలిసి ప్రస్తుత చర్చను రూపొందించాయి. పరిపాలన, శాంతిభద్రతల అమలు, ఎన్నికల వ్యూహం మధ్య పరస్పర చర్య రాష్ట్ర గమనాన్ని నిర్దేశిస్తూనే ఉంది. ఈ కాలాన్ని అంచనా వేసేటప్పుడు తటస్థత, న్యాయం, సంస్థాగత జవాబుదారీతనం వంటి అంశాలపై చర్చలు కేంద్రంగా ఉండేలా ఇది నిర్ధారిస్తుంది.

– జాగృతి డెస్క్

# సమయపాలనతో విజయం




**ఇప్పటి వేగవంతమైన ప్రపంచంలో జీవితం నిరంతరం పరుగులు తీస్తోంది. ప్రతి రోజు కొత్త పనులు, కొత్త బాధ్యతలు, కొత్త లక్ష్యాలతో నిండిపోతుంది. అయినప్పటికీ, మనందరి మనసులో ఒక ప్రశ్న మెదులుతూనే ఉంటుంది–"ఎందుకు సమయం సరిపోవడం లేదు?" అని. నిజానికి, సమయం కొరత కాదు సమస్య; మనం దాన్ని ఎలా వినియోగిస్తున్నామన్నదే అసలు సవాలు.**

**ఈ** ప్రశ్నకు సమాధానం మన జీవనశైలిలోనే దాగి ఉంది. మనది తప్పు కాదు. మనం ఎప్పటికీ ముగియని బిజీ వాతావరణంలో, ఫలితం లేని పరుగులో జీవిస్తున్నాం. ఆశలతో వాస్తవాన్ని సమతుల్యం చేసుకుంటూ ముందుకు సాగుతున్నాం. మంచి విషయం ఏమిటంటే, రోజుకు 36 గంటలు అవసరం లేదు. సరైన సమయ పాలన నైపుణ్యాలే చాలు. మనం చేయాలనే ప్రతిదీ క్యాలెండర్లో నింపేయడం కాదు. సరైన పనిని, సరైన సమయంలో, సరైన కారణంతో చేయడమే అసలు లక్ష్యంగా ఉండాలి.

విద్యార్థుల జీవితంలో ఈ సమస్య మరింత స్పష్టంగా కనిపిస్తుంది.రోజంతా బిజీగా ఉన్నప్పటికీ, పనులు పూర్తికావడం లేదనే అసంతృప్తి ఉంటుంది. హోమ్‌వర్క్ పేరుకుపోతుంది, అసైన్మెంట్లు చివరి నిమిషానికి వాయిదా పడతాయి. పరీక్షలు దగ్గర పడేసరికి ఆందోళన పెరుగుతుంది. ఇది అలసత్వం వల్ల కాదు; సరైన ప్రణాళిక లేకపోవడం వల్లే.

చదవడానికి కూర్చున్నప్పుడు "ఏది మొదలు పెట్టాలి?" అనే సందేహమే ఎక్కువ సమయాన్ని తీసుకుంటుంది. ఆ చిన్న సందేహమే క్రమంగా పెద్ద అడ్డంకిగా మారుతుంది. ఈ అయోమయం ఒత్తిడిని పెంచి, పనుల నాణ్యతను కూడా తగ్గిస్తుంది. అందుకే సమయ పాలన అనేది కేవలం ఒక మంచి అలవాటు మాత్రమే కాదు;విజయానికి తప్పనిసరి నైపుణ్యం.

భారత మాజీ రాష్ట్రపతి డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం జీవితాన్ని పరిశీలిస్తే ఈ విషయం మరింత స్పష్టమవుతుంది. ఆయనకు విద్యార్థి దశలో పెద్దగా వనరులు లేకపోయినా, సమయంపై ఉన్న క్రమశిక్షణ ఆయనను గొప్ప స్థాయికి తీసుకెళ్లింది. ఆయన పనులు హడావిడిగా కాకుండా క్రమబద్ధంగా సాగేవి. ముందస్తు ప్రణాళిక ఆయనకు ప్రశాంతతను ఇచ్చేది. ప్రతి క్షణాన్ని విలువగా ఉపయోగించుకోవడం ఆయన విజయానికి ప్రధాన కారణాల్లో ఒకటి.

ఇక్కడే చాలామంది విద్యార్థులు తప్పిపోతారు. సమయ పాలన అంటే ఎక్కువ పనిని ఒకేసారి పూర్తి చేయడం కాదు. సరైన సమయంలో సరైన పనిని చేయడం, ఒత్తిడిలో కాకుండా, స్పష్టతతో ముందుకు సాగడం. అదే నిజమైన సమయ వినియోగం.

సమయం స్థిరమైనది. దాన్ని మార్చలేం, ఆపలేం. ప్రతి ఒక్కరికీ 24 గంటలే ఉంటాయి. అయితే ఫోన్ స్క్రోల్ చేయడం, సోషల్ మీడియా వినియోగం లేదా పనులను వాయిదా వేయడం ద్వారా మనం మనకు తెలియకుండానే మన భవిష్యత్తును దెబ్బ తీస్తుంటాం. ఈ నిజాన్ని గ్రహించిన క్షణమే బాధ్యత అనే భావన మొదలవుతుంది. ఆ బాధ్యతే తరువాత ప్రణాళిక రూపంలో కనిపిస్తుంది. ముందున్న పనులను గుర్తించి వాటిని క్రమబద్ధీకరించుకుంటే చాలు. అప్పుడు విద్యార్థులు 'రియాక్షన్ మోడ్' నుంచి బయటపడి, నియంత్రణతో ముందుకు సాగగలుగుతారు.

ఆధునిక కాలంలో డిజిటల్ డిస్ట్రాక్షన్స్ కూడా పెద్ద సవాలుగా మారాయి. మొబైల్ నోటిఫికేషన్లు, సోషల్ మీడియా స్క్రోలింగ్, నిరంతర సమాచార ప్రవాహం.. ఇవి మన ఏకాగ్రతను సులభంగా దెబ్బతీస్తున్నాయి. ఒక పని మీద దృష్టి పెట్టడం కష్టమవుతున్న ఈ పరిస్థితుల్లో సమయ పాలన మరింత అవసరం అవుతుంది.

ఈ పరిస్థితుల్లో AI (కృత్రిమ మేధస్సు) సాధనాలు మార్గదర్శకంగా ఉపయోగపడతాయి. ఇవి మన ఆలోచనలను భర్తీ చేయవు, కానీ వాటిని సులభతరం చేస్తాయి. లెక్చర్ నోట్సును సంక్షిప్తంగా మార్చడం, చదవాల్సిన విషయాలకు క్రమాన్ని సూచించడం, పెద్ద పనులను చిన్న భాగాలుగా విభజించడం, సమయానికి గుర్తు చేసే రిమైండర్లు ఇవ్వడం; ఇవన్నీ సమయాన్ని ఆదా చేయడమే కాకుండా మన పనిలో స్పష్టతను పెంచుతాయి.

ఇలా చూస్తే, AI మనకు ప్రత్యామ్నాయం కాదు. అది ఒక సహాయక వ్యవస్థగా పనిచేస్తుంది. సరైన విధంగా ఉపయోగిస్తే, అది మన ఉత్పాదకతను పెంచి, ఒత్తిడిని తగ్గించి, సమయ పాలనను మరింత సమర్థవంతం చేస్తుంది. కానీ చివరికి నిర్ణయం మనదే. దాన్ని ఎలా ఉపయోగించుకుంటామన్నదే ముఖ్యమైన విషయం. అయితే తప్పులు జరగడం సహజం. డెడ్ లైన్లు మిస్ కావచ్చు, ప్రణాళికలు విఫలమవచ్చు. సమయ పాలన అనేది పరిపూర్ణత కాదు; అనుకూలించుకునే నైపుణ్యం. తప్పులే మనకు పాఠాలు. వాటి నుంచి నేర్చుకుని ముందుకు సాగడమే నిజమైన అభివృద్ధి.

సమయ పాలన అనేది మనపై మనకున్న గౌరవం. తద్వారా గందరగోళం కంటే ప్రశాంతతను, ఆందోళన కంటే పురోగతిని, అలసట కంటే సమతుల్యతను ఎంచుకుంటాం. ఈ నైపుణ్యాన్ని చిన్నప్పుడే నేర్చుకున్న విద్యార్థులు జీవితంలో స్థిరంగా, ధైర్యంగా ముందుకు సాగుతారు.

సమయ పాలన నైపుణ్యాలు,అలవాట్లను రోజువారీ జీవితంలో అమలు చేయడానికి ఉత్తమ మార్గం చిన్న చిన్న అంచనాలతో ప్రారంభించడం. క్రమబద్ధతను కొనసాగిస్తూ, మనపై మనమే దయ చూపించడం కూడా చాలా ముఖ్యం.

సమయం మన చేతుల్లోనే ఉంది. దాన్ని ఎలా మలుచుకుంటామో మన భవిష్యత్తు అలాగే రూపుదిద్దుకుంటుంది. కాబట్టి ఈ రోజు నుంచే ఒక చిన్న మార్పుకు నాంది పలుకుదాం. ప్రాధాన్యతలను నిర్ణయించుకుందాం. ప్రణాళిక చేసుకుందాం. స్థిరంగా ముందుకు సాగుదాం. ఎందుకంటే సమ యాన్ని గౌరవించేవారే జీవితంలో విజయాన్ని సాధిస్తారు. అదే అసలైన జీవనానికి తొలి అడుగు.



**డా. కృష్ణ కుమార్ వేపకొమ్మ**
ప్రొఫెసర్ & ప్రిన్సిపాల్ (రిటైర్డ్)




# కృష్ణుడిపై వివాదాస్పద పోస్టర్..

కోట్లాది మంది హిందువులకు ఆరాధ్య దైవమైన శ్రీకృష్ణుడిని అవమానిస్తూ కేరళలోని రెస్టారెంట్లు పోస్టర్ తయారుచేశాయి. కృష్ణుడు సంప్రదాయ భంగిమలో చేతిలో లడ్డూతో నేలమీద కూర్చొని ఉంటే, ముందు చికెన్ వంటకంతో నిండిన ఓ పెద్ద పళ్లెం ఉన్నట్టు పోస్టర్ రూపొందించారు. ఈ వంటకాన్ని అరేబియన్ నాన్‌వెజ్ వంటకం “కుజుమండి డిష్” అని పిలుస్తారు. హ్యాపీ విషు (కేరళ సంవత్సరాది) అని మెసేజ్ చేసి, కృష్ణుడి ముందు ఈ కుజుమండి డిష్ ఉన్న ఫోటోను షేర్ చేశారు. కృష్ణుడిని అవమానిస్తూ, హిందువులను కించపరుస్తూ పోస్టర్ తయారు చేసిన యమామా షవాయా హోటల్ పై హిందువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వివాదం బాగా ముదరడంతో ఈ హోటల్‌తో సంబంధం ఉన్న ముస్తఫా, షాహుల్ హమీద్, మహ్మద్ షాహిల్ అనే ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో మంకాడ ప్రాంత పోలీసులు మత విద్వేషాలను రెచ్చగొట్టిన అభియోగాలపై కూడా కేసు నమోదు చేశారు. బాధ్యులపై కఠినమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, హిందూ ఐక్యవేదిక ఆ హోటల్ ముందు నిరసన ప్రదర్శన నిర్వహించింది. ఈ నిరసనలో స్థానిక కార్యకర్తలు, నివాసితులు పాల్గొని, ఆ హోటల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అలప్పుజ జిల్లాలోని చేర్తాలలో మహమ్మద్ షెమీర్, అర్షద్, వారి సహచరుల యాజమాన్యంలోని మెహర్ మండి డి గ్రిల్స్‌కు సంబంధించి గతంలో జరిగిన ఇలాంటి ఘటనే ఈ ప్రస్తుత వివాదానికి కారణమైంది. ఆ సంస్థ, భగవాన్ కృష్ణుడితో పాటు ప్రముఖంగా ఫ్రైడ్ చికెన్ ఉన్న బిర్యానీ ప్లేటర్‌ను చూపిస్తూ విషు థీమ్‌తో ఒక ప్రకటనను విడుదల చేసింది. ఈ వివాదం ముదురుతున్న కొద్దీ, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇతర రెస్టారెంట్ల నుండి కూడా ఇటువంటివే వెలుగులోకి వచ్చాయి. ఇది సమస్యను మరింత పెంచింది. కొట్టాయం జిల్లాలోని ఎరట్టుపేటలో ఉన్న ‘గో గ్రిల్ మండి మహల్ హోటల్’, తిరువనంతపురం, కొల్లం, అలప్పుజలలో శాఖలు కలిగిన ‘మండి మంజిల్ హోటల్ గ్రూప్’, అలాగే కోజికోడ్‌లోని ‘తలస్సేరి కిచెన్’ వంటి సంస్థలు కూడా ఇలాంటి ప్రచారానికే ఒడిగట్టాయి. ఈ ఘటనపై విశ్వహిందూ పరిషత్ తీవ్రంగా స్పందించింది. హోటల్ యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ పరిణామం వెనుక జిహాదీలు ఉన్నారని ప్రకటించింది. ఈ విషయంపై సమగ్ర దర్యాప్తు కోరుతూ వీహెచ్‌పీ నాయకులు మలప్పురం పోలీస్ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ఇలాంటివి పునరావృత్తం అవుతున్నాయని, దీని వెనుక ఎవరున్నారో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.




# హిందువుల పట్ల లెన్స్‌కార్ట్ వివక్ష

హిందూ ధర్మం, హిందువుల పట్ల కార్పోరేట్ సంస్థల్లో సైతం వివక్ష బలంగా నాటుకున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా ప్రముఖ ఐవేర్ బ్రాండ్ “లెన్స్‌కార్ట్” హిందూ సంప్రదాయాలను తీవ్రంగా అవమానపరిచిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఉద్యోగుల డ్రెస్ కోడ్‌కి సంబంధించి ఈ సంస్థ పాలసీ డాక్యుమెంట్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. లెన్స్‌కార్ట్ స్టోర్ సిబ్బంది హిందువుల సంప్రదాయ చిహ్నాలైన బొట్టు, తిలకం, కంకణాలు ధరించడాన్ని నిషేధిస్తూ... అదే సమయంలో హిజాబ్, టర్బన్‌లకు అనుమతి ఇచ్చినట్లు అందులో ఉంది. ఇది కాస్తా వైరల్ అవ్వడంతో హిందువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది హిందువులను తీవ్రంగా అవమానించడమే అని, హిందువుల పట్ల వివక్షను ప్రదర్శించడమే అని మండిపడ్డారు. లెన్స్‌కార్ట్ కేవలం హిందూ సంప్రదాయాలపైనే ఆంక్షలు ఎందుకు విధిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కొన్ని చోట్ల లెన్స్‌కార్ట్ షోరూమ్‌ల వద్ద నిరసనకారులు ఉద్యోగులకు తిలకాలు దిద్ది, తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ వివాదం పెరిగిపోవడంతో సీఈవో పీయూష్ బన్సాల్ దిగొచ్చి స్పందించారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న ఆ డాక్యుమెంట్ చాలా పాతదని, అది తప్పుడు సమాచారమని ప్రకటించారు. లెన్స్‌కార్ట్ అన్ని మతాలను, సంప్రదాయాలను గౌరవిస్తుందని, దేనిపైనా నిషేధం లేదని స్పష్టతనిచ్చారు. ఉద్యోగులు తమ మతపరమైన విశ్వాసాలను పాటించే పూర్తి స్వేచ్ఛ వారికి ఉంటుందని క్లారిటీ ఇచ్చారు. అయితే, ఆ పాత డాక్యుమెంట్‌లో సైతం ఇలాంటి నిబంధన ఉండటమేంటన్న ప్రశ్న అలాగే మిగిలి ఉంది.

# బొమ్మ కారుతో పేలుళ్లకు ప్లాన్



ఐఈడీ అమర్చిన రిమోట్ కంట్రోల్ బొమ్మ కారు ద్వారా పేలుళ్లకు కుట్రపన్నుతున్న ఒక ముఠాను ఢిల్లీ పోలీసులు పట్టుకుని కీలక కేసును ఛేదించారు. మహారాష్ట్ర, ఒడిశా, బిహార్‌కి చెందిన నలుగురు ఇస్లామిక్ ఉగ్రవాద భావాలున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరు ఉగ్రవాద కార్యకలాపాలకు ప్రణాళికలు వేయడం, సున్నిత ప్రాంతాలలో రెక్కీలు నిర్వహించడం, ఉగ్రవాద సంస్థల కోసం నియామకాల కోసం ప్రయత్నాలు చేసేవారు. అరెస్టైన వారిలో మోసైబ్ అహ్మద్, మహ్మద్ హమాద్, షేక్ ఇమ్రాన్, మహ్మద్ సోహైల్ ఉన్నారు. వీరి నుంచి ఐఈడీ, దానికి సంబంధించిన సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. రద్దీ ప్రదేశాలను లక్ష్యంగా చేసుకునేందుకు ఐఈడీ అమర్చిన రిమోట్ కంట్రోల్ బొమ్మ కారు తయారీకి ప్రయత్నాలు చేస్తున్నట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఈ నలుగురు కూడా ఇస్లామిక్ తీవ్రవాద భావజాలంతో ప్రభావితులయ్యారని తెలిపారు. వీరు ఎర్రకోట మార్ఫింగ్ ఫోటోలను కూడా సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇందులోని షేక్ ఇమ్రాన్ అనే వ్యక్తి 2025 డిసెంబర్‌లో ఢిల్లీకి వచ్చి, ఎర్రకోట, ఇండియా గేట్ సహా కీలక ప్రదేశాల్లో రెక్కీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ ముఠా అయోధ్య రామమందిరం, పార్లమెంట్, సైనిక స్థావరాలను కూడా లక్ష్యంగా చేసుకున్నట్టు పోలీసు విచారణలో వెల్లడయ్యింది. నిత్యం రద్దీగా ఉండే బహిరంగ ప్రదేశాలను, ప్రముఖ కట్టడాలను లక్ష్యంగా చేసుకోవాలని ఈ బృందం ప్రణాళికా రచన చేసిందని పోలీసులు ప్రకటించారు.

# బుల్డోజర్లతో అక్రమ దర్గా కూల్చివేత

హిందువుల పరమ పవిత్ర క్షేత్రమైన హరిద్వార్ లోని సుమన్ నగర్ ప్రాంతంలో అక్రమంగా నిర్మించిన దర్గాను ఉత్తరాఖండ్ ప్రభుత్వం కూల్చేసింది. నీటి పారుదల శాఖకు చెందిన ప్రభుత్వ భూమిలో ఈ దర్గా అక్రమ నిర్మాణం జరిగింది. ఏప్రిల్ 22న అధికార యంత్రాంగం భారీ బందోబస్తు నడుమ బుల్డోజర్ల సాయంతో దర్గాను కూల్చేసింది. అక్రమ కట్టడాల విషయంలో తమ ప్రభుత్వం సీరియస్‌గా ఉంటుందని పుష్కర్ సింగ్ ధామి ప్రభుత్వం ప్రకటించింది. ఈ దర్గాను “రోషల్ అలీషా బాబా సమాధిగా” పిలుచుకుంటారు. 10 నుంచి 15 మీటర్ల విస్తీర్ణంలో దీనిని ఆక్రమించి, నిర్మాణం చేశారని అధికారులు ప్రకటించారు. ఈ దర్గా నిర్వాహకులకు నెల రోజుల క్రితమే తాము నోటీసులిచ్చామని, అయినా స్పందన లేదని పేర్కొన్నారు. అంతేకాకుండా ఆ నిర్మాణానికి సంబంధించిన పత్రాలను, హక్కు పత్రాలను తమకు చూపించాలని కూడా ఆదేశాలిచ్చామని, అయినప్పటికీ వారు నిర్లక్ష్యంగానే వున్నారని, నిర్దేశిత గడువులోగా ఎలాంటి సరైన పత్రాలు సమర్పించలేదని అధికారులు వెల్లడించారు. అయితే.. ఆ స్థలంలోని ఓ పెద్ద మేడిచెట్టు కింద కేవలం కొన్ని ఇటుకలు, నాణేలు లభించాయని తెలిపారు. ప్రభుత్వ భూముల్లోని ఆక్రమణలను తొలగించి, వాటిని కాపాడాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు.





# శ్రీరాముడిపై నోరు పారేసుకున్న ప్రకాశ్ రాజ్

హిందుత్వాన్ని మాత్రమే నిత్యం విమర్శించే ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్ మళ్లీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈసారి శ్రీరాముడిని ఆయన లక్ష్యంగా చేసుకున్నారు. కేరళ సాహిత్య ఉత్సవంలో పాల్గొన్న ప్రకాశ్ రాజ్ హిందువులు అత్యంత పవిత్రంగా ఆరాధించే శ్రీరాముడిని, రామాయణాన్ని అపహాస్యం చేసేలా మాట్లాడారు. కేరళ సాహిత్య ఉత్సవం సందర్భంగా అక్కడి చిన్నారులు రామాయణ నాటకాన్ని వేయగా, ఈ సందర్భంగానే ప్రకాశ్‌రాజ్ రామాయణాన్ని, రాముడిని అవమానిస్తూ వ్యాఖ్యలు చేశారు. రామలక్ష్మణులు వలస కూలీలంటూ అపహాస్యం చేశారు. అలాగే వారు ఉత్తరభారతానికి చెందినవారని, వారిద్దరూ దక్షిణ భారతానికి చెందిన రావణుడి పొలంలో పండ్లు దొంగిలించారని చెప్పుకొచ్చారు. దానిని చూసిన శూర్పణఖ జీఎస్టీతో కలిపి 2 వేల డాలర్లు కట్టాలని అడిగినట్లు ఎద్దేవా చేశారు. అంతేకాకుండా రావణుడు దీనికి డిస్కౌంట్ కూడా ఇచ్చాడని, రాముడు ఆ మొత్తాన్ని చెల్లించలేకపోయినందున రావణుడు రామలక్ష్మణులను విత్తనాలు నాటమని ఆదేశించాడని ప్రకాశ్‌రాజ్ నోటికొచ్చినట్టు మాట్లాడారు. ప్రకాశ్ రాజ్ తీరుపై హిందువులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఎన్నో లోపాలున్న అన్యమతాల గురించి మాత్రం ఆయన పల్లెత్తుమాట కూడా మాట్లాడరని దుయ్యబట్టారు. ప్రకాష్ రాజ్ ఉద్దేశపూర్వకంగానే రామాయణాన్ని, రామ లక్ష్మణులను అవమానించారని, హిందువుల మనోభావాలను కూడా దెబ్బతీశారంటూ పోలీసులకు దేశ్యాప్తంగా పలువురి నుంచి ఫిర్యాలు అందాయి.

## కథ

"అన్నయ్యా! బారసాలకు నువ్వూ, వదిన, పిల్లలు తప్పకుండా రావాలి. మొన్ననే సంక్రాంతికి వచ్చాం కదా, ఇప్పుడు కాదంటే కుదరదు. రాకపోయావో.. నా సంగతి తెలుసుగదా.." ఒకలాంటి హెచ్చరికతో కూడిన ఆహ్వానం పంపింది చెల్లి మౌనిక.

ఒకరోజు ముందే వచ్చాను. వచ్చినప్పుడు పట్టుమని రెండు రోజులైనా ఉండనని నానమ్మ అలుగుతుంది. అందుకే పలకరించినా ముభావంగానే మాట్లాడింది. ఉద్యోగం లేనప్పుడు అవసరాలు వెంట పడతాయి. ఉపాధి దొరికాక'నా' అన్నవాళ్లను కలుసుకోవడానికి వేరే ఎవరి దగ్గరో అనుమతి తీసుకోవాలని ఆమెకు తెలీదు. చెప్తే వినదు.

కాళ్లు, చేతులు కడుక్కున్నాకే ఇంటి లోపలికి అడుగు పెట్టాలన్నది నా నియమం. పిల్లల క్కూడా అలవాటు చేశాను. వసారాలోకి అడుగు పెట్టగానే అమ్మ కంగారు పడుతున్నట్లు గ్రహించాను. ఎందుకో కూడా ఊహించాను. వద్దనుకున్నా ఆ దృశ్యం కంట పడింది.

పెళ్లిళ్లయ్యాక ఇద్దరక్కలూ చర్చికి వెళ్లడం అలవాటు చేసుకున్నారు. పుట్టింటికి వచ్చినప్పుడు పూజగదిలో దేవుడు ఫొటోలు ఉంటే గడప దాటి లోపలికి అడుగుపెట్టమని వసారాలోనే కూర్చునేవారు. ఇంటి ఆడపడుచును బాధ పెట్టకూడదని అక్కవాళ్లు వచ్చినప్పుడు పూజగదిలో ఉండాల్సిన ఫొటోలను బీరువాలోకి మార్చుతుంది అమ్మ. హైదరాబాద్ నుంచి వచ్చినప్పుడు మేం బాధపడకూడదని బీరువాలోని వాటిని పూజగదిలోకి చేర్చుతుంది. నేను ఉన్నా, లేకున్నా పూజగది నుంచి దేవుని ఫొటోలు తీయెద్దంటే అమ్మ వినదు. ఇలా ఫొటోలు మార్చడం నా కళ్లముందే జరగడంతో భరించరాని బాధ కలిగింది.

"ఏమ్మా! అక్కోళ్లు వెళ్లగానే మార్చొచ్చు కదా.. నా ముందే చేయాలా?" విసుక్కున్నాను.

"మీతో ఎలారా ఏగేది? పేగు చించుకుని పుట్టినోళ్లే రెండు దారులయ్యారు" అందామె.

అమ్మ కదా.. అందరికీ సమానమైన ప్రేమను పంచే మాతృమూర్తి.. మళ్లీ ఆమెను నేను ఇంకో మాట అని.. గడ్డాలొచ్చిన బిడ్డల మాటలు తట్టుకోలేక ఆమె బాధ పడి.. నేను ఓదార్చి.. అత్తయ్యను ఎందుకు బాధపెట్టారని అక్షర నన్ను చూపుల్తో తిట్టి.. ఇదంతా ఎందుకులే అనుకుని చెల్లిని చూసొద్దామని వీధి గుమ్మం ఎక్కాను.

"అలివేలూ.. అలివేలూ.. ఉన్నావా?" మోపెడ్ మీద కూర్చొన్న పెద్ద మనిషి పిలిచాడు.

అతను తెల్లటి చొక్కా,ప్యాంటు ధరించాడు. దుస్తులు తెల్లగా ఉండటంతో ఆయన నలుపన్న సంగతి చక్కగా తెలుస్తోంది. జుట్టు కూడా ఆయన దుస్తుల్లాగానే మెరిసిపోతుంది. చక్కగా పాపిడి తీశాడు. మీసాలు దిట్టంగా, సూటిగా మొనదేలి ఉన్నాయ్. ఎత్తు ఐదున్నర అడుగులు. వయస్సు యాభై పైనే ఉండొచ్చని ఇట్టే చెప్పెయ్యొచ్చు. మోపెడ్ హ్యాండిల్ కింది భాగంలో చిన్న బ్యాగు తగిలించాడు. అందులో ఏదో పుస్తకం ఉన్నట్లనిపించింది. స్పష్టంగా కనిపించలేదు. ఆయన్ని అంతకుముందు ఎక్కడో చూసినట్లు గుర్తుస్తోందిగానీ పేరే గుర్తు రావట్లేదు. మా ఇంటి ఎదురుగా ఉంటోన్న అలివేలు వదిన్ని మళ్లీ పిలిచాడతను.



# అద్దగీత

దొండపాటి కృష్ణ



నేనే కల్పించుకుని,"వదిన లేనట్లుందండి.. వచ్చాక చెప్తాను" అన్నాను. అతను నావైపు తీక్షణంగా చూశాడు.

ఏదో గుర్తొచ్చినట్లు,"ఈ ఇంటి గోవర్ధనరావు నీకేమవుతాడు?" మా ఇల్లు వంక చూశాడు.

"మా నాన్నగారండి.." అన్నాన్నేను. ఊహ తెలిసిన దగ్గర్నుంచి చదువు పేరుతో, ఉద్యోగం పేరుతో స్వగ్రామానికి దూరంగా ఉంటుండటంతో ముఖపరిచయాలు తక్కువ.

"నువ్వూ.., ప్రార్థనా..." అర్థోక్తిగా ఆగిపోయాడతను.

ఆయన అంతరంగమేమిటో అర్థమై,"నేను హిందువునండి.." ఖరా ఖండిగాచెప్పాను.

మాపేటలోని జనమంతా బెల్లం చుట్టూ మూగే చీమల్లా చర్చికి వెళ్తుండటంతో అప్పుడప్పుడు నాకిలాంటి ప్రశ్నలు ఎదురవుతుంటాయి.

"రాయుడుగారి స్థలంలో మూడు రాత్రులపాటు స్వస్థత కూటములు పెడుతున్నాం.నువ్వూరా.." ఆహ్వానించాడతను.

"నేను రానండి.." గ్యాప్ ఇవ్వకుండా చెప్పాను. ఇతనే కాదు... ఎవరొచ్చి అడిగినా ఇదే నా సమాధానం. అందులో ఇసుమంతైనా మార్పుండదు.

"ఒకసారొచ్చి వింటేనే కదా ఇందులోని మంచి ఏంటో తెలుస్తుంది" అన్నాడతను.

"ఆల్రెడీ విన్నానండి. నాకు హిందూ మతమే నచ్చింది. ఇంకెక్కడికీ వెళ్లను, గుళ్లకే వెళ్తాను." చెప్పాను. అంత దీటుగా చెప్పడం నచ్చలేదను కుంటా..అతని మొహం కందగడ్డలా మారింది. అటుఇటు చూశాడు.

నా అభిప్రాయాన్ని అక్కడెవరూ వినలేదని నిర్ధారించుకున్నాక, "నీకు చెప్పినోళ్లేం చెప్పారో, ఎలా చెప్పారో.." అన్నాడు.

"ఎవరేం చెప్పినా సారం ఒకటే కదండీ.." అతనికి ఆలోచించుకునే సమయం ఇవ్వకుండా వెంటనే అన్నాన్నేను.

"అందుకే రమ్మంటున్నాను. ఎంత మంది మారారో చూడు. మీకూ మంచే జరుగుతుంది." పేట జనాన్ని ఉద్దేశిస్తూ ఆయనన్న మాట గుండెల్లో కలుక్కుమంది. "కన్నవాళ్లను ఎవరో మార్చుకున్నారని నేను మార్చుకోలేనండి.." పరోక్షంగా నేనన్న మాట గునపంలా దిగినట్లుంది.

"నచ్చిన దేవుణ్ణి ఆశ్రయించడం తప్పు కాదే.. వీలైతే ఈ రాత్రి ప్రార్థనకు రా.." మొహం బిగబట్టి బండి స్టాండ్ తీశాడు.

అప్పుడే అలివేలు వదిన వచ్చింది. ఆమె అప్పుడక్కడికి రాకపోయి ఉంటే ఏం జరిగుండేదో..

ఆయన్ని చూసి, "అయ్యగారూ.. మీరా... రండి, రండి.." అంటూ లోపలికి ఆహ్వానించింది.

"ఏమీ లేదు అలివేలూ... రేపట్నుంచి కూటములు పెడుతున్నాం కదా... మళ్లీ గుర్తు చేద్దామని.. మీవోళ్లకి చెప్పావా?" మోపెడ్ హ్యాండిల్‌కి తగిలించిన బ్యాగులోంచి బయటకు తీశాడు..బైబిల్..

దాన్ని చంకలో పెట్టుకుని వదిన్ని అనుసరించాడు. కానీ,ఇంటి లోపలికి వెళ్లలేదు. వదిన కుర్చీ తీసుకొచ్చి వేసింది. అతను అందులో కూర్చోలేదు. లోటాతో మంచి నీళ్లు ఇచ్చింది వదిన. అతను అందుకోలేదు. ఇది అలవాటేనన్నట్లు లోటాను పక్కనే అరుగుమీద పెట్టింది. అతను చంకలో నుంచి బైబిల్ని రెండు చేతుల్లోకి తీసుకున్నాడు. వెంటనే వదిన పైటకొంగును తల చుట్టూరా కప్పుకుంది. అతను కళ్లు మూసుకుని, తల పైకెత్తి ప్రార్థన మొదలెట్టాడు. వదిన తల దించుకుని దేవుణ్ణి స్తుతించింది. ఒక నిమిషంలో ప్రార్థన పూర్తయ్యింది. అవగానే లోటా నిండా బియ్యం నింపి, అందులో యాభై రూపాయల కాగితం పెట్టి ఇచ్చింది వదిన. ఆనందంగా స్వీకరించాడతను.

ఇంట్లోంచి నాన్న ఫోన్ రింగయ్యింది. 'నారాయణ నారాయణ అల్లా అల్లా / మా పాలిటి తండ్రీ మీ పిల్లలమేమెల్లా' పాట వినిపించింది. స్మార్ట్ ఫోన్ కొన్న దగ్గర్నుంచి కృష్ణశాస్త్రిగారు రాసిన ఆ పాటే నాన్నగారి రింగ్ టోన్! అక్షర బయటకొచ్చింది. కర్ర పోటు వేసుకుని నానమ్మ కూడా జత కలిసింది.బాబాయ్ ఇంటికి బయల్దేరాము.

* * *

మెయిన్ రోడ్డుకి ఒకవైపు మా ఇల్లు, ఇంకోవైపు బాబాయిగారి ఇల్లు. వాళ్లది రోడ్డు నుంచి ఇరవై మీటర్ల దూరం ఉంటుంది. మెయిన్ రోడ్డుకు వెళ్లేసరికి పుష్ప సినిమా నుంచి 'కిస్, కిస్ కిసుక్కు' పాట హోరెత్తేలా వినపడింది.

గుమ్మం దాటి లోపలికి వెళ్లాం. నానమ్మ సరాసరి వసార్లో ఉన్న మంచం దగ్గరికి వెళ్లింది. అక్షర మాత్రం బావి దగ్గరికెళ్లి కాళ్లు కడుక్కుంది. కళ్లు కడుక్కుంది. దోసిట్లోకి నీళ్లు తీసుకుని తల చుట్టూ మూడుసార్లు తిప్పింది. వాటిని తలపై జల్లుకుంది. చుట్టింటి నుంచి అదంతా చూసిన మా రోజీ పిన్ని మొహం మాడ్చుకుంది. అక్కడ్నుంచి లేచి చెల్లెలు మౌనిక దగ్గరకు వెళ్లింది. పొత్తిళ్లలోని బిడ్డను అక్షర తీసుకుంటుంటే పిన్ని వద్దంది.

"దూరాభారం మీదొచ్చారు కదా... పసిబిడ్డను కాసేపయ్యాక ఎత్తుకుందువు గానిలే.." పిన్ని అనడంతో అక్షర నొచ్చుకుంది.

కోడలితో పిన్నికేం గొడవలు లేవు. అక్షర తల్లో పూలు పెట్టుకుంటుంది. పిన్ని పెట్టుకోదు. అక్షర బొట్టు పెట్టుకుంటుంది. పిన్ని పెట్టుకోదు. అక్షర గాజులు, పట్టీలు, మెట్లు వేసుకుంటుంది. పిన్ని వాటన్నింటిని దగ్గరకు రానివ్వదు. అక్షర శ్లోకాల్ని మననం చేసుకుంటుంది. పిన్ని బైబిల్ చదువుతుంటుంది. మెడలో పుస్తెల తాడు ఒక్కటే ఇద్దరికున్న

సారూప్యత. బాబాయ్ గొడవ చేయకుండా ఉండాలే గానీ పిన్ని దానికీ స్థానభ్రంశం కలగజేస్తుంది.

కుర్చీలో కూర్చుని పనుల్ని పర్యవేక్షిస్తున్నాడు బాబాయి. వేపచెట్టు కింద కుర్చీ వేసుకుని ఫోన్లో మాట్లాడుతున్నాడు బావ. రేపటి కార్యక్రమం గురించి చర్చలు నడుస్తున్నట్లున్నాయి. పలకరించాను. ఫోన్ పక్కన పెట్టేసి కార్యక్రమ వివరాలు చెప్పాడు.

“ఏం బావా? స్టేజీని ఇలా అడ్డంగా రెడీ చేసారు. గుమ్మంవైపు కదా ఉండాలి..” సందేహమొచ్చి అడిగాను.

“వాస్తు ప్రకారం అక్కడైతేనే బాగుంటుందని పాస్టర్ గారు చెప్పారు బావా..” అన్నాడు.

“పాస్టర్లు వాస్తు కూడా చూస్తారా?” నా మాటకు నొచ్చుకున్నాడేగానీ నోరు విప్పలేదు.

“ఉదయం ఎనిమిదింటికి ముహూర్తం..లేట్ చేయకుండా వచ్చెయ్యండి బావా..” చెప్పేసి పనిలో నిమగ్నమయ్యాడు.

మతం అంటారు. మళ్లీ వాస్తులు, ముహూర్తాలు అంటారు. ఇలా అన్ని మతాల్లోనూ ఉంటాయేమో నాకైతే తెలీదు. మౌనం వహించాను. పిన్ని, అక్షర కబుర్లలో పడ్డారు. ఒకరి పద్ధతులు ఒకరికి నచ్చవు గానీ ప్రవర్తనలైతే నచ్చుతాయి. కలిసిపోతారు. పాపతో కాసేపు గడిపాము. నానమ్మ అక్కడే ఉంటానంది. నేను, అక్షర బయలుదేరాం. రోడ్డుమీద, అభయాంజనేయ స్వామి వారి దేవస్థానపు అరుగు మీద కూర్చుని ఆ‘పెద్దాయన’ ఎవరితోనో మాట్లాడు తున్నాడు.

“మీరంతా ఈ దేవుడినే నమ్ముకున్నారు. ఈ గుళ్లో పూజలు జరిగి ఎన్నాళ్లయ్యిందో చెప్పు? ఆంజనేయుడితోపాటుగా రాముడు, లక్ష్మణుడు, సీత, వినాయకుడి విగ్రహాలు పెట్టారు. వీళ్లెవరూ మిమ్మల్ని ఆదుకోరు. నా మాట

ఇను. ఏసయ్యను నమ్ముకో.. ఆత్మను శుద్ధి చేసుకో.. రేపు రాత్రి రాయుడిగారి స్థలంలో పెట్టే కూటమికి రా..” పెద్దాయన చెప్తున్నాడు.

ముసలాయన..రోజూ వినే భాగవతమే కదా అన్నట్లు ఒక చెవితో వింటూ ఇంకో చెవితో వదిలేస్తున్నాడు. తను వినడం లేదని పెద్దాయన కనిపెట్టకూడదని మధ్యమధ్యలో ‘ఊ’ కొడుతున్నాడు. రోజుల్ని వెనక్కి తవ్వగా, తవ్వగా ఆ పెద్దాయనెవరో ఇప్పుడు గుర్తొచ్చింది. ఆయన పక్కూరి వీరాచౌదిరి.

* * *

“నాన్నా.. ఇందాక రోడ్డుమీద నాతో మాట్లాడింది వీరాచౌదిరి కదా..” అడిగాను. అవునన్నట్లు తలూపాడు నాన్న.

“వాళ్ల కులదైవం ఏడుకొండలవాడు కదా.. మరేంటిప్పుడు..?” తెలుసుకోవాలన్న జిజ్ఞాస కలిగింది.

“డబ్బు చేసే మాయ అంతా ఇంతా కాదు. ఒకప్పుడు మన పేట వాళ్లు ఆళ్ల అండదండలతో బతుకీడ్చేవారు. చుట్టుపక్కల ఫ్యాక్టరీలొచ్చాక కూలి

మతం అంటారు. మళ్లీ వాస్తులు, ముహూర్తాలు అంటారు. ఇలా అన్ని మతాల్లోనూ ఉంటాయేమో నాకైతే తెలీదు. మౌనం వహించాను. పిన్ని, అక్షర కబుర్లలో పడ్డారు. ఒకరి పద్ధతులు ఒకరికి నచ్చవు గానీ ప్రవర్తనలైతే నచ్చుతాయి. కలిసిపోతారు. పాపతో కాసేపు గడిపాము. నానమ్మ అక్కడే ఉంటానంది. నేను, అక్షర బయలుదేరాం. రోడ్డుమీద, అభయాంజనేయ స్వామి వారి దేవస్థానపు అరుగు మీద కూర్చుని ఆపెద్దాయన’ ఎవరితోనో మాట్లాడుతున్నాడు.



పనులు మానుకున్నారు. ఆళ్ల మాటకు విలువ తగ్గింది. మనరేమల్లె, సింగన్నగూడెం, మల్లవల్లి, వేలేరులకు న్నది ఒక్కడే పాస్టర్ శామ్యూల్. ఆ పాస్టర్ మొదట్లో చిన్న స్కూటర్ మీదొచ్చేవాడు. ఇప్పుడు పెద్ద కారులో వత్తన్నాడు. మనకులపోడు హుందాగా ఆళ్ల ముందే తిరుగుతుంటే కన్ను కుట్టింది.

ఈ వీరాచౌదిరి డబ్బు మనిషాయే.. పీనాసోడని అందరికీ తెలిసిందే. ఆయన పిల్లలిద్దరూ పరాయి దేశంలో ఉన్నారు. అంత పెద్ద ఇంట్లో భార్యతో ఉంటాడు. ఆళ్లిద్దరికీ పాలేరు ఎందుకని.. ఆ డబ్బులు కూడా కలిసొత్తాయని ఆణ్ణి తీసేసి చాకిరంతా ఆయనే చేత్తన్నాడు. అలాంటోడికి పిండికొద్దీ రొట్టెలాగా డబ్బులు వచ్చి పడతాయని తెలిత్తే ఆగుతాడా?

ఒకరోజు ఇంటిముందు ఖాళీ స్థలంలో పాక కట్టాడు. దేవుని బొమ్మలు పెట్టాడు. శిలువను నిలబెట్టాడు. జనాన్ని పోగేశాడు. ఆళ్ల చేతుల్లో బైబిల్పెట్టాడు. ఆ ఫొటోలు సంఘానికిపంపాడు. పై వోళ్లు వచ్చి చూశారు. అది నిజమేనని రిపోర్ట్ రాశారు. ఆయన్ని పాస్టర్గా ఉండమని చెప్పి డబ్బులు పంపారు. జనం పెరిగితే డబ్బులూ పెరుగుతాయనీ చెప్పారు. సంకోచం లేకుండా అన్య మతాన్ని స్వీకరించాడు. ఆరోజు నుంచి అందర్నీ ప్రార్థనకు రమ్మని అడుగుతున్నాడు. కూటములు పెడుతూ జనాన్ని పోగేస్తున్నాడు”తానువిన్నది, కన్నది, చూసింది కలగలిపి చెప్పాడు నాన్న.

“మరి, నిన్నుఅడగలేదా?” కుతూహలం కొద్దీ అడిగాను.

కారణం, నాన్న చర్చిలోంచి వచ్చే బైబిల్ వాక్యాలు వింటాడు. పాస్టర్ ఏదన్నా చెప్తుంటే నవ్వుతూ తలూపుతాడు. పాస్టర్ ఎన్నిసార్లు ఇంటికొచ్చినా మర్యాద చేస్తాడు. చందా అడిగితే కాదనకుండా, లేదనకుండా ఇస్తాడు. ఆయన మతం మారాడేమోనన్న చిన్న సందేహంతో అడిగాను.

“ఒకరోజు ఆ వీరాచౌదిరి ఓ గంటసేపు బుర్ర తిన్నాడు. ఎప్పట్నుంచి వత్తావని అడిగాడు. ఆయన చెప్పింది ఒక్క ముక్క అర్థం కాలేదన్నాను. కనిపించినప్పుడల్లా అడగడం మానలేదు. అర్థమయ్యాక వస్తాననిఅంటూనే ఉన్నా..” చెప్పాడు నాన్న.

మనసు స్థిరంగా ఉన్న మనిషిని దేవుడుకూడా కదిలించలేడేమో! నాన్న రింగ్‌టోన్ గుర్తు తెచ్చుకునైనా ఈ ప్రశ్న అడక్కుండా ఉండాల్సింది.

* * *

అలంకరణలతో వేదిక శోభిల్లుతోంది. నేను, అక్షర ముహూర్తానికి అక్కడున్నాం. అప్పటికే వీరాచౌదిరి వచ్చేశాడు. ‘కలములతో రాయగలమా! కవితలతో వర్ణించగలమా’ అనే పాట వినిపించింది. పాట చాలా బాగుంది. ఎప్పుడూ విన లేదు.

పక్కనే ఉన్న పాపని, “ఈ పాట ఏ సినిమా లోది?” అని అడిగాను. ఆమె నావంక అదోలా చూసింది.

“ఇది యేసయ్య పాట..”కోపంగా అరిచినట్లు చెప్పింది. దేవుడి పాటను సినిమా పాట అనుకోవడం ఆమెకు కోపం తెప్పించినట్లుంది. ఆ పాట అవ్వగానే ‘షారోను రోజావే..నా ప్రాణ స్నేహమే’ అనే పాట వినిపించింది. ఈసారి ఆ పాపని అడగలేదు. నిన్న సినిమా పాటలు మార్మోగితే నేడు దేవుని పాటలు స్వస్థత మార్గంలో ఓలలాడిస్తున్నాయి.

బాబాయ్, పిన్ని హడావిడిగా ఉన్నారు. అత్తగారు పాపను ఎత్తుకుంది. మామగారు పనులు పురమాయిస్తున్నారు. బావగారు వీరాచౌదిరితో మాట్లాడుతున్నాడు. చెప్పిందానికి తలూపుతూ ‘ఊ’ కొడుతోంది చెల్లెలు. నాన్న ఓ పక్కన కుర్చీ వేసుకుని కూర్చున్నాడు. అమ్మ పిన్నికి సాయం చేస్తోంది. వాళ్లకు తోడుగా ఉంది అక్షర. ఎవరెవరు ఏమేమి చేస్తున్నారో కనిపెట్టుకుంటూ ముహూర్తం వంక చూస్తున్నాను, నిజంగానే ఆ సమయానికి ప్రారంభిస్తారా లేదా అని!

మైకులో వచ్చే పాటల్ని ఆపమని వీరాచౌదిరి సైగ చేశాడు. ఫోన్ చూశాను. సమయం ఉదయం ఎనిమిది గంటల మూడు నిమిషాలయ్యింది.

“దైవప్రార్థన చేసుకుందాం. అందరూ తల

దించుకుని, కళ్లు మూసుకోండి..” చెప్పాడు వీరాచౌదిరి.

మగవాళ్లు కళ్లు మూసుకున్నారు. చేతులు రెండింటిని కలిపి పట్టుకున్నారు. వాటిని నాభిపై పెట్టుకుని నిలబడ్డారు. నాన్న మాత్రం ఏమీ స్పందించకుండా అలానే కుర్చీలో కూర్చున్నాడు. ఆడవాళ్లూ కళ్లు మూసుకున్నారు. పైట కొంగుల్ని తలపై కప్పుకున్నారు. ఒక చేత్తో బైబిల్ పట్టుకుని నిలబడ్డారు. వాళ్లల్లో అమ్మ కూడా ఉంది. అక్షరకాస్త దూరంగా కూర్చొని చూస్తోంది.

“మన ప్రభువు అయిన యేసు క్రీస్తు నామముతో ప్రార్థన మొదలు పెట్టుదాం” అంటూ ప్రార్థన మొదలైంది.ఆ ప్రార్థనలోనే పాపకు ‘లహరిక’ అనే పేరుపెట్టారు. కోరికలు కోరుకున్నాక, “ఆమేన్.. ఆమేన్.. ఆమేన్..” అంటూ ముగించారు.

మగవాళ్లు కుర్చీల్లో కూర్చున్నారు. ఆడవాళ్లు కళ్లు తెరిచారుగానీ తలపై గల పైట కొంగుల్ని కిందకు దించలేదు.అప్పుడేప్రార్థనను ముగించడం మనస్కరించని వారు కాసేపు దేవుణ్ణి స్తుతించుకున్నారు.

ప్యారాచూట్కొబ్బరి నూనె డబ్బాను తీసుకొచ్చి, “అమ్మా మౌనికా, ఈ యేసు రక్తాన్ని క్రమం తప్పకుండా ‘లహరిక’కు రాయి..రోజూ ప్రార్థన చేయి. ఇదిగో అబ్రహాం, నువ్వీ దేవుని బిడ్డను మన నూజివీడు సెయింట్ ఆన్స్ స్కూల్లోనే చదివించాలి.సరేనా..” తగు సలహాలు సూచనలు ఇస్తున్నాడు వీరాచౌదిరి. మైకులో దేవుని పాటలు మొదలయ్యాయి.

వీళ్లందరికన్నా నానమ్మ భిన్నంగా కనిపించింది. అంతమంది ఆనందంగా ఆ ప్రాంగణంలో ఉంటే ఆమె మాత్రం ఏదో పోగొట్టుకున్నదానిలా ముడుచుకుని కూర్చుంది. చేతికర్రను నేలకు రాస్తూ నిట్టూర్పులు విడుస్తోంది.

ఆమె దగ్గరికెళ్లి “ఏంటి మామ్మ, టిఫిన్తినలేదా? మొహం అలా ఉంది?” అడిగాను.

“టిఫినా, పాడా... కాటికి కాళ్లు జాపుకున్నదాన్ని.. తింటే ఎంత..తినకపోతే ఎంత..” కాస్త ఘాటుగానే స్పందించింది.

శుభం జరిగేచోట పెదోళ్లు ఇలా అశుభపు మాటలు ఎందుకు మాట్లాడతారో అర్థం కాక, “ఇప్పుడేమైంది?” అడిగాను.

“ఏమైందా? సామూయేలును కాదని ఆ ఈరా చౌదిరిని తీసుకొచ్చారు. బైబులు గురించి ఈడికేం తెలుసని.. ఏవో రెండు ముక్కలు సదివితే సరిపోతుందా? పాటించొద్దా? మన పిల్లల పేర్లూ ఆడే సెప్తాడా? ఎక్కడ సదవాలో కూడా ఆడే చెప్తాడా?మన పద్ధతులు తెలీనోడు మనతో ఎలా కలిసిపోతాడు? మనల్ని ఎలా కలుపుకుంటాడు?” అందినానమ్మ.

అలివేలు వదిన మంచినీళ్లు ఇచ్చినప్పుడు అందుకోని పాస్టర్, బియ్యం అందుకున్న సంగతి గుర్తుకొచ్చింది. నానమ్మ ఆవేదనలో నిజముంది.నాకు పెళ్లి సంబంధాలు చూసేటప్పుడు ఇలాంటి ఆవేదనే అమ్మ దగ్గర చూశాను. పూజలు చేసే అమ్మాయే కావాలని పట్టుబట్టాను.

‘బైబిలు పట్టుకుని చర్చిలకు పోయే మన కులంలో పూజలు చేసేవారు మిగల్లేదురా..’ అని ఒప్పించడానికి అమ్మ, అక్క వాళ్లు ప్రయత్నించారు. నేను వినక పోయేసరికి అమ్మ ఒక మాటంది.

‘ఒరే నాయనా, రాముడూ దేవుడే.. క్రీస్తూ దేవుడే.. కానీ ఆళ్లిద్దరూ మీ కాపురంలోకి అడ్డుగా ఉండకూడదు. నువ్వు చెప్పే వినే అమ్మాయి ఉండాలి. నీకన్నీ చూసి పెట్టాలి. మాట రాకుండా, గుట్టు చప్పుడుగా కాపురం చెయ్యాలి. అలాంటి అమ్మాయి దొరికితే సుఖపడతావ్. కాబట్టి అమ్మాయి సుగుణవతో కాదో చూసుకో, చాలు.. ఇంకేం పట్టించుకోమాక..’ అని అంది.

అమ్మ, పిన్ని, నానమ్మల ఆవేదనలన్నీ ఒకవైపున.. తమ వాదాన్ని రుద్దకుండా భరిస్తున్న నాన్న, బాబాయ్ల మనోవేదనలు మరోవైపున పోల్చిచూశాను. మనిషికి, మనసుకి ‘మతం’అనేది అడ్డగీతగా మారుతుందేమో ననిపించింది.

‘నారాయణ నారాయణ అల్లా అల్లా / మా పాలిటి తండ్రీ మీ పిల్లలమేమెల్లా’ అంటూనాన్న ఫోన్ రింగయ్యింది. మైకు శబ్దాల్లో రింగ్ టోన్ను పట్టించుకోలేదెవరూ! ★

## జాగృతి యాప్ వినియోగంపై విన్నపం

ఏడున్నర దశాబ్దాలకు పైబడిన సుదీర్ఘ ప్రస్థానంలో సాంస్కృతిక ఔన్నత్యం, రాజకీయాలు, సామాజిక అంశాలు, వర్తమాన సమస్యలు, కళలు, సాహిత్యం, విజ్ఞానశాస్త్రం, పర్యావరణం వంటి పలు అంశాలను చర్చించే విలువైన ఎన్నో వ్యాసాలను జాగృతి అందిస్తూ వస్తోంది. ఈ సంవత్సరం సంఘ శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్నాము.

**ఈ సందర్భంగా పాఠకులకు మరింత చేరువయ్యేందుకు జాగృతి యాప్ని సిద్ధం చేశాం.**

యాప్ని ఇన్స్టాల్ చేసుకోవడానికి ప్లేస్టోర్లో **Jagriti Weekly** అని సర్చ్ చేయండి లేదా పక్కనున్న QR Code స్కాన్ చేయగలరు.

APP Login -ఎడమవైపు Menu మీద క్లిక్ చేసి, Login ఎంపికపై క్లిక్చేస్తే Login Screen కనిపిస్తుంది.

1. తెరపై కనిపించే యూజర్ నేమ్, పాస్ వర్డ్తో లాగిన్ కావచ్చు.
2. Login Screen కింద **Click here to** login with Phone Number పైన క్లిక్ చేసి ఫోన్ నెం. నమోదు చేస్తే, మీ మొబైల్కి OTP వస్తుంది. OTPతో లాగిన్ అవ్వండి.

3 మొదటిసారి Login కాగానే, Password మార్చు చేసుకోమని సందేశంతో Screen వస్తుంది. మార్చుకొని, మరలా Login అవ్వాలి.

4 Dashboard: Profile information – User Id, Name, Profile status, Start, End Date, and Receipt Amount వివరాలు కనిపిస్తాయి.

5 Profile Management : View Profile–మీ వ్యక్తిగత చిరునామా, అమౌంట్ వివరాలు చెక్ చేసుకోండి. చిరునామా మార్పు కోసం పైన ఉన్న **JAGRITI** లోగోకి పక్కనే ఉన్న Edit Profileని క్లిక్ చేయండి. పోస్టల్ అడ్రసు ఇచ్చి, పిన్కోడ్ టైప్ చేస్తే రాష్ట్రం, జిల్లా వివరాలు వాటంతట అవే వస్తాయి. మండలం, సబ్ పోస్ట్ ఆఫీసు, సంఘ విభాగ్, జిల్లా, ఖండ/నగరాలను మీరు ఎంపిక చేస్తే సరిపోతుంది.

6 Support ticket: మీకు ఏదైనా సమస్య ఉంటే ఇందులో నమోదు చేయండి. 24 గంటలో మీకు కాల్ చేస్తాము.

7 మిగితా వివరాలు Subscriber Login Videoలో చూడండి.

**– మేనేజర్**

## మార్క్సిజం-శ్రీరామరాజ్యం



# భారతంలో రాజనీతి-2

**మహాభారతంలో భీష్ముడు చేసిన బోధనల ఆధారంగా భారతదేశంలో రాజనీతి శాస్త్ర వికాసాన్ని గురించి శ్రీకరపాత్రీ స్వామి చెబుతున్నారు. వేనరాజును గద్దె దించడం, పృథు చక్రవర్తికి పట్టం కట్టడం వరకు గల గాథలు ఇందులో ఉన్నాయి.**

**భా**రతం శాంతిపర్వంలో భీష్ముడు, ధర్మరాజుతో ఇంకా ఇలా చెప్పాడు...

'ఆది కృతయుగంలో రాజ్యం అనే భావన ఎలా ఉదయించిందో విను. ఆ కాలంలో రాజ్యం, రాజు, దండించేవారు అంటూ ఎవరూ లేరు. ప్రజలందరూ ధర్మాన్ని అనుసరించి నడుచుకునేవారు. అటువంటి ధర్మం వల్లనే తాము రక్షణ పొందేవారు. ఆ కాలంలో అనంతమైన విద్యలన్నింటికీ ఉద్గమ స్థానం..అంటే పుట్టుక చోటు, ఆ విద్యలకు పరమ ప్రయోజనం కూడా వేదమే. దానిని అనుసరిస్తూ వచ్చిన అర్థం వంటివన్నీ ఆనాటివారు అభ్యసించేవారు. అందువల్ల ధర్మం, అర్థం, కామం, మోక్షాలను వివేకపూర్వకంగా సాధించుకునే వారితోనే అన్ని వ్యవస్థలూ నిండి ఉండేవి. సభ్యత, సంస్కృతి, జ్ఞాన-విజ్ఞానాలు ఉన్నతమైన పరాకాష్ఠ స్థితికి చేరుకుని ఉండేవి. (భవిష్యత్తులో స్వర్ణయుగం వస్తుందని రూసో, మార్క్స్ మొదలైన వారి కల్పించిన సిద్ధాంతాన్ని మనవారు పరిగణనలోకి తీసుకోరు.)

ధర్మం, నీతి కారణంగా అన్యోన్యంగా... పాలనా నియమాలకు కట్టుబడి, ఒకరిపై మరొకరికి అనురాగం కలిగిన ప్రజల మధ్య కాలక్రమంలో ఖేదం లేదా అలసట ప్రవేశించాయి. దానివల్ల వారిలో మోహం బయలుదేరింది. మోహం కారణంగా స్మృతిభ్రంశం కలిగింది.దానివల్ల ధర్మానికి లోపం కలగ సాగింది. స్మృతిభ్రంశం కలిగిన కారణంగా ప్రజలు లోభానికి వశులై విచార హీనులయ్యారు. తత్ఫలితంగా రాగ ప్రవృత్తి, అట్టి ప్రవృత్తి నుంచి కామానికి ప్రాదుర్భావం జరిగింది. కామం వల్ల కార్యాకార్య జ్ఞానం లేకుండా పోయింది. అంతేకాకుండా అగమ్య-గమన, భక్ష్య-అభక్ష్య, వాచ్య-అవాచ్య, దోష-అదోష విచారణ కూడా నష్టమై పోయింది. ఏ దేశంలో అయితే వేదం ప్రజలకు కంఠస్థమై ఉండేదో ఆ దేశంలోనే వేదం లుప్తమైపోతూ వచ్చింది.

వేదాన్ని విస్మరించడం వల్ల వేదోక్తమైన ధర్మ,కర్మలకు కూడా లోపం ఏర్పడడం స్వాభావికంగా జరిగింది(దీనివల్ల మునుముందుగా ఈ దేశంలో వేదాది శాస్త్రాలు,అవి బోధించిన ధర్మ-కర్మలు, వివేకం-విజ్ఞానం పూర్ణరూపంలో ప్రకాశిస్తూ ఉండేవి అని స్పష్టమవుతోంది). ఈ స్థితిని చూసిన దేవతలు భయపడి బ్రహ్మదేవుని శరణు జొచ్చారు. తమ భయాన్ని పోగొట్టుకునే ఉపాయం చెప్పండి' అని కోరారు. బ్రహ్మగారు బాగా ఆలోచించి, అందరి క్షేమం కోసం... ధర్మ, అర్థ, కామ పురుషార్థాల సాధనను బోధించేలా లక్ష అధ్యాయాలతో కూడిన దండనీతి శాస్త్రాన్ని రూపొందించి దేవతలకు ఇచ్చాడు. దానిని మొట్టమొదటిగా శంకరుడు తీసుకున్నాడు. ఆయన నుంచి బృహస్పతి, శుక్రుడు, ఇంద్రుడు మొదలైనవారు స్వీకరించి ఆ శాస్త్రాన్ని సంక్షిప్తీకరిస్తూ వచ్చారు.

ఇట్టి శాస్త్రం కూడా వేదాభ్యాస జన్యమై, సుసంస్కృతమైన బ్రహ్మ బుద్ధి నుంచి ప్రాదుర్భూతం అయిన కారణంగా దీనిని వేదమూలకం అని చెప్పవచ్చు. ఆయా పరిస్థితుల్లో జనులపై విశేష రీతిలో ప్రభావాన్ని చూపుతుందనవచ్చు. ప్రభుసమ్మితాలైన వేదాలను దృష్టిలో ఉంచుకుని...శాస్త్రాలలో సుహృద సమ్మితాలైన వాక్యాల రూపంలో వ్యక్తమై మరింత ఉపయోగకారులు అయ్యాయి. అయినప్పటికీ వీటిని పూర్ణరూపంలో వినియోగించుకోవడానికి దండనీతి అవసరం అవుతుంది. దండనతో కలిసిన నిగ్రహానుగ్రహ శక్తి ద్వారా లోకరక్షణ హేతువుగా మారి ఈ దండనీతి సమాజంపై ప్రభావం చూపుతుంది. అందువల్ల యోగ్యుడు, సమర్థుడై దండప్రణేతను పొందడానికి దేవతలందరూ కలిసి విష్ణువు చెంతకు వెళ్లారు. తమకు శ్రేష్ఠుడైన పాలకుడిని ఇవ్వమని కోరారు. నారాయణుడు వారికి లోక పాలకుల దివ్యసద్గుణాలన్నీ నిండి ఉన్న ఒక నిర్దోషుడు, రజోగుణ రహితుడైన రాజుని తన మానసం నుంచి సృష్టించి ఇచ్చాడు.

అట్టి రాజుకు ప్రభుత్వం పట్ల నిరపేక్ష భావం కలిగింది. 'త్యాగ-వైరాగ్యాల' పట్ల అభిరుచి కలిగింది. అప్పుడు అతడి పుత్రుడు కీర్తిమానుడు, మనుమడైన కర్దముడు రాజులయ్యారు.కాలక్రమంలో వారి వంశంలో అంగరాజు, వేనరాజులు ఉద్భవించారు. వేనరాజు ఉత్పథగామి (తప్పుదోవల్లో పడ్డాడు)అయ్యాడు. అందువల్ల రుషులు అతడిని పదవీచ్యుతుడిని చేసి, అభిమంత్రించిన కుశలతో (దర్భలతో) చంపారు. అతడి పుత్రుడైన పృథువు రాజయ్యాడు. అతడు బహుయోగ్యుడు, ధర్మాత్ముడు. ' నేనేమి చేయాలి?మీరు నన్ను ఆజ్ఞాపించండి.' అని అతడు రుషులను ప్రార్థనా పూర్వకంగా అడిగాడు.

అప్పుడు రుషులు, 'నీవు నియతుడివై, నిశ్శంకతో ధర్మాన్ని ఆచరించు. స్వీయప్రయత్నంతో ప్రియ- అప్రియాలను విడిచిపెట్టి... కామం, క్రోధం, లోభం, మానం - అవమానాలను త్యాగం చేసి అన్ని ప్రాణులకూ సమాన రూపంగా హితాచరణ చేయి. ధర్మం నుంచి విచలితులై నడుచుకునేవారిని శాస్త్రధర్మాన్ని అనుసరించి నిగ్రహించు. నీ చిత్తం వచ్చినట్లు నడుచుకోనని ప్రతిజ్ఞ చేయి' అని కోరారు.

ఈ విధంగా రుషులు - పృథు చక్రవర్తి పరస్పరం వచనబద్ధులై రాజ్యవ్యవస్థను ఏర్పరిచారు. దీనినే 'సోషల్ కాంట్రాక్ట్' అని పేర్కొనవచ్చు. పృథువుకు శుక్రాచార్యుడు పురోహితుడు అయ్యాడు. వాలఖిల్యాది రుషిగణాలు మంత్రులయ్యారు. ఇంద్రాది దేవతల సమక్షంలో పృథువును విష్ణువే అభిషేకించాడు. పృథువు ప్రజారంజకంగా పాలించాడు. అందువల్లనే అతడు చరిత్ర ప్రసిద్ధుడయ్యాడు.

**హిందీమూలం : కరపాత్రీ స్వామి**
**అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ**

# ఐపీఎల్‌లో పరుగుల హోరు, శతకాల జోరు!

**ఐపీఎల్-2026 సీజన్ తొలిభాగం పోరు పరుగుల సునామీతో సాగిపోతోంది. లీగ్ దశలోని మొదటి 36 మ్యాచ్‌లు ముగిసే సమయానికే వివిధ జట్లకు చెందిన ఏడుగురు బ్యాటర్లు ఎనిమిది శతకాలు సాధించడం ద్వారా సరికొత్త రికార్డుకు మార్గం సుగమం చేశారు.**



భారత క్రికెట్ అభిమానుల వేసవి వినోదం ఐపీఎల్ –2026 సీజన్ సిక్సర్ల హోరు, శతకాల జోరు, పరుగుల వెల్లువలా సాగిపోతోంది. మొత్తం 10 జట్ల లీగ్ దశ పోరులోని మొదటి 36 మ్యాచ్‌లు ముగిసే సమయానికే పలు సరికొత్త రికార్డులు నమోదయ్యాయి. అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడికి ఇచ్చే. 'ఆరెంజ్ క్యాప్' పోరు రసవత్తరంగా సాగుతోంది. దిగ్గజ బ్యాటర్ విరాట్ కోహ్లీ, సన్ రైజర్స్ హైదరాబాద్ సునామీ ఓపెనర్ అభిషేక్ శర్మ, రాజస్థాన్ రాయల్స్ కుర్రబ్యాటర్ వైభవ్ సూర్యవంశీల నడుమ మూడు స్తంభాలాట జరుగుతోంది.

**సంజు శాంసన్ శతక బోణీతో....**

ఐపీఎల్ –19 సీజన్ లీగ్ దశలో తొలిశతకం సాధించిన ఆటగాడి ఘనతను చెన్నై సూపర్ కింగ్స్ డాషింగ్ ఓపెనర్ సంజు శాంసన్ దక్కించుకొన్నాడు. అంతేకాదు రెండు శతకాలు బాదిన తొలి బ్యాటర్‌గా నిలిచాడు. ఢిల్లీ క్యాపిటల్స్ పైన 115, ముంబై ఇండియన్స్ పైన 101 పరుగుల నాటౌట్ స్కోర్లతో సంజు తనకు తానే సాటిగా నిలిచాడు. రెండు వేర్వేరు ఫ్రాంచైజీల తరపున రెండేసి శతకాలు సాధించిన తొలి బ్యాటర్ రికార్డును సంజు నెలకొల్పాడు, రాజస్థాన్ రాయల్స్ , చెన్నై సూపర్ కింగ్స్ తరపున రెండేసి శతకాలతో పాటు గతంలో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆడిన సమయంలో మరో శతకాన్ని సాధించాడు. మొత్తంగా తన ఐపీఎల్ శతకాల సంఖ్యను ఐదుకు పెంచుకోగలిగాడు.

ఇటీవలే ముగిసిన టీ-20 ప్రపంచకప్‌లో భారత్‌ను కేవలం తన బ్యాటింగ్ ప్రతిభతోనే విజేతగా నిలిపిన సంజు శాంసన్ గత సీజన్ వరకూ రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిథ్యం వహించాడు. ప్రస్తుత సీజన్ నుంచే రూ.18 కోట్ల కాంట్రాక్టుపై చెన్నై ఫ్రాంచైజీ జట్టులో చేరాడు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆడిన మొదటి ఎనిమిది మ్యాచ్ ల్లోనే 180కి పైగా స్ట్రయిక్ రేటుతో పాటు రెండు శతకాలు సహా 280కి పైగా పరుగులు సాధించాడు. ప్రస్తుత సీజన్లో ఇప్పటి వరకూ ఆడిన మ్యాచ్‌ల్లో చెన్నై తరపున అత్యధిక పరుగులు సాధించినవాడిగా నిలిచాడు.

**అగ్రస్థానంలో విరాట్ కోహ్లీ....**

2008 ప్రారంభ ఐపీఎల్ నుంచి రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకే ఆడుతూ వస్తున్న విరాట్ కోహ్లీ అత్యధికంగా 8 శతకాలు సాధించడమే కాదు.. ప్రస్తుత 19వ సీజన్‌లో సైతం అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్ రేసులో యువ క్రికెటర్లు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీలకు గట్టి పోటీ ఇస్తున్నాడు.

ఐపీఎల్ చరిత్రలో అత్యధిక శతకాలు బాదిన మొదటి నలుగురు బ్యాటర్ల రికార్డును విరాట్ కోహ్లీ (8), జోస్‌బట్లర్ (7), క్రిస్ గేల్ (6), కెఎల్ రాహుల్ (6), రోహిత్ శర్మ (5), సంజు శాంసన్ (5) పంచుకొన్నారు.

2026 ఐపీఎల్ లో మొదటి 36 మ్యాచ్ ల్లోనే శతకాలు నమోదు చేసిన ఆటగాళ్లలో సంజు శాంసన్ (2), క్వింటన్ డి కాక్, తిలక్ వర్మ, అభిషేక్ శర్మ, సాయి సుదర్శన్, కెఎల్ రాహుల్, వైభవ్ సూర్యవంశీ ఉన్నారు. ఆరు జట్లకు చెందిన ఏడుగురు బ్యాటర్లు కలిసి ఎనిమిది శతకాలు సాధించడం ఓ అరుదైన రికార్డుగా మిగిలిపోతుంది.

**'టాప్ గేర్' లో కింగ్స్ పంజాబ్....**

గత 18 సీజన్లకు భిన్నంగా ప్రస్తుత 19వ సీజన్ ప్రారంభ రౌండ్ల మ్యాచ్‌లు పరుగుల వెల్లువతో సాగిపోతున్నాయి. ముందుగా బ్యాటింగ్ దిగిన జట్టు 200కు పైగా పరుగులు సాధించడం ఇప్పుడు మామూలు విషయంగా మారిపోయింది. అంతే కాదు..250కి పైగా పరుగుల లక్ష్యాన్ని ప్రత్యర్థి ఎదుట ఉంచినా విజయానికి భరోసా లేకుండా పోయింది.

న్యూఢిల్లీ అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్ జట్ల నడుమ జరిగిన పోరులో పరుగుల వర్షమే కురిసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ జట్టు 20 ఓవర్లలో 2 వికెట్లకు 264 పరుగుల స్కోరు సాధించింది. 265 పరుగుల రికార్డు లక్ష్యాన్ని పంజాబ్ కింగ్స్ సాధించిన తీరు ఐపీఎల్ ఉన్నత ప్రమాణాలకు నిదర్శనంగా మిగిలిపోతుంది. ఓవర్‌కు 13 పరుగుల చొప్పున సాధించడం ద్వారా పంజాబ్ జట్టు చేజింగ్‌లో సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఐపీఎల్ 19 సీజన్ల చరిత్రలో అత్యధిక 200 స్కోర్లు సాధించిన జట్టుగా, అత్యధిక లక్ష్యం (265) సాధించిన జట్టుగా గతేడాది రన్నరప్ పంజాబ్ కింగ్స్ తనకుతానే సాటిగా నిలిచింది.

ఇప్పటికే ఐదేసిసార్లు ఐపీఎల్ ట్రోఫీ అందుకొన్న ఘనమైన రికార్డు కలిగిన చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్, రెండుసార్లు విజేత కోల్‌కతా నైట్ రైడర్స్ జట్లు స్థాయికి తగ్గట్టుగా రాణించలేక సతమత మవుతున్నాయి.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, హైదరాబాద్ సన్ రైజర్స్, గుజరాత్ టైటాన్స్ జట్లకు మాత్రమే డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ దశ నుంచి నాకౌట్ రౌండ్ చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

లీగ్ దశలోని మిగిలిన 34 రౌండ్ల మ్యాచ్ ల్లో ఏవైనా అద్భుతాలు జరిగితే తప్ప పంజాబ్, బెంగళూరు, జైపూర్, హైదరాబాద్ జట్లను ప్రస్తుత సీజన్ హాట్ ఫేవరేట్ జట్లుగా కనిపిస్తున్నాయి. విజేతగా ఏజట్టు నిలిచినా మిగిలిన సగం మ్యాచ్‌ల్లో పలు సరికొత్త రికార్డులు నమోదు కావడం ఖాయమనడంలో ఏమాత్రం సందేహం లేదు.



**కృష్ణారావు చొప్పరపు**
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

## ఆర్మూర్‌లో పోస్ట్‌మాన్‌లకు సన్మానం



**ఇందూరు :** దేశభక్తి అంశాలతో కూడిన జాగృతి వార పత్రికను ప్రతి వారం పాఠకులకు సరైన సమయంలో అందిస్తున్న ఏడుగురు పోస్ట్‌మాన్‌లను ఆర్మూర్ హెడ్‌పోస్ట్‌ఆఫీస్‌లో జాగృతి మిత్రబృందం ఆధ్వర్యంలో ఏప్రిల్ 21న శాలువాలు, జ్ఞాపికలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పోల్కం నారాయణ, నరసయ్య, టి.దయాసాగర్ తదితర జాగృతి మిత్రబందంతోపాటు హెడ్ పోస్ట్‌మాస్టర్ బి. కిషన్‌నాయక్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం జాగృతి పత్రిక ద్వారా సన్మానింపబడుతున్నందుకు పోస్ట్‌మ్యాన్‌లు సంతోషం వ్యక్తం చేశారు.




**పాలమూరు :** జయశంకర్ కాలనీలో ఏప్రిల్ 26న జరిగిన హిందూ సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా శ్రీ విశ్వామిత్ర తపోభూమి ఆశ్రమం శ్రీ భక్త సురేశ్, సామాజిక కార్యకర్త పి. హైందవి, దక్షిణమధ్య క్షేత్ర ధర్మజాగరణ ప్రముఖ్ అమరలింగన్న పాల్గొని ప్రసంగించారు.




**సూర్యాపేట:** ఏప్రిల్ 27న జరిగిన సూర్యాపేట జిల్లా సంఘ కార్యాలయం ప్రారంభోత్సవంలో క్షేత్రప్రచారక్ భరత్, ప్రాంత సంఘచాలక్ సుందర్‌రెడ్డి, మాధవస్మారక సమితి అధ్యక్షులు దాచేపల్లి సుధీర్, కార్యదర్శి పర్వతం శ్రీధర్, జిల్లా కార్యకర్తలు, స్వయంసేవకులు 500 మంది పాల్గొన్నారు.





**నల్లగొండ :** ఎస్ఎల్‌బిసి బస్తీ హిందూ సమ్మేళనంలో ముఖ్య అతిథి సద్గురు శ్రీ సురేశ్వరాచార్య, విశిష్ట అతిథి మాకమల్ల శివకుమార్, గుండ్ల శారద, బలవత్రి గణేష్, సమ్మేళనసమితి అధ్యక్షులు, ప్రధానకార్యదర్శి, హిందూ బంధువులు పాల్గొన్నారు.



**విజయవాడ:** ఏప్రిల్ 26న విజయవాడలో సమాలోచన సంస్థ ఆధ్వర్యంలో **'భావదాస్య మూలాలు'** గ్రంథావిష్కరణ జరిగింది. పాట్నా హైకోర్టు ప్రధానన్యాయమూర్తి (రిటైర్డ్) జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రచయిత డా॥ బొమ్మరాజు సారంగపాణి, నవయుగ భారతి కార్యదర్శి నేతి క్షీరసాగర్, ప్రచురణ విభాగం రెండు ప్రాంతాల సంయోజక్ డా॥ వడ్డి విజయసారథి, కె.రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.





**తిరుపతి :** శ్రీమాత బాలికల ఆవాసం, తిరుపతి నాలుగవ వార్షికోత్సవం ఏప్రిల్ 25న తిరుపతి శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ గైనకాలజిస్ట్ డా॥ఆర్. నిరుపమ, అఖిల భారత ధర్మజాగరణ సహసంయోజక్ ఏలె శ్యాంకుమార్ పాల్గొని మార్గదర్శనం చేశారు.

**కర్నూలు:** గ్రామవికాస్ ఆధ్వర్యంలో గూడూరులో డాక్టర్ శ్రీరాములు యాదవ్ సాగుచేస్తున్న 140 ఎకరాల గోఆధారిత ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో జరిగిన భూమి సుపోషణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆదోని శాసన సభ్యులు డాక్టర్ పార్థసారథి పాల్గొన్నారు. 8 గ్రామాల నుండి మహిళల రైతులతో సహా 140 మంది పాల్గొన్నారు.





**భాగ్యనగర్ :** వందేమాతర గీతం రచించి 150 సంవత్సరాలు, సంఘశతాబ్ది సందర్భంగా ఏప్రిల్ 26న భాగ్యనగర్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో జరిగిన భారతీయ సాంస్కృతిక సమ్మేళనంలో ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేశ్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి నైనాసెహ్వాల్, ప్రముఖ సినీ రచయిత విజేంద్రప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. ఈ సమ్మేళనంలో మహిళలు, పురుషులు కలిపి 3800మంది హాజరయ్యారు.

# బాల జాగృతి



## ఉల్లిపాయ దొంగ | కథ

ఒక ఊరిలో ఆకతాయి కుర్రవాడు ఎవ్వరు ఏమి మంచి చెప్పినా వినేవాడుకాదు. పైపెచ్చు దొంగతనం అలవాటైంది. అలా అతను ఒకరోజు ఉల్లిపాయలు దొంగిలిస్తుంటే ఊళ్లో వాళ్లు పట్టుకున్నారు. రాజుగారి దగ్గరకు తీసుకుని వెళ్లారు.

రాజుగారు ఆ అబ్బాయిని మూడు శిక్షలలో ఒకటి ఎంపిక చేసుకోమన్నారు. ఒకటి– దొంగిలించిన ఉల్లిపాయలన్నీ తినడం; రెండు– వంద కొరడా దెబ్బలు భరించడం, మూడు– జరిమానా చెల్లించడం?

ఆ అబ్బాయి ఏమీ ఆలోచించకుండా వెంటనే ఉల్లిపాయలు తినేస్తాను అన్నాడు. ఉల్లిపాయలు తినడం మొదలుపెట్టాడు. కానీ అది అనుకున్నంత సులువైన పని కాదు. ఒక్కటి కూడా పూర్తిగా తినకుండానే కళ్లల్లోంచి, ముక్కు లోంచి నీళ్లు కారడం మొదలైంది. అయినా మొండిగా ఇంకా రెండు తిన్నాడు, ఇక తన వల్ల కాలేదు.



సరే ఇది కాదు, కొరడా దెబ్బలే తింటాను అని చెప్పాడు. సైనికులు కొరడాతో కొట్టడం మొదలు పెట్టారు. కొరడా దెబ్బాలంటే మాటలా? నొప్పి తట్టుకోలేకపోయాడు. బాబోయ్! బాబోయ్! జరిమానా కట్టేస్తాను, ఆపండి! అని ఏడుపు మొదలెట్టాడు.

ఏడుస్తూనే జరిమానా చెల్లించాడు. ఇప్పుడు ఆ అబ్బాయికి బాగా అర్థం అయ్యింది. ఏదైనా తప్పు పని చేస్తే అది మనల్ని ముప్పుతిప్పలు పెడుతుందని. ఆ తరువాత ఆ అబ్బాయి ఎప్పుడూ దొంగతనం కాని, వేరే తప్పుడు పనులు కాని చేయలేదు. ★

## మంచిమాట

అవసరానికి మించిన
వినయం మోసానికి
సంకేతం

## మెదడుకు మేత

అడ్డం కోస్తే చక్రం,
నిలువు కోస్తే శంఖం..
ఏమిటది?

జవాబు : ఉల్లిపాయ

## పద్యం

అక్కఱపాటు వచ్చు సమయంబునఁజుట్టములొక్కరొక్కరిన్
మక్కువనుద్ధరించుటలు మైత్రికిఁజూడగ యుక్తమే సుమీ
యొక్కట నీటిలో మెరక నోడల బండ్లను బండ్లనోడలున్
దక్కక వచ్చుచుండుట నిదానము గాదె తలంప భాస్కరా!

**భావం :** అవసరం కలిగినప్పుడు ప్రేమతో సహకరించుకోవడం, రక్షించుకోవడం బంధుత్వం, స్నేహం విషయంలో సహజమే. నీటిలో నడిచే ఓడల మీద బండ్లను, నేలపై నడిచే బండ్లపై ఓడలను తరలించడం సాధారణమే కదా?

## శ్లోకం

లోభాత్క్రోధః ప్రభవతి లోభాత్ కామః ప్రజాయతే
లోభాన్మోహశ్చ నాశశ్చ లోభః పాపస్య కారణమ్

**భావం :** లోభం వలన కోపం కలుగుతుంది. లోభం కారణంగా కోరికలు పెరుగుతాయి. లోభంతో మోహం ఏర్పడుతుంది. లోభం కారణంగా నాశనం కూడా సంభవిస్తుంది. సమస్త పాపాలకు లోభమే కారణమవుతుంది.

## జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| యువతి | దిటము |
| దృఢము | ఉవిద |
| నిజము | కబ్బము |
| కావ్యము | సందియం |
| సందేహం | నిక్కము |

జవాబులు : యువతి–ఉవిద, దృఢము–దిటము, నిజము–నిక్కము, కావ్యము–కబ్బము, సందేహం–సందియం.

## శాస్త్రవేత్తలు

### ఎ. శివతాను పిళ్లై



తమిళనాడుకు చెందిన ప్రముఖ అంతరిక్ష శాస్త్రవేత్త. అప్పటి ట్రావెన్‌కోర్ సంస్థానంలోని నాగర్‌కోయిల్‌లో 1947 జూలై 15న జన్మించారు. ఇస్రో, DRDOలో పిళ్లై నాలుగు దశాబ్దాల పాటు సేవలందించారు. విక్రమ్ సారాభాయ్, సతీష్ ధావన్, ఏపీజే అబ్దుల్ కలామ్‌లతో కలిసి పనిచేశారు. అబ్దుల్ కలామ్ వద్ద సమీకృత గైడెడ్ క్షిపణి అభివృద్ధి కార్యక్రమంలో ప్రోగ్రామ్ డైరెక్టరుగానే చేశారు. SLV- 3 అభివృద్ధిలోను, PSLV రూపొందించడంలోనూ కీలక పాత్ర పోషించారు.

## జనరల్ నాలెడ్జ్

1. ప్రపంచంలో ఏ దేశంలో అసలు నదులే లేవు?
2. భారత కరెన్సీ నోటుపై ఎన్ని భాషలు ముద్రిస్తారు?
3. ఏ చెట్టును 'మ్యాజికల్ ట్రీ' లేదా 'కల్పవృక్షం' అని పిలుస్తారు?

జవాబులు : 1. వాటికన్ సిటీ; 2. 17 భాషలు; 3. కొబ్బరి

## భక్తాగ్రేసరులు

### ముక్తాబాయి



మహారాష్ట్రలో వరాకరీ సంప్రదాయానికి చెందిన విఠల్ పంత్ కులకర్ణి, రుక్మాబాయి దంపతులు కూతురు ముక్తాబాయి. ప్రముఖ యోగి, సంకీర్తనాచార్యులు జ్ఞానదేవ్ సోదరి. చిన్నతనంలోనే మరాఠీ భాషలో అభంగాలు (ఆధ్యాత్మిక భజన్)రాసింది. యోగులుగా కనిపిస్తూ అసహనం ప్రదర్శించే వారిని ఉద్దేశించి 'జనం పరుష పదాలతో నిందించినా యోగులు కోపగించరాదు' అని తన రచనల్లో పేర్కొంది. ఒకసారి ఆమె సోదరుడు కొందరి ప్రవర్తనకు కోపగించి పర్ణశాల తలుపులు మూసుకొని లోపలే ఉండిపోయిన సందర్భంలో ముక్తాబాయి అలా రాసింది. ఇతరుల కన్నా తనే మిన్న అని గొప్పలకు పోయిన నామదేవుడు లాంటి వారు సన్మార్గులు కావడానికి కారణమైంది. పండరీపూర్‌లో విఠోభా ఆలయంలో దేవుడికి ప్రణామం చేసిన ఆమె నామదేవుడిని పట్టించుకోలేదు. దేవుడి సమక్షంలో ఎంతటివారికైనా నమస్కరించవలసిన అవసరంలేదని, పైగా, ఆధ్యాత్మిక గురువువంటూ లేని వారికి అసలే అవసరంలేదని పేర్కొంది. దీనిపై చర్చోపచర్చల అనంతరం ఆయన సంత్ గోరా కుంభార్‌ను కలిశారు. నామదేవ్‌ను పరీక్షించిన కుంభార్, 'మార్గదర్శనం చేసే గురువు అవసరం ఉందని' స్పష్టం చేశారు. దాంతో జ్ఞానదేవుడి శిష్యుడు, గతంలో తన ప్రత్యర్థి విశోబా ఖేచర్‌ను ఆశ్రయించాడు. ఖేచర్ హితవుతో నామదేవుడికి జ్ఞానోదయమై అసలైన యోగిగా అవతరించాడు. ముక్తాబాయి పద్దెనిమిదేళ్ల వయసులో పిడుగుపాటుతో మరణించింది. అయినా ఆమె అభంగ్ ఆమెను చిరస్మరణీయురాలిగా చేశాయి. ★




# వారఫలాలు

**4-11 మే, 2026**



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

ఆకస్మిక ధనలబ్ధి. కుటుంబంలో చికాకులు తొలగి ఊపిరిపీల్చుకుంటారు. వ్యాపారాలలో అనుకున్న లాభాలు ఆర్జిస్తారు. భాగస్వాములతో మరింత సఖ్యత నెలకొంటుంది. ఉద్యోగులు బాధ్యతలు సకాలంలో పూర్తి చేసి ప్రశంసలు అందుకుంటారు. కళాకారులకు నూతన అవకాశాలు. రచయితలు, పరిశోధకులు అనుకున్న విజయాల సాధిస్తారు. 4,5 తేదీలలో ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. శివపంచాక్షరి పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

విద్యార్థుల ఆశలు ఫలించే సమయం. వాహనాలు కొనుగోలు. కొత్త నిర్ణయాలు తీసుకుంటారు. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యల నుంచి గట్టెక్కుతారు. నూతన పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగాలలో పైస్థాయి నుంచి ప్రశంసలు అందుతాయి. రాజకీయవేత్తలకు విశేష ప్రజాదరణ లభిస్తుంది. రచయితలు, సాంకేతిక నిపుణులకు మరింత అనుకూలం. 6,7 తేదీల్లో వృథా ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. హనుమాన్ చాలీసా పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

సోదరులు, సోదరీలతో ముఖ్య విషయాలు చర్చిస్తారు. ఆరోగ్యపరంగా ఇంతకాలం పడిన చికాకులు తొలగుతాయి. వ్యాపారులకు కొత్త పెట్టుబడులు అందుతాయి. విస్తరణలో ముందుకు సాగుతారు. ఉద్యోగులకు విశేష గుర్తింపు లభిస్తుంది. పారిశ్రామికవేత్తలకు సంతోషకరమైన సమాచారం. కళాకారులు, రచయితలు మంచి గుర్తింపు పొందుతారు. 9,10 తేదీల్లో స్నేహితులతో వివాదాలు. శ్రమాధిక్యం. గణపతిని పూజించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ఆశ్చర్యకరమైన సంఘటనలు ఎదురుకావచ్చు. రుణబాధలు చాలావరకూ తొలగుతాయి. కుటుంబ సభ్యుల ప్రేమ అధికమవుతుంది. శుభకార్యాలు. వ్యాపారులు ఉత్సాహంగా సాగుతాయి. భాగస్వాముల నుంచి పెట్టుబడులు అందుతాయి. సహోద్యోగులతో ఆనందంగా గడుపుతారు. పారిశ్రామిక, రాజకీయ వేత్తలకు విదేశీ పర్యటనలు ఉంటాయి. కళాకారులకు సన్మానయోగం. 7,8 తేదీల్లో బంధువిరోధాలు. దూరప్రయాణాలు. శివాష్టకం పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

సోదరులు, సోదరీలతో సఖ్యత. స్వల అనారోగ్యం, ఔషధసేవనం. వ్యాపారాల విస్తరణలో ఆటంకాలు తొలగుతాయి. కొత్త భాగస్వాములను కలుపుకుంటారు. ఉద్యోగులు అదనపు విధులు సమర్థవంతంగా నిర్వహిస్తారు. కళాకారులు, రాజకీయవేత్తలకు మంచి గుర్తింపు రాగలదు. రచయితలు, క్రీడాకారులకు పురస్కారాలు. 6,7 తేదీల్లో బంధువిరోధాలు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

పట్టింది బంగారమే అన్నట్లుంటుంది. కార్యజయం. అందరిలోనూ మీ సత్తా చాటు కుంటారు. వాహనాలు, ఇళ్ల కొనుగోలు యత్నాలు కలసివస్తాయి. వ్యాపారాలలో ఆశించిన లాభాలు దక్కుతాయి. ఉద్యోగులకు విధి నిర్వహణలో అవాంతరాలు తొలగుతాయి. కళాకారులు, పరిశోధకులు అనుకున్నది సాధిస్తారు. 7,8 తేదీల్లో దూరప్రయాణాలు. మానసిక అశాంతి. లక్ష్మీస్తోత్రాలు పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

రావలసిన సొమ్ము సకాలంలో అందక ఇబ్బంది పడతారు. మీ ప్రతిపాదనలు కుటుంబసభ్యులు వ్యతిరేకిస్తారు. శారీరక రుగ్మతలు బాధిస్తాయి. వ్యాపారాలు ఆశించిన లాభాలు కష్టమే. పెట్టుబడులకు అన్వేషిస్తారు. ఉద్యోగాలలో పదోన్నతులు నిరాశ పరుస్తాయి. రాజకీయవేత్తలు, కళాకారులకు, రచయితలు కొంత నిరాశ చెందుతారు. 6,7 తేదీల్లో శుభవార్తలు. వాహనసౌఖ్యం. దత్తాత్రేయ స్తోత్రాలు పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ఇంతకాలం పడిన కష్టం ఫలించే సమయం. అరుదైన ఆహ్వానాలు రాగలవు. స్థిరాస్తి వృద్ధి. వాహన, గృహయోగాలు. వ్యాపారులకు ఒడిదుడుకులు తొలగుతాయి. ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు, పదోన్నతులు లభిస్తాయి.. పారిశ్రామిక వర్గాలకు నూతనోత్సాహం. కళాకారులు, రచయితలకు అవార్డులు. 7,8 తేదీలలో వ్యయప్రయాసలు. ధనవ్యయం. అనారోగ్యం. శివపంచాక్షరి పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

ఆస్తుల వ్యవహారాలలో చికాకులు తొలగుతాయి. సోదరులు, స్నేహితులతో ఆనందంగా గడుపుతారు. దేవాలయాలు సందర్శిస్తారు. వాహనయోగం. కీలక నిర్ణయాలు. వ్యాపారులు మరింతగా లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు పదోన్నతులు. రాజకీయ వేత్తలు, కళాకారులు, క్రీడాకారులకు నూతనోత్సాహం. 4,5 తేదీలలో బంధువిరోధాలు. ఆరోగ్య సమస్యలు. దేవీస్తోత్రాలు పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

ఆదాయం సంతృప్తినిస్తుంది. కొత్త కార్యక్రమాలు చేపడతారు. ఆత్మీయులతో ఆనందంగా గడుపుతారు. ఆలోచనలు కార్యరూపంలో పెడతారు. వ్యాపారులకు అధికమొత్తంలో లాభాలు. ఉద్యోగులకు ఉన్నత పోస్టులు దక్కుతాయి. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, రచయితలకు నూతనోత్సాహం. 9,10 తేదీలలో అనుకోని ప్రయాణాలు. కుటుంబంలో చికాకులు. ఆంజనేయ దండకం పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

బంధువర్గంతో వివాదాలు సర్దుబాటు కాగలవు. భూ, గృహయోగాలు. ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపారస్తులకు అధిక లాభాలు. ఉద్యోగులకు ఒత్తిడులు తొలగుతాయి. పారిశ్రామిక, రాజకీయ వర్గాలకు, క్రీడాకారులకు మరింత అనుకూల సమయం. 8,9 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. కుటుంబసమస్యలు. అనారోగ్యం. వేంకటేశ్వరస్వామి స్తోత్రాలు పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

ఇంటి నిర్మాణయత్నాలు సానుకూలమవుతాయి. చిరకాల మిత్రులను కలుసుకుంటారు. పలుకుబడి మరింత పెరుగుతుంది. పరిస్థితులు అనుకూలంగా మార్చుకుంటారు. వ్యాపారస్తులకు లాభాలు అందుతాయి. ఉద్యోగులకు ఉన్నత పోస్టులు లభిస్తాయి. రాజకీయవేత్తలు, కళాకారులు, రచయితలకు ఆహ్వానాలు అందుతాయి. 8,9 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. ఆరోగ్యసమస్యలు. వివాదాలు. అంగారక స్తోత్రాలు పఠించండి.

# పదరసం-562

**ఆధారాలు**

1. బృహస్పతి కుమారుడు (3)
3. అసమానం (3)
6. కోరికలు (3)
7. అందం, సౌందర్యం (3)
9. సంవత్సరం (2)
10. రుషి (2)
11. బాణం, విక్రయించు (2)
13. ధర్మం, పాలు (2)
14. నిరంతరం, ఎడతెగని (3)
17. కలకత్తాలోని అమ్మవారు (2)
18. దిక్కులు, స్థానాలు … చెల్లాచెదరు (3)
19. ప్రేయసే (4)
22. వ్యవహార భాషాపితామహుడి ఇంటిపేరు (3)
24. ఆత్మాభిమానం గల స్త్రీ (3)
26. సమరం (3)
27. ఒప్పు కాదు (2)
28. భ్రమరం (3)
29. వల, ఈటె (2)
31. సుర, మద్యం (3)
32. మృగతృష్ణ (4)

**నిలువు**

2. బంధువులు (3)
3. పిడుగుపాటు (5)
4. ఉపకారం (2)
5. జాహ్నవి (2)
6. గర్వం, మదం (2)
7. నగలు, డబ్బులు (3)
8. ముత్తైదువ (4)
9. సంసారాన్ని దీనితో పోలుస్తారు (3)
12. దీని కంటే వడ్డీ ముద్దట (3)
15. ఒక లోహం (3)
16. చేయడమే (2)
17. యమధర్మరాజు (3)
19. మృదుభాషి(ణి) (4)
20. ఇదొక తృణధాన్యం, లోహం (2)
21. కూతుళ్ల భర్తలు (4)
23. దేవాలయం (2)
25. నిజం ఇలాంటిదట (2)
26. పోతన ఇంటిపేరు (3)
28. చివరి, కొన (2)
29. ఆమాకీ (2)
30. దండే … తిరబడింది (2)

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | | | 3 | 4 | | | 5 | |
| | | | 6 | | | | 7 | | 8 |
| 9 | | | 10 | | | 11 | | | |
| | | 12 | | 13 | | | | | |
| | | 14 | 15 | | | 16 | | 17 | |
| | 18 | | | | 19 | | 20 | | |
| 21 | | | | | | | 22 | | 23 |
| 24 | 25 | | | 26 | | | | | |
| 27 | | | 28 | | | | 29 | 30 | |
| | | 31 | | | | 32 | | | |

## పదరసం - 561 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 గ్రా | మం | | 2 వి | 3 చి | త్రం | | 4 మ | 5 మ | 6 త |
| వం | | 7 హ | రి | ల | | 8 సు | న | య | న |
| | 9 శ | | 10 వి | క | ట | క | వి | | య |
| 11 మ | ర్క | టం | | మ | | వి | | 12 రా | |
| 13 తి | ర | | 14 కా | ర్తి | 15 కం | | 16 గం | ధ | 17 ము |
| | | 18 కా | | | 19 కు | 20 రం | గి | | ను |
| 21 పా | 22 చి | క | | 23 ప్ర | భ | వ | | 24 రే | పు |
| 25 పా | త్ర | | 26 తా | క | ట్టు | | 27 మ | | |
| | 28 ప | డ | మ | ర | | 29 అం | దం | | 30 దా |
| 31 వా | టం | | 32 ర | ణం | | కం | | 33 ధ | ర |

సినిమా

# వేసవి సీజన్ చిన్న సినిమాలదే!




**ఒకప్పుడు వేసవి సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని వరుస చిత్రాలు పోటీపడేవి. తమ అభిమాన హీరోలు నటించిన సినిమాలు చూడడం కోసం సినీ ప్రియులు మండుటెండను సైతం లెక్కచేయకుండా థియేటర్ల దగ్గర క్యూ కట్టేవారు. అయితే అగ్రహీరోలు పాన్ ఇండియా సినిమాలపై దృష్టిపెట్టడం, చిన్న, మీడియం బడ్జెట్ చిత్రాలు విడుదలైనా అవి అంతగా అలరించకపోవడం.. ఇతర కారణాల వల్ల ఈ మధ్య వేసవి చిత్రాల హడావిడి తగ్గింది. ఈ యేడాది వేసవికి రావాల్సిన పాన్ ఇండియా సినిమాలు రకరకాల కారణాలతో వాయిదా పడ్డాయి.**

ఎండలు మొదలయ్యే మార్చి నెలలో ఎనిమిది అనువాద చిత్రాలతో కలిపి మొత్తం ఇరవై రెండు సినిమాలు విడుదలయ్యాయి. అయితే భారీ అంచనాలతో వచ్చిన పవన్ కళ్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' తీవ్ర నిరాశ పరచింది. ఏదో స్థాయిలో మెప్పిస్తాయని భావించిన శివాజీ, లయ 'సంప్రదాయిని సుప్పిని సుద్దపూసని', హర్ష్ రోషన్, శ్రీదేవి మూవీ 'బ్యాండ్ మేళం' బాక్సాఫీస్ బరిలో ఎలాంటి ప్రభావం చూపించలేకపోయాయి. ముందు అనుకున్న విధంగా జనం ముందుకు వచ్చిన అనువాద చిత్రం 'ధురంధర్ : ది రివేంజ్' మాత్రమే మార్చిలో ప్రేక్షకులను మెప్పించగలిగింది. ఇక ఏప్రిల్ నెలలో వచ్చిన చిన్న సినిమాలదీ అదే పరిస్థితి. ఈ నెలలో తొమ్మిది అనువాద చిత్రాలతో కలిపి మొత్తం 24 సినిమాలు విడుదల అయ్యాయి. అందులో 'రాకాస' కాస్తంత బెటర్ మూవీగా పేరు తెచ్చుకుంది. శర్వానంద్ 'బైకర్', అడివి శేష్ 'డెకాయిట్' నిర్మాతలకు లాభాలను అందించలేదు. నాగశౌర్య 'బ్యాడ్ బోయ్ కార్తీక్', తిరువీర్ 'పాపం ప్రతాప్' పరాజయం పాలయ్యాయి. అనువాద చిత్రం 'వాలా 2' మలయాళంలో భారీ కలెక్షన్స్ వసూలు చేసింది కానీ ఆ మ్యాజిక్ ఇక్కడ రిపీట్ కాలేదు. మొత్తం మీద మార్చి, ఏప్రిల్ మాసాలు నిర్మాతలకు ఏ రకంగానూ ఉపయోగపడలేదు.

వేసవి సీజన్‌లో విద్యార్థులంతా ఇప్పుడు సెలవులను ఎంజాయ్ చేస్తున్నారు. అందువల్ల విడుదల కాబోయే చిన్న సినిమాలకైనా కొంతలో కొంత మేలు జరుగుతుందని ఆశతో నిర్మాతలు ఉన్నారు. పైగా పెద్ద సినిమాల విడుదల వాయిదా పడటంతో ఇప్పుడు చిన్న సినిమాలే థియేటర్ల ముందు క్యూ కడుతున్నాయి. పనిలో పనిగా రీ-రిలీజ్ సినిమాల హవా కూడా మళ్లీ మొదలైంది. ఇటీవల వచ్చిన ప్రభాస్ 'డార్లింగ్'కు మంచి ఆదరణ లభించడమే దీనికి కారణం.

తరుణ్ భాస్కర్ 'గాయపడ్డ సింహం', సత్య హీరోగా నటిస్తున్న 'జెట్ లీ', చంద్ర మహేశ్ తెరకెక్కించిన 'పిఠాపురంలో...', మార్చిలో రావాల్సిన లావణ్య త్రిపాఠి 'సతీ లీలావతి' రంగంలో ఉన్నాయి. దీనితో పాటే రవి బాబు 'రేజర్', సుమంత్ ప్రభాస్ 'గోదారి గట్టుపైన', వెంకట్ 'హరుడు', జో శర్మ నటించిన 'ఎం4ఎం' సినిమాలు రాబోతున్నాయి. ఇక ఈ నెలలో వచ్చే సినిమాలలో ప్రధానంగా చెప్పుకోవాల్సింది సమంత నటించి, నిర్మించిన 'మా ఇంటి బంగారం' గురించి. నందినీ రెడ్డి, సమంత కాంబినేషన్‌లో గతంలో 'జబర్దస్త్, ఓ బేబీ' సినిమాలు వచ్చాయి. అందులో 'ఓ బేబి' మంచి విజయాన్ని అందుకుంది. దాంతో సహజంగానే 'మా ఇంటి బంగారం' మీద కూడా కాస్తంత అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సినిమా మే 15న విడుదల అవుతోంది. ఇదే నెలలో లారెన్స్ 'గంగ', శింబు 'వల్లభ', రవితేజ 'కృష్ణ', ఎన్టీఆర్ 'ఊసరవెల్లి', 'ఆంధ్రావాలా', మహేశ్ బాబు 'అతిథి' చిత్రాలు రీ-రిలీజ్ అవుతున్నాయి. అంటే మార్చి, ఏప్రిల్, మే నెలల్లో రావాల్సిన పలు పెద్ద సినిమాలు వాయిదా పడటంతో ఈ చిన్న సినిమాలు, రీ-రిలీజ్ మూవీస్‌కు మార్గం సుగమం అయ్యిందన్న మాట.

ఇక ...మార్చి 19న రావాల్సిన 'టాక్సిక్' జూన్ 4న విడుదల కాబోతోంది. యశ్ హీరోగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో వెంకట్ కె నారాయణ దీనిని నిర్మించారు. ఇక ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన రామ్ చరణ్ 'పెద్ది' సినిమాను జూన్ 25న విడుదల చేయబోతున్నామని, దర్శకుడు బుచ్చిబాబు సానా ఈ మధ్య అనధికారికంగా ప్రకటించారు. దీంతో మే 1న విడుదల కావాల్సిన 'లెనిన్'ను 'పెద్ది' కారణంగా జూన్ 26కి వాయిదా వేసుకున్న ఆ నిర్మాతల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. 'పెద్ది' జూన్ 25న వస్తే... చూస్తూ చూస్తూ 'లెనిన్'ను ఆ మర్నాడు రిలీజ్ చేయలేని పరిస్థితి. వెళితే ఇంకాస్తంత వెనక్కి వెళ్లాలి. లేదంటే జూన్ రెండు, మూడు వారాల్లో రావాలి. మరి ఏం చేస్తారో చూడాలి. అలానే ఏప్రిల్ 10న రావాల్సిన 'స్వయంభు' చిత్రం విడుదల కూడా వాయిదా పడింది. ఇక సినిమా ప్రారంభం సమయంలో వెంకటేశ్ – త్రివిక్రమ్ మూవీ 'ఆదర్శ కుటుంబం'ను సమ్మర్‌కు రిలీజ్ చేస్తామని చెప్పారు కానీ అదింకా సెట్స్ పైనే ఉంది. షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న చిరంజీవి 'విశ్వంభర' సైతం వేసవి కానుకగా రిలీజ్ అవుతుందనే ప్రచారం జరిగింది. ఇప్పుడు ఆ సినిమా ముచ్చటే లేకుండా పోయింది. మార్చిలో రావాల్సిన నాని 'ప్యారడైజ్' సైతం షూటింగ్ పూర్తి కాని కారణంగా ఆగస్ట్ 21కి వాయిదా పడింది. సమ్మర్‌కు రావాల్సిన సాయి దుర్గా తేజ్ 'సంబరాల యేటిగట్టు', వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' చిత్రాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి. విరాట్ కర్ణ 'నాగబంధం' సినిమా సైతం జూలై 3కి వాయిదా పడింది. ఇలా పెద్ద సినిమాలు, పాన్ ఇండియా సినిమాలు రకరకాల కారణాలతో వాయిదాలు పడటంతో ఈ యేడాది సమ్మర్ సీజన్‌ను చిన్న సినిమాలకు ఇచ్చేసినట్టయ్యింది.

**– అరుణ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్**

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.80/- | వెల : ₹.60/- | వెల : ₹.270/- | వెల : ₹.80/- | వెల : ₹.54/-




వెల : ₹.800/900 : 999/1200 | వెల : ₹.250/- | వెల : ₹.130/- | వెల : ₹.200/-




వెల:₹.999/- సెట్ | వెల:₹.450/- | వెల :₹.699/- | వెల : ₹.400/- | వెల : ₹.145/-

**పై పుస్తకములకు మరియు కొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి..**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

**సాహిత్య నికేతన్ :** కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

**సాహిత్య నికేతన్ :** వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,

**సాహిత్య నికేతన్ :** ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687

From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 29




మిమ్మల్ని ఆలోచింపజేసే ఇంటర్వ్యూలు,
ఆసక్తిని రేకెత్తించే సామాజిక, సాంస్కృతిక అంశాలను
జాగృతి ఇప్పుడు యూట్యూబ్ ద్వారా అందిస్తోంది.
జాతీయ దృష్టికోణంతో వివిధ అంశాలపై
మంచి ఆలోచనలు మన ముందుంచుతోంది.
రండి, జాగృతి యూట్యూబ్ ఛానల్‌ను చూడండి, సబ్‌స్క్రైబ్
చేయండి, మీ అభిప్రాయాలు అందరితో పంచుకోండి.

www.youtube.com/@Jagrititv

చెప్పండి మెచ్చండి పంచండి